thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

## సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 238 కరీంనగర్ బుధవారం, 5 నవంబర్ 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## భారత్‌తో కలిసి పనిచేస్తాం

బీజింగ్ : సరిహద్దుల వద్ద శాంతి, సుస్థిరత నెలకొల్పేందుకు భారత్‌తో కలిసి పనిచేసేందుకు తమ సైన్యం సిద్ధమని చైనా ప్రకటించింది. రెండు దేశాల సైనిక భవిష్యత్ సంబంధాలపై మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నకు చైనా రక్షణ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి ఝూంగ్ జియావోగాంగ్ స్పందిస్తూ ఈ విషయం చెప్పారు. అత్యంత పురాతన నాగరికతలు కలిగి ఉన్న ఈ రెండు దేశాల మధ్య దౌత్య సంబంధాలు ఏర్పడి 75 సంవత్సరాలు అవుతున్న సందర్భంలో గ్లోబల్ సౌత్‌లో ముఖ్యమైన స్థానాలను ఆక్రమించాయన్నారు. ప్రజల ఉమ్మడి ప్రయోజనాల కోసం కలిసి పనిచేయాలని నిర్ణయించుకున్నట్లు చెప్పారు.



## ఏపీ, తెలంగాణకు మళ్లీ వాన గండం..!

## బంగాళాఖాతంలో మరో వాయుగుండం!

హైదరాబాద్ / అమరావతి : తెలుగు రాష్ట్రాలపై వరుణుడు పగపట్టాడా అన్నట్లుగా పరిస్థితి కనిపిస్తోంది. తెలుగు రాష్ట్రాలను వర్షాలు వీడటం లేదు. వరుసగా వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. నిన్న మొన్నటి వరకూ మొంథా తుపాను ప్రభావంతో భారీ వర్షాలతో అతలాకుతలమైన తెలుగు రాష్ట్రాలకు మరో తుపాను ముప్పు పొంచి ఉంది. వాతావరణ శాఖ హెచ్చరిక మేరకు రానున్న మూడు రోజులలో తెలుగు రాష్ట్రాలలోని పలు ప్రాంతాలలో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. మంగళవారం ( నవంబర్ 4) బంగాళాఖాతంలో అల్పడీనం ఏర్పడింది. ఇది బలపడి వాయుగుండంగా, తుపానుగా మారే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. దీని ప్రభావంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది కొన్ని ప్రాంతాల్లో మోస్తరు వర్షాలు, మరికొన్ని ప్రాంతాల్లో భారీ వానలు పడతాయని వెల్లడించింది. బలమైన ఈదురుగాలులు కూడా వీస్తాయని వెల్లడించింది. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ ఉత్తర కోస్తాకు భారీ వర్ష సూచన ఉందని తెలిపింది.

## పెట్టుబడులపై ఫోకస్..!



### సీఎం రేవంత్‌తో జర్మనీ బృందం భేటీ..

హైదరాబాద్ : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో జర్మనీ కాన్సుల్ జనరల్ మైకేల్ హాస్పర్ బృందం ఈరోజు భేటీ అయ్యింది. డ్యుయిష్ బోర్స్ కంపెనీ విస్తరణలో భాగంగా తమ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్‌ను నేడు నగరంలో ప్రారంభిస్తు న్నట్లు ముఖ్యమంత్రికి జర్మనీ బృందం వివరించింది. జీసీసీ ఏర్పాటుకు హైదరాబాద్‌ను ఎంచుకున్నందుకు జర్మనీ బృందానికి సీఎం ధన్యవాదా లు తెలిపారు. హైదరాబాద్‌లో మరిన్ని పెట్టుబడులు పెట్టాలని, ఇందుకు ప్రజాప్రభుత్వం పూర్తి మద్దతుగా నిలిచి అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపారు. హైదరాబాద్ డ్యుయిష్ బోర్స్ కంపెనీ జీసీసీ ఏర్పాటుతో వచ్చే రెండేళ్లలో ఐటీ రంగంలో వెయ్యి మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలగనున్నట్లు సీఎంకు జర్మనీ బృందం వివరించింది. హైదరాబాద్‌ను ఇన్నోవేషన్ హబ్‌గా తయారు చేసేందుకు సహకరించాలని జర్మనీ బృందాన్ని ముఖ్యమంత్రి కోరారు. హైదరాబాద్‌లో జర్మనీ టీచర్లను నియమించి తెలంగాణ విద్యార్థులకు జర్మనీ భాషను నేర్పించేందుకు సహకరించాలని జర్మనీ కాన్సుల్ జనరల్‌ను రేవంత్ కోరారు. పెట్టుబడుల విషయంలో తెలంగాణ జర్మనీ భాగస్వామ్యాన్ని కోరుకుంటోందని ఈ సందర్భంగా తెలియజేశారు. ఐటీ, ఫార్మా, ఆటోమొబైల్ రంగంలో జర్మనీ కంపెనీలు పెట్టుబడులు పెట్టాలని కోరారు.




## చేవెళ్ల బస్సు ప్రమాదంపై సుమోటోగా HRC కేసు

హైదరాబాద్: 19 మంది ప్రాణాలు కోల్పోయిన చేవెళ్ల బస్సు ప్రమాద ఘటనలో కీలక పరిణామం చోటు చేసకుంది. చేవెళ్ల బస్సు ప్రమాదంపై రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ సుమోటోగా కేసు నమోదు చేసింది. వివిధ వార్త పత్రికల్లో వచ్చిన వార్త కథనాల ఆధారంగా హెచ్ఆర్సీ సుమోటోగా కేసు విచారణకు స్వీకరించింది. ఈ సంఘటనపై 2025, డిసెంబర్ 15లోగా సమగ్ర నివేదిక అందజేయాలని ప్రిన్సిపాల్ సెక్రటరీ, రోడ్లు రవాణా, భవనాల శాఖ, హోంశాఖ, రంగారెడ్డి జిల్లా కలెక్టర్, ఆర్టీసీ ఎండీ, నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా హైదరాబాద్ రీజినల్ ఆఫీసర్?కు హెచ్ఆర్సీ నోటీసులు జారీ చేసింది. చేవెళ్ల బస్సు ప్రమాదంలో 19 మంది ప్రాణాలు కోల్పోవడంపై స్టేట్ హ్యూమన్ రైట్స్ కమిషన్ చెర్మెన్ డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్ విచారణ వ్యక్తం చేశారు. కాగా, వికారాబాద్ జిల్లా చేవెళ్ల మండలం ఖానాపూర్ గేటు దగ్గర సోమవారం (నవంబర్ 3) ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం జరిగిన విషయం తెలిసిందే. రాంగ్ రూట్లో అతి వేగంగా దూసుకొచ్చిన టిప్పర్ ఆర్టీసీ బస్సును ఢీకొట్టింది. ఈ దుర్ఘటనలో 19 మంది ప్రాణాలు కోల్పోగా.. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. టిప్పర్, ఆర్టీసీ బస్సు డ్రైవర్లు ఇద్దరూ మృతి చెందారు. ప్రమాద సమయంలో బస్సులో 70 మంది ప్రయాణికులు ఉన్నారు. ఈ ఘటనకు టిప్పర్ అతి వేగమే కారణమని.. బస్సు డ్రైవర్ తప్పేం లేదని ఆర్టీసీ వివరణ ఇచ్చింది.

## జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో సీఎం రేవంత్ కొత్త ఎత్తుగడ..!




హైదరాబాద్ : జూబ్లీహిల్స్ ఉప ఎన్నికను కాంగ్రెస్ చాలా ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. బీఆర్ఎస్ వేస్తున్న ఎత్తులకు పైఎత్తులు వేస్తూ ముందుకు వెళ్తుంది.. రేవంత్ రెడ్డి, మీనాక్షి నటరాజన్ డైరెక్షన్ లో నేతలంతా ప్రచారంలో మునిగి పోతున్నారు. అయితే తాజాగా రేవంత్ రెడ్డితో పాటు రాష్ట్ర ఇన్చార్జి మీనాక్షి నటరాజన్, పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఇతర నేతలకు ముఖ్యమంత్రి ఎప్పటికప్పుడు దిశానిర్దేశం చేస్తున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉంది కాబట్టి ఈ ఎన్నికల్లో గెలుపు అనేది తప్పనిసరి అంటూ సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

ఇప్పటీ వరకు పార్టీ ప్రచారం ఎలా సాగింది. ముందు ముందు ఎలా సాగబో తోంది. ఎంతమందిని కలుస్తున్నారు

## దూసుకుపోదాం!

### జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు కాంగ్రెస్ భారీ స్కెచ్!

### ప్రతి ఓటరును కలిసేలా ప్లానింగ్!!

అనేదానిపై ఆరా తీస్తున్నారు. రానున్న వారం రోజుల్లో ఎలా ప్రచారం చేయాలనే దానిపై కూడా ప్రణాళిక రూపొందించినట్టు తెలుస్తోంది. ఇదే సమయంలో ఒక్కొక్క నాయకుడికి వంద మందిని అప్పగించాలని, ఏడు నుంచి 8 పోలింగ్ కేంద్రాలకు ఒక రాష్ట్ర నాయకుడిని పర్యవేక్షకుడిగా నియమించాలని ముఖ్యమంత్రి సూచించినట్టు తెలుస్తోంది. ఎక్కడా కూడా ఏమరపాటు వద్దని,ప్రతి ఒక్కరు ప్రజల్లోనే ఉండాలని హితవు పలికినట్లు సమాచారం. అంతేకాదు కాంగ్రెస్ తీసుకువచ్చిన అభివృద్ధి పథకాలు ఇప్పటి వరకు జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో 150 కోట్లకు పైగా ఖర్చుపెట్టిన విషయాలను కూడా ప్రజల్లోకి తీసుకెళ్లాలని రేవంత్ రెడ్డి సూచించారట. అయితే ఈ నెల 9న ప్రచార గడువు ముగిసేసరికి జూబ్లీహిల్స్ లో ప్రతి ఒక్క ఓటర్ ను కాంగ్రెస్ నాయకులు కలవాలని, గడువు ముగిసే వరకు రాష్ట్ర నాయకులు అక్కడే ఉండాలని ముఖ్య మంత్రిరేవంత్ రెడ్డి చెప్పినట్టు సమాచారం . ఇప్పటికే ఒక మారు ప్రచారం చేసినటు వంటి రేవంత్ రెడ్డి మరోసారి ప్రచారానికి రాను న్నారని తెలుస్తోంది.. ఏది ఏమైనప్పటికీ జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక అనేది కాంగ్రెస్ చాలా ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. అక్కడ గెలిస్తే రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో మంచి రిజల్ట్ వస్తుంది.

ఒకవేళ ఓడింది అంటే ఇక కాంగ్రెస్ పని అయిపోయిందనే మెసేజ్ ప్రజల్లోకి వెళ్తుంది. అందుకే కాంగ్రెస్ అధిష్టానం ఈ ఎన్నికను జీవన్మరణ పోరాటంలా భావిస్తోందని చెప్పవచ్చు.

## విషం చిమ్ముడు ఆపని ట్రంప్!

### టారిఫ్‌ల్లో భారత్ టాప్.. మోదీ సర్కారుతో చెడుతున్న దోస్తీ!!

### ఇక చైనా కంటే మనపైనే అధిక సుంకాలు - మారిన విదేశాంగ విధానం



న్యూఢిల్లీ : అమెరికా టారిఫ్‌ల జాబితాలో ఇప్పుడు భారత్‌దే అగ్రస్థానం. నిన్నమొన్నటిదాకా చైనాపై అత్యధిక సుంకాలు వేసిన ఆ దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెనక్కి తగ్గారు. డ్రాగన్‌తో దోస్తీ కుదరడంతో అమెరికాలోకి దిగుమతయ్యే చైనా వస్తూత్పత్తులపై 57 శాతం పడుతున్న సుంకాలను 47 శాతానికి తగ్గించారు. ఇందుకోసం ఫెంటానిల్ తయారీకి వినియోగించే చైనా రసాయనాలపై వేస్తున్న 20 శాతం సుంకాలను 10 శాతానికి కుదించారు.

అంతేగాక 100 శాతం టారిఫ్‌లు విధించాలన్న ఆలోచననూ ట్రంప్ సర్కారు విరమించుకున్నది. గత వారం దక్షిణ కొరియాలోని బసన్‌లో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో ట్రంప్ భేటీ తర్వాత అగ్రరాజ్య విదేశాంగ విధానమే మారిపోయింది మరి. ఇరు దేశాల మధ్య కుదిరిన పలు కీలక ఒప్పందాలు అమెరికా-చైనా ఉద్రిక్తతల్ని ఒక్కసారిగా శాంతింపజేశాయి. ఈ క్రమంలో ఇప్పుడు భారత్‌పైనే అమెరికా సుంకాలు అత్యధికంగా పడుతున్నట్టవుతున్నది.

**ఇదీ సంగతి..** ఈ ఏడాది ఆగస్టులో అమెరికాలోకి దిగుమతయ్యే భారతీయ వస్తూత్పత్తులపై 50 శాతం టారిఫ్‌లను ట్రంప్ వేసిన విషయం తెలిసిందే. తమ దేశంతో వాణిజ్య ఒప్పందాలు చేసుకోవడానికి ఆలస్యం చేస్తున్నదన్న ఆగ్రహంతో 25 శాతం, తమ మాటను కాదని రష్యా నుంచి పెద్ద ఎత్తున ముడి చమురును కొనడాన్ని తప్పుబడుతూ మరో 25 శాతం.. మొత్తంగా 50 శాతం సుంకాలను ట్రంప్ సర్కారు అమల్లోకి తెచ్చింది. ఈ నేపథ్యంలో అమెరికాతో మైత్రి.. చైనా టారిఫ్‌ల భారాన్ని తగ్గించింది. దీంతో ఇప్పుడు చైనాపై 47 శాతానికి పరిమితమైన సుంకాలు.. భారత్‌పై మాత్రం 50 శాతంగా ఉంటున్నాయి. అంతేగాక భారత్, పాక్ ఘర్షణలు వీడకపోతే 250 శాతం సుంకాలు పడుతాయని హెచ్చరించిన విషయం తెలిసిందే.

**మోదీతో చెడిన స్నేహం...** నిజానికి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో డొనాల్డ్ ట్రంప్‌కు మంచి స్నేహ సంబంధాలే ఉన్నాయి. ఈ క్రమంలోనే గత బైడెన్ సర్కారుతో అంటీముట్టనట్టుగా ఉంటూ వచ్చిన మోదీ.. తర్వాత జరిగిన అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్‌కు మద్దతిచ్చారు. అయితే అధికారంలోకి వచ్చిన ట్రంప్.. ఇప్పుడు భారత్‌పై విషం కక్కుతున్నారు. హెచ్-1బీ వీసా ఫీజును లక్ష డాలర్లకు పెంచడమేగాక, టారిఫ్ వార్‌కు సిద్ధపడ్డారు. అప్పట్నుంచి మోదీ, ట్రంప్ మధ్య విభేదాలు ఏర్పడగా.. సహజంగానే భారత్-అమెరికా నడుమ కూడా సంబంధాలు దెబ్బతిన్నాయి. నిజానికి అమెరికా అధ్యక్షుడిగా బిల్ క్లింటన్ ఉన్న దగ్గర్నుంచి.. ట్రంప్ తొలిసారి ప్రెసిడెంట్ అయినంత వరకు భారత్‌తో మైత్రి బాగానే సాగింది. కానీ రెండోసారి అధ్యక్ష పీఠం ఎక్కిన తర్వాతే ట్రంప్ నిర్ణయాల్లో దూకుడు పెరిగింది. ఇది భారత్‌ను ఇబ్బందిపెడుతుండగా, ఇక్కడి వ్యాపార, పారిశ్రామిక వర్గాలకూ నష్టదాయకంగా పరిణమించింది.

**ప్రపంచ ఎకానమీకి దెబ్బ...** భారత్-అమెరికా మైత్రి దెబ్బతినడం.. ఇరు దేశాల ఆర్థిక వ్యవస్థల్నేగాక, ప్రపంచ ఎకానమీని కూడా ప్రభావితం చేయగలదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా సూపర్ పవర్‌గా ఎదుగుతున్న భారత్‌కు కొన్ని ప్రతిబంధకాలు ఎదురయ్యే వీలుందంటున్నారు.

అయితే ట్రంప్ దుందుడుకు నిర్ణయాలు.. అసలే ఇబ్బందుల్లో ఉన్న అమెరికా ఆర్థిక వ్యవస్థను మరింత ఇరకాటంలోకి నెట్టే అవకాశాలూ లేకపోలేదని చెప్తున్నారు. అవకాశం దొరికితే భారత్‌ను ఇబ్బంది పెట్టాలని చూసే చైనా, పాకిస్తాన్‌లకు ట్రంప్ దగ్గరవుతుండటం కూడా అమెరికాతో సంబంధాలను బలహీనపరుస్తుండగా.. ఈ నేపథ్యంలో రష్యాతో మైత్రికే మోదీ సర్కారు పెద్దపీట వేయాల్సి వస్తున్నదని చెప్తున్నవారూ ఉన్నారు. మొత్తానికి అమెరికా-భారత్ వాణిజ్య యుద్ధం ముదిరితే ఔషధ, ఐటీ, ఆటో, ఎలక్ట్రానిక్ తదితర రంగాలకు గడ్డు పరిస్థితులేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇది ఇరు దేశాలకూ నష్టమేనని చెప్పక తప్పదు.

చురకలు






## ఈదురు గాలులతో భారీ వర్షం.. ఆందోళనలో రైతులు

వరంగల్, నవంబర్ 4: ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఉరుములతో వర్షాలు దంచికొట్టాయి. ఉదయం నుంచి కుండపోత వానలు కురిశాయి. వరంగల్ నగరంలో ఒక్కసారిగా వాతావరణం మారింది. ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. సుమారు అరగంట పాటు కురిసిన కుండపోత వర్షానికి నగర రహదారులు చెరువులను తలపించాయి. దీంతో పలు చోట్ల ట్రాఫిక్ జామ్ అయింది. వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. వర్షానికి ఎనుమాముల మార్కెట్‌లో పత్తి, మొక్కజొన్న తడిసిపోయింది.

దీంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ఏర్పడ్డ 'మొంథా' తుపాను ముంపు నుంచి ఇంకా వరంగల్, హనుమకొండ, కాజీపేట ప్రాంతాలు పూర్తిగా తేరుకోలేదు. మరోసారి వర్షాలు కురవడంతో లోతట్టుప్రాంత ప్రజల్లో ముంపు భయం నెలకొంది. వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట, రంగారెడ్డి, మహబూబ్ నగర్, వనపర్తి, నాగర్ కర్నూల్, నారాయణపేట, గద్వాల్, మేడ్చల్ – మల్కాజిగిరి, యాదాద్రి – భోంగీర్ వంటి పశ్చిమ, మధ్య, దక్షిణ తెలంగాణలో అక్కడక్కడా ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు పడుతాయని తెలంగాణ వెదర్ మ్యాన్ అంచనా వేశారు. రాజన్న సిరిసిల్ల, నల్గొండ, సూర్యాపేట, ఖమ్మం, మహబూబాబాద్, హన్మకొండ, వరంగల్, జనగాం జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మేయర్ గుండు సుధారాణి, స్థానిక కార్పొరేటర్, సంబంధిత అధికారులతో కలిసి జీడబ్ల్యూఎంసీ పరిధిలోని 11వ డివిజన్ పోతన నగర్‌లో క్షేత్ర స్థాయి పర్యటన నిర్వహించారు. నాళాల భౌతిక స్థితి పరిశీలించి, వరద నీరు నిల్వ ఉండకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా నిరంతర పర్యవేక్షణ కొనసాగించాల సూచించారు.




హైదరాబాద్: నగరంలోని ఓ వైద్యుడి ఇంట్లో పోలీసులు డ్రగ్స్ పట్టుకున్నారు. ముషీరాబాద్‌లో అద్దెకు ఉంటున్న జాన్‌పాల్ అనే వైద్యుడి ఇంట్లో డ్రగ్స్ విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో అతడి నివాసంలో తనిఖీలు చేపట్టి.. రూ.3 లక్షల విలువ చేసే డ్రగ్స్‌ను ఎక్సైజ్ ఎస్‌టీఎఫ్ పోలీసులు పట్టుకున్నారు. జాన్‌పాల్‌ను అరెస్టు చేసి ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న మరో ముగ్గురిపై కేసు నమోదు చేశారు. హైదరాబాద్‌కు చెందిన ప్రమోద్, సందీప్, శరత్.. దిల్లీ, బెంగళూరు నుంచి డ్రగ్స్ తెప్పించి వైద్యుడు జాన్‌పాల్ ఇంట్లో ఉంచి విక్రయిస్తున్నారు. డ్రగ్స్ విక్రయించినందుకు గాను వైద్యుడికి వీటిని ఉచితంగా ఇస్తున్నారు. అతడి ఇంట్లో ఓజీకుష్, ఎండీఎంఏ, కొకైన్, హాష్‌ఆయిల్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న ముగ్గురు నిందితులను త్వరలోనే పట్టుకుంటామని పోలీసులు తెలిపారు.

## వ్యవసాయ రంగం అభివృద్ధి దేశ ఆర్థిక ప్రగతికి మూలం: కిషన్‌రెడ్డి



హైదరాబాద్, నవంబరు4 : దేశంలో ఎన్ని మార్పులు వచ్చినా.. వ్యవసాయం ఇప్పటికీ మన జీవన విధానంలో భాగమేనని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. అగ్రి బిజినెస్ అవార్డులు ఇవ్వడం ద్వారా భారతదేశ వ్యవసాయ రంగానికి ఎనలేని సేవలు అందిస్తున్న రైతులకు, ఇన్నొవేటర్స్, అగ్రిప్రెన్యూర్స్‌ని గౌరవించుకోవడమేనని పేర్కొన్నారు. ఇవాళ(మంగళవారం) హైదరాబాద్ పార్క్ హయత్ హోటల్‌లో అగ్రి బిజినెస్ అవార్డుల కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి పాల్గొని ప్రసంగించారు. దేశంలోని 54 శాతం జనాభా వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారని చెప్పుకొచ్చారు కిషన్‌రెడ్డి.

**వ్యవసాయ రంగం కీలక పాత్ర..** వ్యవసాయ రంగం దేశ జీడీపీలో 18 శాతం భాగస్వామ్యం కలిగి ఉందని వివరించారు. ఆత్మ నిర్భర భారత్ దిశగా దూసుకెళ్లేందుకు వ్యవసాయ రంగం కీలక పాత్ర పోషిస్తోందని ఉద్ఘాటించారు. రైతులు సుభిక్షంగా ఉంటేనే దేశం సుభిక్షంగా ఉంటుందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ బలంగా నమ్ముతారని నొక్కిచెప్పారు. అందుకే అనేక పథకాలు రైతులకు మేలు చేసేలా రూపొందించారని తెలిపారు. ఈ ఏడాది చైనాను దాటేసి 149 మిలియన్ టన్నుల ధాన్యం ఉత్పత్తితో భారతదేశం ప్రపంచంలోనే తొలిస్థానంలో నిలిచిందని ఉద్ఘాటించారు. 2014 నుంచి 2015 మధ్యలో పాల ఉత్పత్తి 63 శాతం పెరిగిందని చెప్పుకొచ్చారు. ఇప్పటికీ ప్రపంచంలోనే అత్యంత ఎక్కువ పాలు ఉత్పత్తి చేసే దేశంగా మనం నిలిచామని పేర్కొన్నారు కిషన్‌రెడ్డి.

**పప్పు ధాన్యాల ఉత్పత్తిలో తొలిస్థానంలో నిలిచాం..** పప్పు ధాన్యాల ఉత్పత్తిలో ప్రపంచలోనే తొలిస్థానంలో నిలిచామని వివరించారు. దేశంలో 26 మిలియన్ టన్నుల పప్పు ధాన్యాల ఉత్పత్తి జరుగుతోందని వెల్లడించారు. కరోనా సమయంలో ప్రపంచవ్యాప్తంగా సరఫరా విషయంలో ఎన్ని ఇబ్బందులు తలెత్తినా ఆహార ధాన్యాలు సరఫరా జరిగేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. వేరే దేశాలకు కూడా భారతదేశం నుంచి ఎగుమతి చేశామని వివరించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలో దేశంలోని 80 కోట్ల మందికి ఉచితంగా 5 కేజీల చొప్పున బియ్యం ఇస్తున్నామని తెలిపారు. పీఎం కిసాన్, పీఎం కృషి సించాయి యోజన వంటి అద్భుతమైన పథకాలను అమలు చేస్తున్నామని పేర్కొన్నారు కిషన్‌రెడ్డి.

**రూ.4 లక్షల కోట్ల నగదు రైతుల ఖాతాల్లో జమ చేశాం..** 2019లో పీఎం సమ్మాన్ నిధి యోజన ప్రారంభించినప్పటి నుంచి 11.8 కోట్ల మంది రైతులకు 21 విడతల్లో రూ.4 లక్షల కోట్ల నగదు రైతుల ఖాతాల్లో జమ చేశామని స్పష్టం చేశారు. ఈ పథకం ద్వారా చిన్న, మధ్య తరహా రైతులకు భరోసా దక్కిందని నొక్కిచెప్పారు. దళారుల ప్రమేయం లేకుండా రైతులు లబ్ధి పొందుతున్నారని వివరించారు. 2014 నుంచి ఇప్పటివరకు వరి ధాన్యం కనీస మద్దతు ధర భారీగా పెంచామని వెల్లడించారు. జీఎస్టీ 2.0 ద్వారా రైతులకు ఉపయోగపడేలా ట్రాక్టర్లు, మెషీన్లపై భారీగా జీఎస్టీ తగ్గించామని ప్రకటించారు. జీఎస్టీ తగ్గించడంతో రైతులకు ఎంతో మేలు జరుగుతోందని చెప్పుకొచ్చారు. సాగు ఖర్చు కూడా భారీగా తగ్గి, రైతుల ఆదాయం మరింత పెరుగుతుందని తెలిపారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, డ్రోన్స్ వంటి అగ్రి టెక్నాలజీ ద్వారా వ్యవసాయ రంగాన్ని మరింతగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.




హైదరాబాద్, నవంబర్ 4: తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారిన పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసు విచారణలో మరో అడుగు పడింది. ఎల్లుండి నుండి ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసు విచారణ జరుగనుంది. ఈనెల 6 నుంచి ఈ కేసును స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ విచారించనున్నారు. 6వ తేదీన భద్రాచలం నియోజకవర్గ ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్, జగిత్యాల నియోజకవర్గ ఎమ్మెల్యే సంజయ్ కుమార్ లను విచారించనున్నారు. 13న కామారెడ్డి ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి, ఖైరతాబాద్ ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ కేసు విచారించనున్నారు. ఇప్పటికే నలుగురు ఎమ్మెల్యేలను స్పీకర్ విచారించిన విషయం తెలిసిందే. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ నుంచి గెలిచిన 10 మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో చేరిన విషయం తెలిసిందే. ఈ మేరకు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ నేతలు స్పీకర్‌కు ఫిర్యాదు చేశారు. స్పీకర్ నుంచి సరైన స్పందన రాకపోవడంతో హైకోర్టును ఆశ్రయించారు.

అత్యున్నత న్యాయస్థానం నుంచి బీఆర్ఎస్‌కు సానుకూల తీర్పు రాకపోవడంతో సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. ఈ మేరకు విచారణ చేపట్టిన సర్వోన్నత న్యాయస్థానం.. ఈ వ్యవహారంపై మూడు నెలల్లోగా స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని జూలై 31న ఆదేశాలు జారీ చేసింది. కాగా, ఆ గడువు అక్టోబర్ 31తో ముగిసింది. దీంతో పార్టీ మారిన ఎమ్మెల్యేలను స్పీకర్ విచారించనున్నారు.




చర్ల: సుక్మా అడవుల్లో భద్రతా దళాలు చేపట్టిన ఓ ఆపరేషన్‌లో మావోయిస్టుల ఆర్డినెన్స్ ఫ్యాక్టరీని స్వాధీనం చేసుకున్నాయి. జిల్లాలోని గోంగూడ –కంచాల అడవుల్లో డీఆర్ జీ(డిస్టిక్ రిజర్వ్ గార్డ్) బలగాలు మంగళవారం కూంబింగ్ చేస్తున్న క్రమంలో మావోయిస్టుల ఆయుధ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీని గుర్తించాయి. భద్రతా బలగాలు ఆ ప్రాంతం నుంచి 17 రైఫిల్స్, రాకెట్ లాంచర్లు , ఆయుధాల తయారీ సామగ్రి, పరికరాలను స్వాధీనం చేసుకున్నాయి. ఈ ఘటనను ఎస్పీ కిరణ్ చవాన్ ధ్రువీకరించారు. మావోయిస్టులు జనజీవన స్రవంతిలోకి వచ్చి చక్కటి జీవితాన్ని ప్రారంభించుకోవాలని ఎస్పీ సూచించారు. డీఆర్‌జీ వ్యూహాత్మక ఆపరేషన్‌ను ఆయన అభినందించారు.

## రైతులు ఇబ్బందులు పడుతుంటే ఎమ్మెల్యేలు ఏం చేస్తున్నారు..?




ఆదిలాబాద్: పత్తి రైతుల పరిస్థితి దయనీయంగా ఉందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత ఆవేదన వ్యక్తం చేశారు. మొంథా తుఫాన్ వల్ల పంట దెబ్బ తిని నష్ట పోయారని చెప్పారు.

అమ్మడానికి పోతే తేమ పేరుతో పత్తి రైతులను వ్యాపారులు మోసం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ మేరకు ఇవాళ(మంగళవారం) మీడియాతో మాట్లాడారు.. 20 శాతానికిపై తేమ ఉన్న పంటను కూడా పూర్తి మద్దతు ధరతో ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో సీసీఐ వల్ల రైతులు ఇబ్బంది పడుతుంటే ఎమ్మెల్యేలు, ఎంపీలు ఏం చేస్తున్నారు..? అని కవిత ప్రశ్నించారు. చనాక–కొరటా బ్యారేజీ ఎందుకు పూర్తి చేయడం లేదో ప్రభుత్వం చెప్పాలని నిలదీశారు. గత బీఆర్ఎస్ హయాంలో ప్రాజెక్టు అంచనాలు పెంచారని గుర్తు చేశారు. కానీ కాంగ్రెస్ వచ్చాక పనులను ఆపేశారని పేర్కొన్నారు. దీంతో రైతులకు ప్రయోజనం లేకుండా పోతోందని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు.. సీసీఐ రోజుకో నిబంధన తీసుకురావడం వల్ల రైతులు అయోమయానికి గురవుతున్నారు. ఇటీవల మొంథా తుపాన్ వరదలతో పత్తికి భారీగా నష్టం వాటిల్లింది. ఈ నేపథ్యంలో అకాల వర్షాలను దృష్టిలో పెట్టుకుని 20 శాతం తేమ ఉన్నా సీసీఐ కొనుగోలు చేసే విధంగా ఉత్తర్వులు జారీ చేయాలని కోరుతున్నారు. లేనిపక్షంలో ఈనెల 6వ తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా కొనుగోళ్లు నిలిపివేస్తామని తెలంగాణ జిన్నింగ్ మిల్లర్స్, ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రకటించిన విషయం తెలిసిందే.



## మంత్రి అజారుద్దీన్‌కు శాఖల కేటాయింపు

హైదరాబాద్: ఇటీవల మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన అజారుద్దీన్‌కు తెలంగాణ ప్రభుత్వం శాఖలు కేటాయించింది. మైనార్టీల సంక్షేమం, పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ శాఖలను కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర మంత్రిగా అజారుద్దీన్ గత నెల 31న ప్రమాణ స్వీకారం చేశారు. రాజ్‌భవన్‌లోని దర్బార్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ.. ఆయనతో ప్రమాణం చేయించారు.



## ఉన్నత విద్యామండలి కార్యాలయ ముట్టడికి యత్నం

హైదరాబాద్: ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్‌లో బీసీ విద్యార్థి సంఘం ఆందోళనకు దిగింది. ఉన్నత విద్యా మండలి కార్యాలయం ముట్టడికి యత్నించారు. కార్యాలయం వద్దకు పెద్దసంఖ్యలో చేరుకున్న విద్యార్థులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో అక్కడ భారీగా పోలీసులు మోహరించారు.

## ఛత్తీస్‌గఢ్‌లో ఘోర ప్రమాదం..గూడ్స్ ను ఢీకొట్టిన కోర్బా ప్యాసింజర్ ట్రైన్




ఛత్తీస్‌గఢ్‌లో ఘోర రైలు ప్రమాదం జరిగింది.. మంగళవారం ( నవంబర్4) బిలాస్ పూర్ జిల్లాలోని జైరాంనగర్ స్టేషన్ సమీపంలో కోర్బా ప్యాసింజర్ రైలు, గూడ్స్ రైలును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆరుగురు మృతి చెందారు. అనేక మంది ప్రయాణికులు గాయపడ్డారు. రెండు రైళ్లే వేగంగా ఉండటంతో కోర్బా ప్యాసింజర్ రైలు మొదటి కోచ్ గూడ్స్ రైలుపైకి ఎక్కినట్లు సంఘటన స్థలం నుండి వీడియోలు చూపిస్తున్నాయి. సమాచారం అందుకున్న?రైల్వే ,స్థానిక అధికారులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఓ శిశువుతో సహా అనేక మంది ప్రయాణికులను రక్షించారు. తీవ్ర గాయాలైన వారిని సమీపంలోని ఆసుపత్రులకు తరలించారు. ఈ ఘటనలో మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని తెలుస్తోంది.




ముగ్గురు ఆడపిల్లలు.. ఉన్నత విద్యను అభ్యసించారు.. కొద్దిరోజులైతే ఆ తల్లిదండ్రులను కూర్చోబెట్టి సాదుకునేవారు.. ఆడపిల్లలు కడుపులోనే చంపేస్తున్న రోజుల్లో, ముగ్గురు ఆడపిల్లలను పెంచి, పెద్ద చేసి, చదివించి చేతికి వచ్చే టైంకి ముగ్గురూ ఒకేసారి దూరం అవడం ఆ తల్లిదండ్రులకు ఎంత కడుపుకోత.. ముగ్గురూ కలిసి ఒకేసారి ఈ లోకాన్ని వదిలి వెళ్లిపోవడం నిజంగా జీర్ణించుకోలేని విషయం.. ఇంట్లో నుంచి ఒక పాడె కదిలితేనే ఇంటిల్లి పాది శోక సంద్రంలో మునిగిపోతుంది. అలాంటిది ముగ్గురు ఆడపిల్లలు.. ముగ్గురికీ ఇంచుమించు 20 ఏళ్ల వయస్సు.. ఒకే ఇంట్లో నుంచి.. ముగ్గురు మహాలక్ష్ములు ఇలా ఒకేసారి పాడెపై తిరిగి రాని లోకానికి వెళుతుంటే.. ఆ ఇల్లే కాదు.. ఊరు ఊరంతా కన్నీళ్లు పెట్టింది.. ఆ విజువల్స్, ఫొటోలు అందర్నీ కదిలించి వేస్తున్నాయి.. మీరు ఏ లోకంలో ఉన్నా మీ ఆత్మ శాంతించాలని కోరుకుంటున్నాం తల్లులూ అని సొంతూరు తుది వీడ్కోలు పలికింది. చేవెళ్ల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ముగ్గురు అక్కాచెల్లెళ్ల అంతిమ యాత్రతో పెర్కంపల్లి గ్రామంలో కనిపించిన హృదయ విదారక దృశ్యం ఇది. తాండూరు నియోజకవర్గం యాలాల మండలం పెర్కంపల్లికి చెందిన ఎల్లయ్య గౌడ్ చాలా ఏండ్ల కింద తాండూరు టౌన్‌కు వలస వచ్చారు. ఆయనకు నలుగురు కూతుళ్లు. ఒక కొడుకు ఉన్నారు. ఎల్లయ్య గౌడ్ ట్రావెల్ ఏజెన్సీ నడిపిస్తున్నాడు. ఇటీవల పెద్ద కూతురు అనూష పెండ్లిని ఘనంగా చేశాడు. రెండో కూతురు తనూష ఎంబీఏ చదువుతూ ఉద్యోగం చేస్తున్నది.

మూడో కూతురు సాయిప్రియ హైదరాబాద్‌లోని కోఠి విమెన్స్?కాలేజీలో డిగ్రీ ఫైనల్ ఇయర్, నాలుగో కూతురు నందిని అదే కాలేజీలో డిగ్రీ ఫస్టియర్, కొడుకు తాండూరు టౌన్‌లోని ఓ ప్రైవేట్?స్కూల్‌లో పదో తరగతి చదువుతున్నాడు. గత నెల 15న జరిగిన అక్క అనూష పెండ్లికి తనూష, సాయిప్రియ, నందిని వచ్చారు. సోమవారం పరీక్షలు ఉండడంతో ముగ్గురూ తాండూరు బస్టాండ్ నుంచి హైదరాబాద్?వెళ్లే బస్సెక్కారు. బస్సు ప్రమాదంలో ముగ్గురు చనిపోయారని తెలుసుకున్న ఆ కుటుంబం షాక్‌కు గురైంది. "కాలేజీ నుంచి మీరు ఇంటికి వస్తే పండుగలా ఉండేది కదరా...మిమ్మల్ని ఎప్పుడూ బిడ్డలనుకోలేదే.. కొడుకుల్లా పెంచానే..మీరు లేరంటే ఎట్లా నమ్మాలిరా... ఇంటికి వచ్చి నా చుట్టూ చేరి ముచ్చట్లు పెడితే ఈ లోకంలో ఇంతకన్నా ఆనందం ఏముంటుంది అనుకునేవాడిని. మీరు లేని జీవితం ఊహించుకోలేకపోతున్నానురా బిడ్డలారా' అని ఆ తల్లిదండ్రులు రోదిస్తుంటే ఆపడం ఎవరి తరం కాలేదు. ముగ్గురు అక్కాచెల్లెళ్ల అంత్యక్రియలను స్వగ్రామమైన పెర్కంపల్లిలో నిర్వహించగా గ్రామమంతా కదిలివచ్చి కన్నీటి వీడ్కోలు పలికింది.

# శివకేశవులకు ప్రీతికరం కార్తీక పౌర్ణమి



కార్తీకమాసం అన్ని మాసములలో అత్యంత పవిత్రమైనదిగా భావించ బడుతున్నది. 'న కార్తీక సమో మాసః' అని అత్రి మహాముని వచనము. కార్తీక మాసంతో సమానమైన మాసం లేదని అర్థం. చంద్రుడు పౌర్ణమి రోజున కృత్తికా నక్షత్రములో సంచరించే మాసం కార్తీక మాసం". ఇందు కార్తీక పౌర్ణమి శివరాత్రితో సమానమై నదిగా భావించ బడుతుంది. దీనిని "త్రిపుర పూర్ణిమ, రాస పూర్ణిమ, దేవ దీపావళి" అని కూడా అంటారు. ఈ దినాన్ని మనువులలో పద్నాలుగవ వాడైన భౌత్యుని పేరున భౌత్య మన్వంతరాది, ఇంద్ర సావర్ణిక మన్వంతర మని కూడా అంటారు. ఈనాడు కైలాస నాథుడు త్రిపురాసురుడిని సంహరించాడు. శంకరుని కీర్తిని నారదుని వల్ల విన్న త్రిపురాసురుడు శివుడంటే కైలాస పర్వతం మీదకు దండెత్తి వెళ్ళి, శంకరుడిని యుద్ధానికి రమ్మంటాడు. మూడు రోజుల తీవ్ర యుద్ధానంతరం పరమ శివుడు, త్రిపురాసురుడిని సంహరించాడు. దేవతలు అభయంకరుడైన శంకరుడిని స్తోత్రం చేశారు. వెయ్యేళ్ళ అసుర పాలన అంతరించిన శుభ సందర్భాన శివుడు తాండవం చేశా డని పురాణాధారం. ఈ దినాన దీపం వెలిగిస్తే తెలిసీ తెలియక చేసిన పాపాలన్నీ హరించుకు పోతాయని విశ్వాసం. రోజంతా ఉప వాసం ఉండి, రోజుకొక వత్తి చొప్పున 365 వత్తులను కూడిన దీపాన్ని వెలిగిస్తారు. కొందరు దీపాలను నదిలో లేదా చెరువులో వదులుతారు. ఇళ్ళల్లో తులసి కోట వద్ద దీపాలను వెలిగిస్తారు. కార్తీక పౌర్ణమి నాటి శివాలయంలో దీపారాధన, ముక్కోటి దేవతల పూజ, సకల పుణ్య నదుల స్నాన ఫలం దక్కి ఇహ పరలోక సుఖ సౌఖ్యాలు, ముక్తి లభించ గలవని నమ్మకం. ఈ రోజున కేదారవ్రత పూజలను ఆచరిస్తారు. మర్రి చెట్టు ఊడలను తోరణాలుగా, మర్రి పళ్ళను బూరెలుగా, ఆకులను విస్తర్లుగా పెట్టి, పూజలు చేయడం ప్రాచీన కాలం నుండి సంప్రదాయంగా వస్తున్నది. ఇలా చేయడం వల్ల భార్యాభర్తల మధ్య అనుబంధం పెరుగుతుందని నమ్మకం. జైనులకు, పంజాబీలకు ఇది విశిష్టదినం. గంగా మహోత్సవం కూడా ఈ రోజునే నిర్వహిస్తారు. తెలుగు వారు కార్తీక పూర్ణిమ వ్రతంలో చలిమిడి చేస్తారు. అరవవారు వేపుడు బియ్యం, అటుకులు చేస్తారు. బలి చక్రవర్తికి ఒళ్ళంతా మంటలు పుడితే, కార్తీక పౌర్ణమి నాడు శివారాధన చేస్తే, మంటలు తగ్గినట్లు, మహిషాసురుడితో యుద్ధం చేసిన సమయాన శివలింగాన్ని బద్దలు కొట్టిన పాప నివృత్తికై పార్వతీదేవి కూడా శివారాధన చేసినట్లు పురాణ కథనాలు. నాలుగు మాసాలు బుద్ధుడు ఉత్తమ లోకంలో తల్లి వద్ద ఉండి తిరిగి భూలోకానికి ఈదినమే దిగి వచ్చే క్రమంలో బౌద్ధులు దీపమాలికలు వెలిగించి మత స్థాపకునికి స్వాగతోపచారాలు చేస్తారు. భూలోకంలో ప్రతి చోటు దీపాలతో నిండి ఉంటుంది. "సందన సంవత్సరమున, పొందుగ కార్తీక శుద్ధ పున్నమ నాడున్, విందొన్పని సేతుబంధన, సందున నొక వీరు దేలు సరుగున వేమా" అని క్రీ.శ.1532లోని పరిశోధకులు నిర్ధారించిన వేమన పద్యంలో కార్తీక పున్నమి ప్రస్తావన ఉంది. కార్తీక శుద్ధ పూర్ణిమ రోజున కృత్తికా దీపోత్సవమును ఆచ రించడం, ఉసిరి చెట్టుకు ప్రదక్షిణలు గావించి, కార్తీక దామోదరుని పూజ, దీపారాధన గావించుట అత్యంత పుణ్యప్రదం.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# సాహితీ మహారథి దాశరథి - నవంబర్ 5 దాశరథి వర్ధంతి



"నా తెలంగాణ కోటి రతనాల వీణ" అని నినదించి నిజాంపాలనపై కలం ఎత్తిన దాశరథి కృష్ణమాచార్య సాహితీ ప్రస్థానంలో అభ్యుదయ కవి. నిజాంకు వ్యతిరేక ఉద్యమంలో పాల్గొని జైలుకు వెళ్లి..." ఓ నిజాము పిశాచమా? కానరాడు / నిన్నుబోలిన రాజు మాకెన్నడేని? అంటూపళ్ళు తోముకోవడానికిచ్చే బొగ్గుతో నిజామాబాద్ జైల్లో(ఖిల్లా ) ఉన్నపుడు, జైలు గోడల మీద పద్యాలు రాసి దెబ్బలు తిని, అక్కడ నుంచే తన కవిత్వం ద్వారా పోరాటాన్ని కొనసాగించిన ధీశాలి దాశరథి కృష్ణమాచార్యులు. 'నా గీతావలి ఎంత దూరము ప్రయాణంబౌనో అందాక ఈ భూగోళంబునకగ్గి పెట్టెద' అని ఆయన నినదించారు. 'నవగిని పెంచినట్టి కరుణామయి నా తెలంగాణ' అని అంటూ దాశరథి పుట్టిన ప్రాంతంపై మమకారాన్ని చాటుకోవటంతో పాటు రుద్రవీణ కావ్యాన్ని తెలంగాణకు అంకితమిచ్చారు. 'అనాదిగా సాగుతోంది - అనంత సంగ్రామం అనాథునికీ ఆగర్భ శ్రీమంతునికీ మధ్య' అంటూ తనలోని సామ్యవాద ఆలోచనలను దాశరథి వ్యక్తీకరించారు. తెలంగాణ ప్రజల కన్నీళ్లను 'అగ్నిధార'గా మలిచి నిజాం పాలన మీదికి ఎక్కుపెట్టిన మహాకవి దాశరథి కృష్ణమాచార్య. దాశరథి గా ఆయన సుప్రసిద్ధుడు. పద్యాన్ని పదునైన ఆయుధంగా చేసుకొని తెలంగాణ విముక్తి కోసం ఉద్యమించిన దాశరథి ప్రాతఃస్మరణీయుడు. "నా తెలంగాణ కోటి రతనాల వీణ" అని గర్జించి ప్రకటించి తెలంగాణ ఉద్యమానికి ప్రేరణనందించిన కవి దాశరథి. దాశరథి కృష్ణమాచార్య 1925 జూలై 22 న వరంగల్ జిల్లా (ప్రస్తుతం మహబూబాబాద్) చిన్న గూడూరు గ్రామంలో జన్మించాడు. బాల్యం ఖమ్మం జిల్లా మధిరలో గడిచింది. ఉర్దూలో మెట్రిక్యులేషన, భోపాల్ విశ్వవిద్యాలయం నుండి ఇంటర్మీడియేట్, ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి ఇంగ్లీషు సాహిత్యంలో బియ్యే చదివాడు. సంస్కృతం, ఆంగ్లం, ఉర్దూ భాషల్లో మంచి పండితుడు. చిన్నతనంలోనే పద్యం అల్లటంలో ప్రావీణ్యం సంపాదించాడు. ప్రారంభంలో కమ్యూనిస్టు పార్టీ సభ్యుడిగా ఉండి రెండో ప్రపంచయుద్ధం సమయంలో ఆ పార్టీ వైఖరి నచ్చక ఆ పార్టీ నుండి బయటకు వచ్చి, హైదరాబాదు సంస్థానంలో నిజాం అరాచక ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరుగుతున్న ఆంధ్రోద్యమంలో పాలుపంచుకున్నాడు. నిజాం పాలనలో రకరకాల హింసలనుభవిస్తున్న తెలంగాణాను చూసి చలించిపోయారు. పీడిత ప్రజల గొంతుగా మారి నినదించారు. "మా నిజాం రాజు జన్మజన్మల బూజు".రైతుదే తెలంగాణము రైతుదే. ముసలి నక్కకు రాచరికంబు దక్కునే అని గర్జించారు. దగాకోరు బటాచోరు రజాకారు పోషకుడవు, దిగిపొమ్మని జగత్తంత నగారాలు కొడుతున్నది, దిగిపోవోయ్, తెగిపోవోయ్' అని నిజామును సూటిగా గద్దిస్తూ రచనలు చేసాడు. ఆంధ్రమహా సభలో చైతన్యవంతమైన పాత్ర నిర్వహించి నిజాం ప్రభుత్వం చేత జైలు శిక్ష అనుభవించాడు. నిజామాబాదు లోని ఇందూరు కోటలో ఆయన్ని మరో 150 మందితో ఖైదు చేసి ఉంచింది, నిజాము ప్రభుత్వం. ఆయనతో పాటు ఖైదులో వట్టికోట ఆళ్వారుస్వామి కూడా ఉన్నాడు. మంచి ఉపన్యాసకుడు. భావప్రేరిత ప్రసంగాలతో ఊరూరా సాంస్కృతిక చైతన్యం రగిలించాడు. ఆంధ్ర సారస్వత పరిషత్తు నిర్మాతల్లో ఒకడు. 1953లో తెలంగాణ రచయితల సంఘాన్ని స్థాపించి అధ్యక్షుడుగా జిల్లాల్లో సాహితీ చైతన్యాన్ని నింపారు. ఉపాధ్యాయుడిగా, పంచాయితీ ఇన్స్పెక్టరుగా, ఆకాశవాణి ప్రయోక్తగా ఉద్యోగాలు చేసాడు. ఆంధ్రప్రదేశ్ ఆస్థానకవిగా 1977 ఆగస్టు 15 నుండి 1983 వరకు పనిచేసాడు. రాష్ట్ర, కేంద్ర సాహిత్య అకాడమీ బహుమతులు గెల్చుకున్నాడు. సాహిత్యంలో దాశరథి అనేక ప్రక్రియల్లో కృషి చేసాడు. కథలు, నాటికలు, సినిమా పాటలు, కవితలు రాసాడు. అనేక సినిమాలకు గీతాలు రచించి అభిమానుల్ని సంపాదించుకున్నాడు. మీర్జాగాలిబ్ ఉర్దూ గజళ్ళను తెలుగులోకి గాలిబ్ గీతాలు పేర అనువదించాడు. తల్లి మీద, తల్లి తెలంగాణ మీద ఆయన రచించిన పద్యాలు ఇప్పటికి ఎందరికో ఉత్తేజాన్ని కలిగిస్తున్నాయి. అగ్ని ధారను తన జైలు సహవాసి.. వట్టికోట అళ్వారు స్వామికి అంకితమిచ్చారు. మరో కవితా సంపుటి రుద్రవీణను.. తెలంగాణా ప్రజలకు అంకితమిచ్చారు. ఈయన రాసిన 'తిమిరంతో సమరం' కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం పొందింది. 'కవితా పుష్పకం' అనే కావ్యానికి ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ బహుమతి లభించింది. దాశరథి 'బాల సరస్వతి తెలుగు-ఇంగ్లీషు నిఘంటువును' రాశారు. గీతగోవిందం వ్యాఖ్యానం చేశాడు. ఆంధ్ర విశ్వవిద్యాలయం దాశరథిని కళాప్రపూర్ణ అనే బిరుదుతో సత్కరించింది. 1953లో తెలంగాణ రచయితల సంఘాన్ని స్థాపించాడు. రుద్రవీణ, మహోంద్రోదయం, మార్పు నా తీర్పు, ధ్వజమెత్తిన ప్రజ, మహాబోధి, పునర్నవం, అమృతాభిషేకం, నవమంజరి, గాలిబ్ గీతాలు, ఆలోచనా లోచనాలు, అమృతవల్లి, ధ్వజమెత్తిన ప్రజ (కవిత్వం ). మస్జిదులో లేబరేటరీ ( విజ్ఞాన శాస్త్ర కవిత) తదితర 30 పుస్తకాలు వెలువరించాడు. రుబాయి, గజల్ ప్రక్రియలను మొదటిగా తెలుగులోకి అనువదించిన %-% దాశరథి. హేరాలాల్ మోరియా కవితలను తెలుగులోకి అనువదించాడు. ఆచార్య ఆత్రేయ తన దర్శకత్వంలో వచ్చిన 'వాగ్దానం' చిత్రంలో మొట్టమొదటి పాటను దాశరథితోనే రాయించారు. 'నా కంటిపాపలో నిలిచిపోరా/ నీ వెంట లోకాల గెలువనీరా' అనే పాటలో దాశరథి చిన్న చిన్న పదాలతో చేసిన భావ ప్రకటన వింటే తనువు, మనసు పులకించకుండా ఉండవు. దాశరథి రాసింది మొదట ఈ పాటే అయినా, ఆయన పాటలు రచించిన 'ఇద్దరు మిత్రులు' సినిమా ముందుగా విడుదల అయింది. అందుకే 'ఖుషీ ఖుషీగా నవ్వుతూ' అనే పాటను దాశరథి మొదటి పాటగా చెపుతుంటారు. సినిమా పాటల కోసం ఖవ్వాలి అనే ఉర్దూ పాటల్ని అనుసరించారు. సినిమాల్లో వీణ పాటలు ఎక్కువ రాసిన ఘనత దాశరథికే దక్కుతుంది. పాటల రచయితగా దాశరథి చేసిన ప్రయోగాలు తెలుగు సినిమా ఉన్నంతకాలం నిలిచిపోతాయి. పొట్టివాడైనా గట్టివాడని చాలా మంది సంబోధించారు. ఈయన రాసిన నాటికల సంపుటి 'నవమి'. ఈయన మహాశిల్పి జక్కన అనే చారిత్రక నవల రాశారు. తెలుగు పతాకం ఎరుగని దిశయే లేదు.. తెలుగు వెలుగు దూరలేని కోశం లేదు.. అని అన్నారు."జండా ఒక్కటి మూడు వన్నెలది దేశం ఒక్కటే.." అన్నారాయన. అడుగడుగునా.. ఎడదనెత్తురు గడగడమని తాగినావు%8%% అంటూ నిజాం నిరంకుశ పాలనను ఎత్తిచూపాడు. తీగెలను తెంపి అగ్నిలో దింపినావు / నా తెలంగాణ కోటి రత్నాల వీణ." (అగ్నిధార ) ప్రాణము లొడ్డి ఘోర గహనాటవులన్ పడగొట్టి%8%. తెలంగాణము రైతుదే, ముసలి నక్కకు రాచరికంబు దక్కునే". కోటి కోటి దీపాలనేనురా తెలగాణ నిగళాల తెగగొట్టి ఆకాశమంతను బాటలలో, కోటలలో నాటండి ప్రజల్లారా.. వేటాడండి తమస్సును.."అనాదిగా సాగుతోంది - అనంత సంగ్రామం / అనాథునికీ ఆ గర్భశ్రీనాథునికీ మధ్య". ఉన్నదాన్ని వున్న వాళ్లందరిలో పంచి / ఉన్నంతలో అందరం కలిసి భోంచేసి"...గతాన్ని కాదనలేను %-% వర్తమానం వద్దనబోను / భవిష్యత్తు వదులుకోబోను %-% కాలం నాకంతమాల"... హింసాయుద్ధం ఔట్ డేటెడ్ అని నేనంటాను / శాంతి ఒక్కటే మానవ జాతికి సిరియగు సాల్వేషన్"... అంటూ చైతన్యదీప్తిని నింపారు. 1987 నవంబరు 5 న దాశరథి మరణించారు. **రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# పరమ పవిత్రం... కార్తీక పౌర్ణమి



కార్తీకమాసంలో వచ్చే పౌర్ణమి చాలా పవిత్రమైనది ఇది అత్యంత మహిమాన్వితమైనదని పురాణాలు చెబుతున్నాయి. ఈ మాసంలో ప్రతి దినమూ పవిత్ర మైనదే.. సోమవారాలు, రెండు ఏకాదశులు, శుద్ధ ద్వాదశి పౌర్ణమి దినాలు ఒకదాని కంటే మరొకటి అధిక ప్రభావంతమైనవి. నెలరోజులు చేసే కృత్యాల ఫలితం ఒక ఎత్తు, పౌర్ణమి నాటి కృత్యాల ఫలితం ఒక్కటీ ఒక ఎత్తు. అందువల్ల అనేక వ్రతాలు పూజలు, కృత్యాలను, దైవారాధనకు అత్యంత ప్రాధాన్య మిచ్చాయని పురాణాలు వివరిస్తున్నాయి. పౌర్ణమిరోజున దీపారా ధనకు విశేష ప్రాముఖ్యముంది. శివ, విష్ణు దేవాలయాల్లో రెండింటా దీపాలు వెలిగిస్తారు. విష్ణు ఆలయాల్లో గోపురం మీద, ధ్వజస్తంభం ఎదుట, తులసికోట దగ్గర, దేవుడి సన్నిధి లోనూ ప్రమిదల్లో, ఉసిరికాయలపై బియ్యప్పిండితో చేసిన ప్రమిదల్లో దీపాలు వెలిగించాలి. ఈ దీపాలను చక్కగా కుంకుమ, పూలతో అలంకరించుకొని వెలిగించాలి. శివాల యంలో ధ్వజస్తంభంపై నందాదీపంతో పేరుతో అఖండదీ పాన్ని, ఆకాశదీపం పేరుతో ఎత్తైన ప్రదేశాల్లో భరిణల్లో (కుండలు, లోహపాత్రలతో తయారుచేసి, వేలాడదీస్తారు. అరటి దొన్నెల్లో దీపాలు వెలిగించి చెరువులు, నదులు వంటి జల వనరుల్లో విడిచి పెడతారు. ఇలా చేయడం వల్ల అష్టైశ్వర్యాలు కలగడంతో పాటు ఎంతో పుణ్యం వస్తుంది. వైజ్ఞానిక పరంగా ఆలోచిస్తే ఈ కార్తీక దీపాల వెలుగుల నుంచి వచ్చే వాయువుల వల్ల వాతావరణంలోని కాలుష్యం తగ్గిపోయి వాతావరణం శుద్ధి అవుతుంది. ఫలితంగా ఆరోగ్యం చేకూరుతుంది. కార్తీక పౌర్ణమి నుంచి ఆచరించే వ్రతాల్లో భక్తేశ్వర వ్రతం ఒకటి. ఇది స్త్రీలకు సౌభాగ్యం కలిగి స్తుంది. భక్తురాలి కోరికను మన్నించి వరాలిచ్చే వ్రతం అని దీనికి పేరు, ఇది ప్రాచుర్యంలోకి రావడానికి ఒక కథ ఉంది పాండ్యుడు, కుముద్వతి దంపతులు సంతానార్థం శివుని ఆరా ధించి ప్రత్యక్షం చేసుకున్నారు. వారు చేసిన ఆరాధనలోని చిన్న లోపం వల్ల వరం ఇవ్వదలచు కోలేదట శివుడు. అందుకే "అల్పాయుష్కుడు, అతి మేధావి అయిన కొడుకు కావాలా పూర్ణాయుష్కురాలు, విధవ అయిన కుమార్తె కావాలా?" అని అడిగితే.. కుమారుణ్ణే కోరుకున్నారా దంపతులు. శివుడి వరం తోటి ఆ దంపతులకి కుమారుడు పుట్టాడు. అయితే ఆ కుమారుడు పెరుగుతున్న కొలదీ ఆ తల్లిదండ్రుల్లో గుబులు పెరుగు తోంది. ఆ సమయంలో శివభక్తి పరాయణురాలైన అలకాపురి రాజకుమార్తెపై వారి దృష్టి పడింది. ఆమె పిలిస్తే శివుడు పలికే టంత భక్తి, శక్తి కలదని విన్నారా దంపతులు. ఆ పిల్లను తమ కోడలిగా చేసుకుంటే తమ బిడ్డను పూర్ణాయుష్కుడిగా మార్చే బాధ్యత ఆమె చూసుకుంటుందని ఆలోచించి అలాగే చేశాడు వివాహమైన కొన్నాళ్లకే భర్తకోసం యమభటులు వచ్చేసరికి అసలు విషయం తెలిసింది ఆ సాధ్వికి, తక్షణమే తన భక్తి ప్రభావంతో శివుడ్ని ప్రార్థించి ప్రత్యక్షం చేసుకుని భర్తను పూర్ణాయుష్కుడిగా మార్చుకునే వరం పొందిందని పురాణ కథనం . ఈ పౌర్ణమికి త్రిపుర పూర్ణిమ అని మరోపేరు. తారకాసురుడి ముగ్గురు కుమారులు బ్రహ్మను మెప్పించి, ఎక్కడికైనా స్వేచ్ఛగా సంచరించ గలిగే మూడు నగరా లను వరంగా పొందారు. అలాగే ఎవరివల్ల మరణం లేకుండా వరం కోరారు. అది సాధ్యం కాదన్నాడు బ్రహ్మ. అలాగైతే రథంకాని రథంపై, విల్లుకాని విల్లుతో, .. నారికాని నారి సారించి, బాణం కాని బాణం సంధించి, మూడు నగరాలూ ఒకే సరళరే ఖలోకి వచ్చాక ఒకే బాణంతో ముగ్గురినీ ఏక కాలంలో కొడితేనే మరణం సంభవించేలా వరం కోరారు. ఇవ్వక తప్పలేదు బ్రహ్మకు, ఆ వర బలంతో లోకాలన్నింటినీ కల్లోలం సృష్టించారు. వివిధ లోకవాసులు విసిగిపోయి బ్రహ్మకు మొర పెట్టు కున్నారు. వరం ఇచ్చింది తానే కాబట్టి ఏమీ చేయలేను.. మీరు విష్ణువు దగ్గరకు వెళ్ళండి అని చెప్పాడు. విష్ణువు కూడా తనకా శక్తిలేదని, వారిని వెంటబెట్టుకుని శివుడి దగ్గరకు వెళ్లాడు, దేవతలం దరూ సహకరిస్తే తానేపని చేయగలనన్నాడు శివుడు ఆ మాటతో భూమి రథం కాని రథంగా మారింది మేరు పర్వతం విల్లుకాని విల్లుగా, ఆదిశేషువు అల్లె తాడు కాని అల్లెతాడుగా, శ్రీ మహావిష్ణువు బాణం కానీ బాణంగా మారారు. వీరందరి సమాహార శక్తితో శివుడు త్రిపురాసురులను సంహరించాడని, అందు వల్ల కార్తీక పౌర్ణమికి ఆ పేరు వచ్చిందని పురాణ కథనం.. కార్తీక పౌర్ణమిరోజు చేసే స్నానం, దీపా రాధన, ఉపవాసం వంటి అన్నింటి లోనూ ఆరోగ్య, ఆధ్యాత్మిక భావ నలు అంతర్లీనంగా ఉన్నాయి. ఈ మాసమంతా సూర్యోదయానికి ముందే తలస్నానం చేయడం వల్ల ఆరోగ్యం కలుగుతుంది. ప్రస్తుతకాలంలో ఉద్యోగాల బిలో కానీ ఇతర ఏ కారణం చేతనైనా రోజూ దేవుడ్ని పూజించి దీపారాధన చేసే సమయం లేనివారు, నిష్టను ఆచరించలేని వారు కార్తీక పౌర్ణమినాడు ఆచరిస్తే చాలు.. నెలంతా పూజ చేసిన ఫలితం కలుగు తుంది. ఈ రోజున స్త్రీల కొరకు ప్రత్యేకంగా ఉపవాసం చేయాలని శాస్త్రాలు చెబుతున్నాయి పగలంతా ఉపవాసం ఉండి, రాత్రి దీపారాధన చేసి, చలిమిడిని చంద్రుడికి నివేదించి పలహారంగా స్వీకరిం చాలి. ఇలా చేయడం వల్ల కడుపు చలువ అంటే బిడ్డలకు రక్ష కలుగుతుందని పెద్దలంటారు. ఆరోగ్యపరంగా చూస్తే ఇలా చేయడం వల్ల గర్భాశయ సమస్యలు దరిచేరవని ఆయుర్వేద శాస్త్ర కథనం. ఈ రోజు మరో ప్రత్యేకత ఏంటంటే.. శివాల యాల్లో జరిపే జ్వాలాతోరణం. కార్తీక పౌర్ణమిరోజు శివుడు త్రిపురాసురులను సంహరించి ఇంటికి వస్తాడు. విజయంతో తిరిగి వచ్చిన పరమశివుడికి దిష్టి తగలకుండా ఉండటం కోసం పార్వతీదేవి జ్వాలాతోరణోత్సవం నిర్వహించిందట. అదే పద్ధతిలో ఈ రోజున శివాలయాల్లో జ్వాలాతోరణోత్స వాన్ని జరుపు తుంటారు. కార్తీక పౌర్ణమి రోజున శివాలయానికి వెళ్లి దీపారాధన చేసి ఈ జ్వాలా తోరణోత్సవాన్ని చూడటం వల్ల సమస్త దోషాలు నశించి సకల శుభాలు చేకూరతాయట. ఇంకా ప్రాంతీయ, ఆచార వ్యవహారాల భేదంతో అనేక వ్రతాలు, పూజలు, నోములు చేస్తారీ రోజు, వాటిలో వృష వ్రతం, మహీఫలవ్రతం, నానాఫలవ్రతం, సౌభాగ్యవ్రతం మనోరథ పూర్ణిమావ్ర తం, కృత్తికావ్రతం వంటివి ముఖ్యమైనవి. వీటితోపాటు లక్ష బిల్వార్చన, లక్షప్రదక్షిణ, లక్షవత్తులు, లక్షరుద్రం వంటి పూజలు చేస్తారు.

**ప్రత్యేకతలు...** దైవదర్శనం, దీపారాధన, దీపదానం, సాలగ్రామదానం, దీపోత్సవ నిర్వహణ ఈ రోజు విశేష శుభ ఫలితాలను అనుగ్ర హిస్తాయని కార్తీక పురాణంలో ఉంది. ఎవరి శక్తి సామర్థ్యం లను బట్టి హరిహరులను సేవించి వారి కరుణా కటాక్షాలు పొందాలి. వీరిని ఎంత నిష్టతో పూజిస్తే అంత శుభఫలితాలు ఉంటాయి.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# ఆపన్నులకు అండగా... రెడ్ క్రాస్ సంస్థ - నవంబర్ 5...భారతీయ రెడ్‌క్రాస్ సొసైటీ స్థాపన దినం




రెడ్ క్రాస్ సంస్థ ఏర్పాటు వెనక ఒక మానవతా మూర్తి స్ఫూర్తి ఉంది. స్విస్ పౌరుడు జీన్ హెన్రీ డునాంట్ 1859 లో ఒక వ్యాపార పర్యటనలో, ఆధునిక ఇటలీలో సోల్ఫెరినో యుద్ధం పరిస్థితులకు డునాంట్ సాక్షిగా నిలిచాడు. ఆ యుద్ధంలో 40వేల మంది మరణించారు, అధిక సంఖ్యాకులు గాయపడ్డారు. గాయపడిన వారికి సాయం అందకుండా, రక్షణ లేకుండా పోయిన హృదయ విదారక దృశ్యాలు కళ్ళారా చూశాడు. తన జ్ఞాపకాలు, అనుభవాలను ఎ మెమరీ ఆఫ్ సోల్ఫెరినో పుస్తకంలో రికార్డ్ చేశాడు. ఆ సంఘటన 1863 లో ఇంటర్నేషనల్ రెడ్ క్రాస్ కమిటీ (ఐసిఆర్సి) ఏర్పాటుకు ప్రేరణనిచ్చింది. యుద్ధాలు లేదా ప్రకృతి వైపరీత్యాలు జరిగినప్పుడు తీవ్రంగా నష్టపోయిన వారిని ఆదుకుని వారికి ఆసరాగా నిలవడం కోసం ప్రత్యేకంగా ఏర్పాటైన సంస్థే "రెడ్‌క్రాస్ సొసైటీ". ఇది ప్రపంచ వ్యాప్తంగా ఉన్న సేవా సంస్థలన్నింటిలో అతి పెద్దది. అది మానవతా ఉద్యమంగా రూపు దిద్దుకుంది. అలా ప్రపంచ వ్యాప్తంగా అనేక రకాల సమస్యలతో బాధ పడుతున్న, పేదలను ఆదుకోవాలనే ఉద్దేశం ప్రపంచ రెడ్ క్రాస్ దినోత్సవానికి ప్రేరణగా నిలుస్తున్నది. అంతర్జాతీయ రెడ్‌క్రాస్ కమిటీ వ్యవస్థాపకుడు హెన్రీ డునాంట్ మే 08, 1863లో జన్మించారు. ఆయన గౌరవార్థం ఆయన జయంతి రోజున ఈ ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవాన్ని జరుపు కుంటున్నారు. హెన్రీ డునాంట్ నోబెల్ శాంతి బహుమతి గ్రహీత కూడా. హెన్రీ డునాంట్,1859 జూన్ 24న వ్యాపారం పని మీద లావర్ది నగరానికి వెళ్ళాడు. ఆ సమయంలో ఫ్రాన్స్ ఆస్ట్రియాల మధ్యన జరుగుతున్న యుద్ధం వల్ల గాయపడిన వేలాది స్త్రీ పురుషులు ప్రథమ చికిత్స లేక మరణించడం చూశాక, హృదయ విదారకమైన దృశ్యం అయన మనస్సులో చెరగని ముద్ర వేసింది. తన స్వంత పని మరచిపోయి ఆపదలోనున్న వారందరికీ సహాయం చేశాడు. యుద్ధం ముగిసాక ఆయన ప్రజలందరికీ ... "యుద్ధాలలో గాయపడిన వారందరికి, తక్కిన వారందరూ సహాయం చేయాలి. ఇదీ మానవ ధర్మం." అని విజ్ఞప్తి చేశాడు. ఆయన విజ్ఞప్తి ప్రజలందరినీ ఆకట్టుకుంది. 1864లో జెనీవాలో అంతర్జాతీయ సమావేశం జరిగింది. రెడ్ క్రాస్ సంస్థాపనకు 14 దేశాలు తమ అంగీకారాన్ని తెలిపాయి. మొదటి ప్రపంచ యుద్ధం తర్వాత 14 వ అంతర్జాతీయ సదస్సులో అంతర్జాతీయ కమిషన్ శాంతికి ప్రధాన సహకారిగా రెడ్‌క్రాస్‌ను ప్రవేశ పెట్టింది. టోక్యోలో 1934లో జరిగిన అంతర్జాతీయ సదస్సులో ట్రూస్ సూత్రాలను ఆమోదించారు. అనంతరం రెడ్ క్రాస్ ను వివిధ ప్రాంతాలలో కూడా వర్తింప జేశారు. యుద్ధాలు లేదా ప్రకృతి వైపరీత్యాలు జరిగినప్పుడు తీవ్రంగా నష్టపోయిన వారినీ ఆదుకుని వారికి ఆసరాగా నిలవడం కోసం ప్రత్యేకంగా ఏర్పాటైన సంస్థే రెడ్‌క్రాస్ సొసైటీ. తొలి రోజుల్లో యుద్ధాల్లో గాయపడిన సైనికులకు సేవ చేయడానికి మాత్రమే ఇది పరిమితమై ఉండేది. ఇంచుమించు ప్రపంచంలోని అన్ని దేశాలలోను రెడ్ క్రాస్ శాఖలు, యుద్ధ సమయాలలో, శాంతి కాలం లోను నిర్విరామంగా పనిచేస్తునే ఉంటాయి. జాతి, కుల, మత విచక్షణా భేదం లేకుండా నిస్సహాయులకు ఇది సేవ చేస్తుంది. శాంతి కాలంలో రెడ్ క్రాస్ కార్య కలాపాలు...ప్రథమ చికిత్స, ప్రమాదాలు జరగకుండా చూడడం, త్రాగే నీటిని పరిశుభ్రంగా ఉంచటం, నర్సులకు శిక్షణ నివ్వడం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను నడపటానికి మంత్రసానులకు శిక్షణ, వైద్య శాలలను స్థాపించడం, రక్త నిధులు సేకరించడం, మొదలైన పనులు చేస్తుంటుంది. 1965 వియన్నాలో జరిగిన అంతర్జాతీయ సదస్సులో, మానవత, నిష్పాక్షికత, సమ తౌల్యత, స్వతంత్రం, వాలంటరీ సేవ, ఐక్యత, విశ్వజనీయత...ఏడు ప్రాథమిక సూత్రాలు ఆమోదింపబడినవి. ఈ సూత్రాలను ఉద్యమం మొత్తంలో అమలు పరచాలని తీర్మానించ బడింది.1986 లో జరిగిన సదస్సులోనూ మార్పులు చేర్పులు జరిగాయి. 1876 నుండి 1878 వరకూ జరిగిన రష్యా - టర్కీ యుద్ధ సమయంలో ఉస్మానియా సామ్రాజ్యం రెడ్ క్రాస్ కు బదులుగా రెడ్ క్రెసెంట్ ఉపయోగించింది. క్రాస్ గుర్తు క్రైస్తవ మతానికి చెందినదని, దీని ఉపయోగం వలన తమ సైనికుల నైతిక బలం దెబ్బతింటుందని టర్కీ ప్రతిపాదించింది. రష్యా ఈ విషయంలో సంపూర్ణ అంగీకారాన్ని ప్రకటించింది. 1929 జెనీవాలో జరిగిన సదస్సులో 19వ అధికరణ ప్రకారం ఆమోదం పొంది, స్విడ్జర్లాండ్ దేశపు జాతీయ జెండాలోని ఎర్రని బ్యాక్‌గ్రౌండ్‌లో తెల్లని క్రాస్ ను తారుమారు చేసి తెల్లని బ్యాగ్‌డ్రాప్‌లో ఎర్రని క్రాస్‌ను లోగోగా ఏర్పరిచారు. అనేక దేశాలలో రానురాను దీని ఉపయోగం సాధారణ మయినది. రెడ్ క్రాస్ ప్రైవేట్ సంస్థ కింద 1863 లో స్థాపించిన, అలాగే 1919 లో స్థాపింపబడిన, అంతర్జాతీయ రెడ్‌క్రాస్ కమిటీ , అంతర్జాతీయ రెడ్‌క్రాస్, రెడ్‌క్రెసెంట్ సంఘాల సమాఖ్య (%×ఖీ=జ%), స్విట్జర్లాండ్ లోని జెనీవా నగరంలో ప్రధాన కేంద్రంగా అనుబంధ సంస్థలు పనిచేస్తున్నాయి. హెన్రీ డ్యూనాండ్‌కు 1901లో తొలి నోబెల్ శాంతి బహుమతి లభించింది. రెడ్‌క్రాస్ సంస్థ 1917, 44, 63 సంవత్సరాలలో మూడు సార్లు నోబెల్ శాంతి బహుమతిని గెలుచుకుంది. అంతర్జాతీయ రెడ్‌క్రాస్, రెడ్‌క్రెసెంట్ ఉద్యమం ఒక అంతర్జాతీయ మానవతావాద ఉద్యమం. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న సేవాసంస్థ లన్నింటిలో రెడ్ క్రాస్ సొసైటీ అతి పెద్దది. ఈ సంస్థలో ప్రపంచ వ్యాప్తంగా దాదాపు 9.7 కోట్ల మంది సభ్యులు (కార్యకర్తలు) ఉన్నారు. మానవతా వాదాన్ని, మానవుల జీవితాలను, ఆరోగ్యాన్ని కాపాడడానికి అనునిత్యం శ్రమిస్తూ వుంటారు. జాతి, మత, కుల, వర్గ, వర్ణ, వయో భేదాలు లేకుండా సత్సంకల్పంతో పనిచేస్తూ వుంటారు. అత్యవసర పరిస్థితుల నుండి వారి ప్రాణాలను రక్షించడానికి రెడ్ క్రాస్ సంస్థలు ఎంతో కృషి చేస్తాయి. మానవతా దృష్టితో ప్రారంభమైన ఈ రెడ్‌క్రాస్ ఉద్యమంలో నేడు ప్రభుత్వ సంస్థలు, పాఠశాలలు, విద్యా సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు పాల్గొంటున్నాయి. భారతీయ రెడ్‌క్రాస్ సొసైటీ 1920 నవంబర్లో 5న స్థాపించబడి, ఢిల్లీ ప్రధానకేంద్రంగా విశేష సేవలు అందిస్తూ, ప్రజాదరణ పొందుతున్నది. ఐఆర్‌సిఎస్ 1920 లో స్వచ్ఛంద మానవతా సంస్థగా స్థాపించబడింది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 1,100 కి పైగా శాఖల నెట్‌వర్క్‌తో, ఇది విపత్తులు , అత్యవసర సమయాల్లో సహాయం అందిస్తోంది, అలాగే పేదలు, బలహీనుల సంరక్షణను ప్రోత్సహిస్తుంది. ఇది ప్రపంచంలోని అతిపెద్ద స్వతంత్ర మానవతా సంస్థ, అంతర్జాతీయ రెడ్‌క్రాస్ , రెడ్ క్రెసెంట్ ఉద్యమంలో ప్రముఖ సభ్యసంస్థ. భారత రెడ్‌క్రాస్ మిషన్ అన్ని రకాల మానవతా కార్యకలాపాలను చేపట్టడం, ప్రోత్సహించడం చేస్తోంది.. మానవాళి బాధలను తగ్గించవచ్చు , నివారించవచ్చు తద్వారా శాంతికి మరింత సానుకూలమైన వాతావరణాన్ని సృష్టించడానికి దోహదం చేస్తుంది.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# అన్నవరంలో సంప్రదాయ రీతిలో గిరి ప్రదక్షిణ



**"మూలతో బ్రహ్మరూపాయ మధ్యతశ్చ మహేశ్వరం అథతో విష్ణురూపాయ త్రైక్య రూపాయతేనమః " .**

అన్నవరం వీర వెంకట సత్యనారాయణ స్వామి త్రిమూర్తి రూపం. భక్త సులభుడిగా, కోర్కెలు నెరవేర్చే సత్యదేవుడిగా ఆయనపై అందరికీ అచంచల విశ్వాసం. ఏదైనా పని తలపెట్టినప్పుడు సత్యనారాయణ వ్రతం ఆచరిస్తే అనితర సాధ్యమైన మనోబలం సొంతమవు తుందని చెబుతారు కార్తిక మాసంలో త్రిమూర్తుల అభేదాను భవాన్నిచ్చే మీసాల రాయుని దర్శనం చాలా మంచిదని నమ్మకం. అన్నవరం రత్నగిరి ప్రదక్షిణ అత్యంత ప్రసిద్ధమైంది. అశేష భక్తకోటి కార్తిక పౌర్ణమినాడు గిరి ప్రదక్షిణ చేసి తరిస్తారు. ఇలా చేయడం వల్ల కొండపై వెలసిన దేవతామూర్తుల శక్తిని పొంద గలుగు తామని చెబుతారు. కొండంతా నిండిన అనేక ఔషధ వృక్షాలు సాధకుడికి ఆరోగ్య భాగ్యాన్నీ ఇస్తాయి. శారీరక వ్యాయామం తో పాటు మానసిక ఉల్లాసం, శక్తి, జ్ఞానం, ఆనందం ప్రదక్షిణ తో లభిస్తాయి. అన్నవరం గిరి ప్రదక్షిణ అశ్వమేధ యాగ ఫలాన్నిస్తుందని ఆధ్యాత్మిక వేత్తలు చెబుతారు. మేరువు కుమారులైన భద్రుడు, రత్నాకరుడు మహావిష్ణువు అనుగ్రహంతో భద్రగిరి, రత్నగిరిగా మారినట్లు పురాణ కథనం. శ్రీమన్నారాయణుడు భద్రగిరిపై శ్రీరామచంద్రుడిగా, రత్నగిరిపై సత్యనారాయణ స్వామిగా అవతరించినట్లు చెబుతారు. సత్యదేవుని కొలువు సర్వదేవతా నిలయం. దిగువన స్వామి యంత్రం ఉంది. నలు దిక్కులా పంచాయతన దేవతలు కొలువు దీరారు. ఆగ్నేయాన గణపతి, నైరుతిలో సూర్య భగవానుడు, వాయువ్య దిశలో బాలాత్రిపుర సుందరీ అమ్మవారు, ఈశాన్యాన ఈశ్వరుడు కొలువై ఉన్నారు. ఈ నేపథ్యంలో పంపాతీరాన సత్యదేవుని గిరి ప్రదక్షిణం త్రిమూర్తులకు చేసే ప్రదక్షిణగా చెబుతారు. సాక్షాత్తు ఆత్మ ప్రదక్షిణేనని భావిస్తారు. గిరి ప్రదక్షిణలో పాల్గొనే ప్రచార రథంపై ప్రతిష్ఠించడానికి ప్రత్యేకంగా చెక్కతో తయారుచేసిన ఉత్సవ మూర్తుల విగ్రహాలకు పండితులు పూజలు చేస్తారు. కార్తీక పౌర్ణమి ఉదయం సత్యదేవుడు, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను పల్లకిపై ఉంచి కొండ పైనుంచి మెట్ల మార్గంలో కొండ దిగువనగల కనకదుర్గమ్మ వారి ఆలయానికి తీసుకువచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించడం సాంప్రదాయం. అన్నవరం రత్నాద్రి వాసుడైన శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి వారి గిరి ప్రదక్షణ కార్యక్రమం బుధ వారం కార్తీక పౌర్ణమి సందర్భంగా అశేష జనవా హినిలో అత్యంత వైభవంగా జరిగనుంది. ఉదయం కొండ దిగువల తొలి పావంచాల వద్ద స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం గిరిప్రదక్షిణను ప్రారంభిస్తారు. వేద పండితులు, ఆలయ ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో గర్భాలయంలో ఉన్న శ్రీ స్వామి అమ్మవార్ల ఉత్సవ మూర్తులను పల్లకిలో ఆసీనుల గావిస్తారు. వివిధ రకాల సుగంధ భరితమైన పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరిస్తారు. కొండపై నుంచి కొండకు దిగివకు మంగళ వాయిద్యాల నడుమ తోడుకొని వచ్చి శ్రీ స్వామివారికి విగ్నేశ్వర పూజ, పుణ్యాహ వాచనం, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, భక్తుల కోలాహలం నడుమ గిరి ప్రదక్షిణ కొనసాగనుంది. గోదావరి జిల్లాలతో పాటు రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో కార్యక్రమానికి హాజరు కానున్నారు భక్తులు, గ్రామస్తులు, శ్రీ సత్యదేవుని నామస్మరణ పటిస్తూ, కోలాటాల నడుమ, కన్నుల వైభవంగా శ్రీ స్వామివారి గిరి ప్రదక్షిణ జరిగనుంది. ధర్మకర్తల మండలి చైర్మన్ రోహిత్, ఇఓ వీర్లా సుబ్బారావు ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. **రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# నేడు కార్తీక పౌర్ణమి... ముస్తాబైన ధర్మపురి



ధర్మపురి క్షేత్రంలో బుధవారం నిర్వహించనున్న కార్తీక పౌర్ణమి వేడుకలకు క్షేత్రం ముస్తాబైంది. సాంప్రదాయ రీతిలో నిర్వహిం చనున్న పర్వదిన వేడుకల సందర్భంగా దేవస్థానం లోని ప్రధానాలయాలైన శ్రీ యోగానంద, ఉగ్ర లక్ష్మీ సమేత నారసింహ, శ్రీ వెంకటేశ్వర, శ్రీ రామ లింగేశ్వ రాలయాలలో ఉదయా త్పూర్వం నుండే పవిత్ర గోదావరి నది జలాలతో అభి షేకాది అర్చనలు, ప్రత్యేక పూజలు జరుప నున్నారు. ప్రధానంగా శ్రీ వేంకటేశ్వర శ్రీ వేణుగోపాల ఆలయాల మధ్య దేవస్థాన ప్రాంగణంలో ఉన్న ఉసిరిక వృక్షాన్ని అలంకరించి, కార్తీక దామోదరున్ని పూజించడం, ఉసిరిక చెట్టు చుట్టూ ప్రదక్షిణలు చేయడం, అసంఖ్యాక మహిళలు గోదావరి నదిలో పవిత్ర మంగళ స్నానాలు ఆచరించి, దొప్పలలో వెలిగించిన కార్తీక దీపాలను నదీ నీటిలో వది లిపెట్టడం, పురాణ శ్రవణం, క్షేత్రంలో అనాదిగా ఆచరిస్తున్న సాంప్రదాయాలు. దేవస్థానం ఈఓ శ్రీనివాస్, జక్కు రవీందర్ నేతృత్వం లోని ధర్మ కర్తల పర్యవేక్షణలో, దేవస్థాన వేద పండితులు బొజ్జా రమేశ శర్మ, సంపత్ కుమార శర్మ, సంతోష్ శర్మ, రాజగోపాల్ శర్మ సారథ్యంలో ఆర్చకుల బృందం, సిబ్బంది ప్రత్యేక ఏర్పాట్లు గావిస్తున్నారు. జగిత్యాల నుండే గాక వివిధ ఆర్టీసి డిపోల నుండి ప్రత్యేక బస్సులను నడిపే ఏర్పాట్లు చేస్తున్నారు. ధర్మపురి సర్కిల్ ఇన్స్పెక్టర్ రాం నర్సింహా రెడ్డి, ఎస్ఐ ఉదయ్ కుమార్, స్థానిక సివిల్, ప్రత్యేక పోలీసుల ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాట్లపై దృష్టి కేంద్రీకరించారు. రద్దీ క్రమబద్ధీకరణపై ప్రత్యేక దృష్టి నిలిపి, అందుకు వలసిన ప్రత్యేక ఏర్పాట్లు గావిస్తున్నారు.

**పంచ సహస్రాధిక దీపాలంకరణకు ఏర్పాట్లు...** కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని బుధ వారం కార్తీక పౌర్ణమి నాడు సాయంత్రం 5 గంటల నుండి స్థానిక బ్రహ్మ పుష్కరిణి (కోనేరు)లో పంచ సహస్ర (ఐదువేల) దీపాలంకరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించను న్నారు. క్షేత్రంలో ఇటీవలి కాలంలో పంచ సహస్ర దీపాలంకరణ విశేషంగా జరుప బడుతున్న క్రమంలో, ఈ సంవత్సరం మరింత వైభవంగా జరిపేందుకు ఐదు వేల ప్రత్యేక ప్రమిదలు, వస్తువులను సమ కూరుస్తున్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు, గ్రామస్తులు యధోచితంగా వత్తులు, నూనె తీసుకొని వచ్చి పాల్గొనవలసిందిగా దేవస్థానం ఇఓ శ్రీనివాస్ సంకటాల కోరారు. దేవస్థానం నుండి భక్తుల సహ కారంలో 5000 దీపములు, నూనె సమకూరిందని, వాటితో తగిన ఏర్పాటు చేయ బడుననీ, ఇంకను భక్తులు తాము నేరుగా దీపములు తీసుకొని వచ్చి వెలిగించ వచ్చునని వారు వివరించారు.

**వేణుగోపాలునికి ప్రత్యేక పూజలు...** ధర్మపురి క్షేత్రంలోని, ధర్మపురి దేవస్థానంలోని అలంకృత శ్రీ వేణుగోపాల స్వామి, శ్రీలక్ష్మీ నరసింహ దేవస్థానంలోని శ్రీవేణు గోపాల స్వామి ఆలయంలో ప్రత్యేక పూజాదికాలు నిర్వహించారు. కార్తీక శుద్ధ ఏకాదశి మొదలుకొని పౌర్ణమి వరకు పంచ పర్వాలలోని ఐదు రోజులలో ప్రత్యేక అర్చనలు అభిషేకాలు పూజలు నిర్వహించడం సాంప్రదాయం కాగా, ధర్మపురి క్షేత్రస్థ ఆలయాలలో ఈ సందర్భంగా అర్చకులు ప్రత్యేక పర్వదిన పూజలను నిర్వహించారు. దేవస్థానం అధికారులు, సిబ్బంది, అర్చకులు, పండితులు భక్తులు పాల్గొన్నారు. ఏర్పాట్లను పర్యవేక్షించారు. **రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

చురకలు

## సంపాదకీయం

## ఎంతసేపూ నెహ్రూ...ఇందిరా గురించేనా...

# పాయింటే మరి !

ఈ దేశానికి కాంగ్రెస్ పార్టీ ఒక్కతే స్వాతంత్ర్యం తెచ్చింది అన్నది పూర్తి నిజం కాకపోయినా చాలా వరకూ నిజం అందులో ఉంది. కాంగ్రెస్ అనే సంస్థ అనాడు తెల్ల దొరలతో పోరాడి సాధించింది. ఇక మిగిలిన సంస్థలు కూడా పోరాటం చేసాయి. అంతా కలసి దేశానికి స్వేచ్ఛా వాయువులు ప్రసాదించారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత నెహ్రూ ఒక పదిహేడేళ్ళు, ఇందిరాగాంధీ ఒక పదహారేళ్ళు ఈ దేశాన్ని ఏలారు. ఇక రాజీవ్ గాంధీ అయిదేళ్ళ పాలన కూడా కలుపుకుంటే 38 ఏళ్ళ పాటు ఒకే కుటుంబం ఏలుబడిలో దేశం ఉంది. నెహ్రూ ఫ్యామిలీ పాలించడం వల్ల దేశానికి మేలు జరిగిందా లేదా అంటే ఇక్కడ కూడా భిన్న వాదనలు ఉన్నాయి. అయితే మంచీ జరిగింది, కొన్ని సందర్భాలలో ఇబ్బందులు కూడా వచ్చాయి. కానీ విమర్శలు చేసే వారు ప్రధానంగా ప్రత్యర్ధులు అయితే నెహ్రూ ఫ్యామిలీని లక్ష్యంగా చేసుకుని పెద్ద ఎత్తున ఎటాక్ చేస్తూంటారు. మరీ ముఖ్యంగా చూస్తే బీజేపీ ఈ పని చేస్తూ వస్తోంది దీని మీద ఐదవ తరం గాంధీలు గట్టిగా బదులిస్తున్నా బీజేపీ బిగ్ సౌండ్ లో అది పెద్దగా వినిపించడం లేదు అన్న మాట కూడా ఉంది.

**ప్రియాంక ఫైర్ :** బీహార్ ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ ఎంపీ ఆ పార్టీ అగ్ర నేత అయిన ప్రియాంకా గాంధీ బీజేపీ అగ్ర నేతల మీద ఒక రేంజిలో ఫైర్ అయ్యారు. ఎంతసేపూ నెహ్రూ ఇందిరాగాంధీలను విమర్శించడం తప్పించి బీజేపీ ఈ దేశానికి ఏమి చేసిందని ఆమె సూటిగా ప్రశ్నించారు. మాట్లాడితే చాలు నెహ్రూ అలా చేసారు, ఇందిర ఇలా చేశారు వారి వల్లనే తప్పులు జరిగాయని నిందలు వేస్తున్న బీజేపీ పెద్దలు తమ హయాంలో ఏమి చేశామో ఎందుకు చెప్పలేకపోతున్నారు అని ఆమె నిలదీశారు. నెహ్రూ ఇందిరాగాంధీ దేశానికి చేసిన మేలు బీజేపీ పెద్దలకు ఏ మాత్రం కనిపించడం లేదని కేవలం రాజకీయ విమర్శలు మాత్రం చేస్తున్నారు అని ఆమె మండిపడ్డారు.

**పరిశ్రమలు స్థాపించారు :** ఈ దేశంలో పారిశ్రామిక విప్లవం తీసుకుని వచ్చి పెద్ద ఎత్తున కర్మాగారాలు స్థాపించి ప్రజలకు ఉపాధి కల్పించింది నెహ్రూ ఇందిరాగాంధీలు కాదా అని ఆమె ప్రశ్నించారు. ప్రభుత్వ రంగంలో ఎన్నో పరిశ్రమలు ఉన్నాయి అంటే దానికి ఆ ఇద్దరి పాలనలో తీసుకున్న కీలక నిర్ణయాలు కారణం కాదా అని ఆమె నిగ్గదీస్తున్నారు. ప్రభుత్వ రంగాన్ని బలోపేతం చేసి దేశంలో ఉద్యోగ వ్యవస్థని పటిష్టం చేసిన ఆ ఇద్దరు అగ్ర నేతలని విమర్శించే ముందు బీజేపీ ఎన్ని ఉద్యోగాలు ఇచ్చింది అని ఆమె ప్రశ్నించారు. ప్రభుత్వ రంగ సంస్థలు బీజేపీ ఎన్ని ఏర్పాటు చేసిందని ఆమె నిలదీశారు.

**వర్తమానమేదీ :** బీజేపీ నాయకులు మాట్లాడితే గతం అంటూ చరిత్రలోకి వెళ్తారని లేదా భవిష్యత్తు ఆశలు చూపిస్తారని తప్పించి వర్తమానంలో వారు ఏమి చేశారు అన్నది ఎపుడూ చెప్పింది లేదని ప్రియాంకా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్డీయే ప్రభుత్వం బీహార్ లో ఎన్నో ఏళ్ళుగా అధికారంలో ఉండి ఉద్యోగాలు ఇవ్వలేకపోయిందని ఇపుడు మాత్రం ఎన్నికల హామీగా కోటి ఉద్యోగాలు అని ప్రకటిస్తున్నారని ఎద్దేవా చేశారు. దేశంలో ఎక్కడ నుంచి ఎక్కడికి అయినా వలసలకు వెళ్తున్న వారిలో బీహార్ వారే అత్యధికమని ఆమె అన్నారు. ఇలా బీహార్ ని ఏమీ కాకుండా చేసి మరోసారి గెలిపించమని ఎలా అడుగుతారని ఆమె ప్రశన వర్షమే కురిపిస్తున్నారు. మొత్తం మీద చూస్తే నెహ్రూకి ముత్త మనవరాలు, ఇందిరమ్మకు అసలు మనవరాలు అయిన ప్రియాంక సూటిగా సుత్తి లేకుండా బీజేపీ పెద్దలకు వేసిన ప్రశ్నలు ఆలోచింపచేసేలాగానే ఉన్నాయని అంటున్నారు. మరి దీని మీద కమలదళం ఎలా రియాక్ట్ అవుతుందో చూడాల్సి ఉంది.

## శాస్త్రవేత్తలకు ప్రేరణలు... జాన్ బర్డన్ సండర్సన్ హాల్డేన్ పరిశోధనలు... నవంబర్ 5...జె.బి.ఎస్. హాల్డేన్ జయంతి

జాన్ బర్డన్ సండర్సన్ హాల్డేన్, జన్యు శాస్త్రంలో, అలాగే పరిణామ సిద్ధాంతంలో చేసిన కృషి ద్వారా శాస్త్రవేత్తలకు మార్గదర్శిగా నిలిచారు. 20వ శతాబ్దపు తొలి అర్ధభాగంలో ఆయన సృష్టించిన పరిశోధనల కారణంగా, జన్యు శాస్త్రం మరియు పరిణామానికి సంబంధించి అనేక నూతన ఆవిష్కరణలు, సిద్ధాంతాలు వెలుగులోకి వచ్చాయి. జె.బి.ఎస్. హాల్డేన్ 1892లో లండన్‌లో జన్మించారు. ఆయన తండ్రి డాక్టర్ జాన్ స్కాట్ హాల్డేన్ కూడా ప్రఖ్యాత శాస్త్రవేత్త, పరిశోధకుడు, వైద్యుడు. తన తండ్రి స్ఫూర్తితోనే హాల్డేన్ చిన్నప్పటి నుంచే శాస్త్రం పట్ల ఆసక్తి పెంచుకున్నారు. ఆయన ప్రాథమిక విద్యనంతా ఇంగ్లాండ్‌లోనే అభ్యసించి, ఆక్స్‌ఫర్డ్ విశ్వ విద్యాలయంలో జీవశాస్త్రం, రసాయన శాస్త్రాలలో ప్రత్యేకత సాధించారు. ఆయన విద్యాభ్యాసంలో పొందిన పరిజ్ఞానం, పరిశోధన పట్ల ఉన్న మక్కువ అతన్ని ఒక గొప్ప శాస్త్రవేత్తగా తీర్చిదిద్దింది. హాల్డేన్ చేసిన ముఖ్యమైన పరిశోధనలలో జన్యువుల క్రియాశీలత ప్రాధాన్యత గలదిగా నిలిచింది. జన్యువులు జీవుల లక్షణాలను ఎలా నియంత్రిస్తాయి, వాటి ఆధారంగా వంశపారంపర్య లక్షణాలు ఎలా సంక్రమిస్తాయో విశదీకరించారు. ఈ పరిశోధనలకు ఆధారంగా, జెన్యు శాస్త్రంలో అనేక పరిశోధనలు ప్రారంభమయ్యాయి. డార్విన్ ప్రవేశపెట్టిన సహజ ఎంపిక సిద్ధాంతాన్ని హాల్డేన్ గణిత శాస్త్ర సూత్రాలతో వివరిస్తూ, పరిణామం ప్రక్రియను గణిత శాస్త్రీయంగా విశ్లేషించే ప్రయత్నం చేశారు. ఈ గణిత నమూనాలు పరిణామ ప్రక్రియలో సహజ ఎంపికను అర్థం చేసుకోవడంలో ముఖ్యపాత్ర పోషించాయి. ఆయన చేసిన గణిత శాస్త్ర విశ్లేషణ, తరువాతి కాలంలో జన్యు శాస్త్రం యొక్క గణిత నమూనాలకు బాటలు వేసింది. మానవ జన్యుశాస్త్రం రంగంలో కూడా హాల్డేన్ సాంకేతిక పరిజ్ఞానాలను అన్వయించారు. ఆయన మానవ జన్యు వైకల్యాలు మరియు వ్యాధులపై పరిశోధనలు చేశారు. జన్యు సమస్యలు ఆరోగ్యంపై ఎలా ప్రభావం చూపుతాయో ఆయన విశదీకరించారు. ఆయన పరిశోధనలు జన్యు వైకల్యాల పట్ల అవగాహన పెంచడంలో కీలక పాత్ర పోషించాయి. హాల్డేన్ పరిణామ శాస్త్రానికి గణితం ఎలా అన్వయించాలో ప్రాథమిక సూత్రాలు రూపొందించారు. ఆయన పనిచేసిన ముఖ్య అంశం, ప్రజలలో ఉన్న వేరియేషన్స్ సగటు జీవితకాలం, జన్యు వైవిధ్యాలకు సంబంధించిన గణిత నమూనాలను అర్థం చేసుకోవడం. ఈ గణిత నమూనాలు సహజ ఎంపిక ప్రక్రియలను సులభంగా అర్థం చేసుకోవడంలో తోడ్పడ్డాయి. హాల్డేన్ చేసిన ఈ కృషి, నేడు జన్యు శాస్త్రం అధ్యయనం చేసే శాస్త్రవేత్తలకు ప్రేరణగా ఉంది. హాల్డేన్ బహుముఖ ప్రతిభావంతుడు. శాస్త్రవేత్తగా కాకుండా సామాజిక సమస్యలపై కూడా విప్లవాత్మక దృక్పథం కలిగి ఉన్నారు. ప్రజలలో శాస్త్ర విద్యను ప్రోత్సహించాలని, శాస్త్రాన్ని సామాన్య ప్రజలకు చేరవేయాలని ఆయన ఆశించారు. రాజకీయంగా సైతం ఒక సామాజికవాది దృక్పథం కలిగి, శాస్త్ర పరిజ్ఞానం ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావాలని విశ్వసించారు. హాల్డేన్ పరిశోధనలు పరిణామ శాస్త్రం మరియు జన్యు శాస్త్రంలో ఒక కొత్త దశను సృష్టించాయి. ఆయన ఆవిష్కరించిన సిద్ధాంతాలు తదుపరి శాస్త్రవేత్తలకు ప్రేరణగా నిలిచాయి. పరిశోధనలే కాకుండా శాస్త్ర విద్యను సామాజిక విప్లవానికి




అన్వయించి, శాస్త్రవేత్తలు తమ పరిశోధనలను ప్రజల అభివృద్ధికి వినియోగించుకోవాలనే స్ఫూర్తిని అందించారు. జె.బి.ఎస్. హాల్డేన్ వంటి శాస్త్రవేత్తలు జన్యు శాస్త్రంలో గణనీయమైన మార్పులకు పునాది వేశారు. ఆయన పరిశోధనలు పరిణామ శాస్త్రానికి మైలురాయి, నేటి శాస్త్రవేత్తలకు ప్రేరణగా నిలుస్తున్నాయి.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

## తెలంగాణ విముక్తి కోసం జీవితాంతం పోరాడిన నల్ల నరసింహులు - నవంబర్ 5.... నరసింహులు వర్ధంతి

1945 దశకంలో పెను ఉప్పెనై పోటెత్తిన తెలంగాణ సాయుధ విముక్తి పోరాట కెరటాల్లో ఒక ఉత్తుంగ తరంగమై విప్లవించాడు నల్లా నరసింహులు. 1945 నుండి 1951 వరకు నిజాం ప్రభుత్వ దన్నుతో రజాకార్లు దేశముఖ్ లు, సర్దేశ్ ముఖ్ లు, దేశాయిలు, సర్ దేశాయిలు, జమీన్దార్లు, తెలంగాణ ప్రజలపై దశాబ్దాలుగా కొనసాగించిన రాక్షస, పైశాచిక అణచివేత, హత్యాకాండ, దోపిడికి వ్యతిరేకంగా, జరిపిన ప్రసిద్ధి చెందిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట సందర్భంలో జనగామ ప్రాంత దళ నాయకత్వం వహించిన పోరాట యోధుడు ఆయన. నాడు నిజాం పాలనలో ఉన్న హైదరాబాద్ రాష్ట్రంలోని 7430 గ్రామాల్లో ప్రైవేట్ వ్యక్తుల అజమాయిషీలో నిజాం తరుపున పన్నులు వసూలు చేసే అప్రత్యక్ష అధికారాన్ని చేజిక్కించుకున్నారు కొందరు భూస్వాములు. లక్షల, వేల కొద్ది ఎకరాల భూమిని తమ స్వాధీనంలో పెట్టుకాగా, ఆ భూములను సాగుచేసి పండించే రైతులు మాత్రం కౌలుదార్లే, కూలీలై, పెట్టి బానిసలై బతుకుల నీడుస్తున్న దయనీయ కాలంలో చారిత్రాత్మక తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం రూపు దిద్దుకుంది. దానికి నాయకత్వం వహించిన 'ఆంధ్ర మహాసభ' లో అత్యంత కీలక పాత్ర వహించి వేలాది మంది యోధులతో నిజాం ప్రభుత్వాన్ని ప్రతిఘటిస్తూ వీరోచిత విముక్తి పోరాటంలో ఎన్నో త్యాగాలు చేసి చేసి, ఎన్నోసార్లు పోలీసులకు పట్టుబడి, చిత్ర హింసలకు గురై, కేసుల పాలై, మూడుసార్లు ఉరిశిక్షలు విధించబడి, ధైర్యంగా తన వాదనలను వినిపించి తెలంగాణ టైగర్' అని కీర్తించబడ్డ అసామాన్య వీరకిశోరం నల్ల నరసింహులు. భారత స్వాతంత్ర్యం, హైదరాబాద్ విలీనం సందర్భాల మధ్య కాలంలో జరిగిన వేలాది మంది మరణాలకు, ఊచ కోతలకు, మాన భంగాలకు, హత్యలకు పైశాచిక హింసకు సాక్షమై నిలిచిన సంధి సమయాన్ని చారిత్రాత్మక 10 లక్షల ఎకరాల భూ విముక్తి తర్వాత దాన్ని పేదలకు పంచిన ప్రజా విజయ ఘటనకు ప్రతీకగా నిలిచిన వాడు నల్ల నరసింహులు. నరసింహులు గ్రామం కడవెండి. అతి మామూలు పేద పద్మశాలి కుటుంబం. చేనేత పని చేసి ఉర్దూ మీడియంలో ఏడవ తరగతి వరకు మాత్రమే చదువుకున్నవాడు. దోపిడికి వ్యతిరేకంగా ఉద్యమిస్తూ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా.. ఏండ్లకు ఏండ్లు అజ్ఞాతంలో ఉంటూ విప్లవించిన సాయుధ యోధుడు ఆయన. తెలంగాణ ప్రాంతం భూస్వాముల, నిజాం తాబేదార్ల ఉక్కు పాదాల కింద నలిగిపోతున్న సందర్భంలో ఆంధ్ర మహాసభ రూపంలో కమ్యూనిస్ట్ల కార్యక్రమ వేదిక ఒక కొత్త పరిస్థితి తెచ్చింది. పుచ్చలపల్లి సుందరయ్య, రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, ఆరుట్ల రామచంద్రా రెడ్డి, దేవులపల్లి వెంకటేశ్వరరావు, భీమిరెడ్డి నరసింహారెడ్డి, నైతిక విలువలతో, మానవత్వంతో తమకున్న ఆస్తులను ప్రజల పరం చేశారు. గ్రామీణ తెలంగాణను సంఘటిత పరుస్తూ భువనగిరిలో జరిగిన 11వ ఆంధ్ర మహాసభ ద్వారా గ్రామ దళ నిర్మాణం చేపట్టారు. అలా జనగామ తాలూకాలోని ఎన్నో గ్రామాల్లో దళాలను నిర్మించి, స్వయంగా నాయకత్వం వహించి పార్టీ అగ్ర నాయకుల సమన్వయం తో విప్లవించిన కొదమ సింహం నరసింహులు. అటు భూస్వాములకు, ఇటు రజాకార్లకూ సింహ స్వప్నమై నిద్రలేకుండా చేశాడు. మొట్టమొదటి తిరుగు బాటు తన స్వంత ఊరు నుండే మొదలుపెట్టి 1947 సెప్టెంబర్ 11న నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా, దోపిడి దారులైన భూస్వాములను తరిమికొట్టేందుకు 'సాయుధ పోరాటానికి పిలుపు ఇచ్చాడు. ఆ పిలుపు యుద్ధ భేరీగా మారి, తెలంగాణ నేల నాలుగు చెరగులా ప్రత్యేకించి భూస్వామ్య వ్యవస్థ బలంగా పాతుకు పోయిన నల్గొండ, ఖమ్మం, వరంగల్, కరీంనగర్ లాంటి జిల్లాలలో ఎర్ర జెండాల నీడలో లక్షలాది మంది నిరక్షరాస్య సుశిక్షత ప్రజాసైన్యం ఎక్కడికక్కడ గడీలపై, ఖాసీం రజ్వీ నాయకత్వంలో పని చేసే రజాకార నిజాం పోలీస్ క్యాంప్లపై మెరుపు దాడులు చేస్తూ ముందుకు సాగింది. వేలకొద్ది ఎకరాల భూములను విముక్తం చేస్తూ, బహిరంగంగానే దున్నే వాడికే భూమిని పంచిపెడ్తూ, వందలు వేలమంది కర్కశ నిజాం సైన్యాలకు, రజాకార్లకూ బలై ప్రాణాలను కోల్పోతూ 1951 వరకు కొనసాగింది. పోరాట దళాలలను, ఆత్మార్పణ గెరిల్లా సమూహాలను నిర్మించి, నాయకత్వం వహించి, కదన రంగంలో ముందుండి నడిపించి అనేకసార్లు పట్టుబడి చిత్ర హింసలను సహించి, అనేక కేసుల్లో ఇరికించబడి, మూడుసార్లు ఉరిశిక్షలు విధించబడి అజేయంగా నిలిచిన ధీరుడు నల్లా నరసింహులు. పోలీస్ చర్య అనంతరం యూనియన్ సైన్యాలు నిషిద్ధ కమ్యూనిస్ట్ సభ్యులను అడవుల్లోకి తరుముతూన్న సందర్భంగా, పట్టు బడి,



ఉరి శిక్ష విధించ బడగా, అంతర్జాతీయ కమ్యూనిస్ట్ సంస్థల, భారత ట్రేడ్ యూనియన్ల ఆందోళన ఫలితంగా ఉరితీతకు 12 గంటల ముందు ఉరిశిక్ష నిలిపివేయబడడం విశేషం. ఇంతకూ నల్లా నరసింహులు ఎవరు ? అని నాటి యూనియన్ సైనిక జనరల్ జె.ఎస్. చౌదరి నల్లగొండ జైలుకు చూడ్డానికి వచ్చినప్పుడు ఆ జిల్లా ఎస్.పి. ధన్ రాజ్ నాయుడు సంకెళ్ళతో ఉన్న నరసింహులు "టైగర్ ఆఫ్ తెలంగాణ" అని పరిచయం చేయడం గమనార్హం. నెహ్రూ ప్రభుత్వాన్ని కూల దోయడానికి ప్రయత్నిస్తున్నారని స్టేట్ కాంగ్రెస్ ఇచ్చిన తప్పుడు నివేదికల వల్ల నిషేధానికి గురై, అజ్ఞాత నాయకులను లొంగి పోవాల్సిందిగా హెచ్చరించిన నేపథ్యంలో నరసింహులు వంటి అనేక మంది యోధులు జనావా సాలను వీడి, నల్లమల్ల,రాచకొండ అరణ్యాల్లోకి నిష్క్రమించగా, చివరికి విచిత్రమైన పరిస్థితుల్లో 1951 అక్టోబర్ లో 'సాయుధ పోరాటాన్ని' విరమిస్తున్నట్టుగా కమ్యూనిస్ట్ పార్టీ ప్రకటన వెలువడడం ద్వారా ఉద్యమం అనూహ్యంగా చల్లారి పోయింది. భారత దేశంలో ప్రజాస్వామ్య పాలన ప్రారంభమైన తరువాత కూడా అనేక కేసులతో కోర్టుల చుట్టూ తిరిగి తిరిగి చివరికి అప్పటి శాసనసభ ప్రతిపక్ష నాయకుడు పుచ్చలపల్లి సుందరయ్య చొరవతో చివరి ఉరిశిక్ష నుండి బయటపడి, అంతిమంగా 1959 జనవరి 26న స్వేచ్ఛా ప్రపంచంలోకి వచ్చాడు నరసింహులు. పోరాట స్మృతులతో తన ధర్మపత్ని వజ్రమ్మ తో కలసి చారిత్రాత్మక తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో అసువులు బాసిన వేలాది వీరులను, పిడిత ప్రజలకు 10 లక్షల ఎకరాల భూమి పంపక విజయాలనూ స్మరించుకుంటూ... తృప్తితో జీవితాన్ని నమ్మిన సిద్ధాంతం కోసమే దారబోసి, త్యాగ ధనునిగా నరసింహులు 1993 నవంబర్ 5న ఈ లోకం వదిలి వెళ్లాడు. **రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

## "సునామీ" లపై అవగాహన అవసరం - "విజ్ఞాన వాహిని" భాగ్య నగరానికి గర్వ కారణం - నవంబర్ 5... ప్రపంచ సునామీ అవగాహన దినం సందర్భంగా

సునామీలు అరుదుగా సంభవిస్తాయి. వస్తే మాత్రం మానవాళికి అమితంగా నష్టం చేకూరుస్తాయి. క్షణాల్లో ప్రాణాలను కబళిలిస్తాయి. ఊరూవాడ మొత్తాన్ని ఏకం చేస్తాయి. భారీగా ప్రాణనష్టం, ఆస్తినష్టానికి కారణ భూతాలు అవుతాయి. సునామీ లపై ప్రజలలో అవగాహన స్థాయి పెంచేందుకు ప్రతియేటా నవంబర్ 5న ప్రపంచ సునామీ అవగాహన దినోత్సవంగా పాటించాలని ఐక్యరాజ్య సమితి పిలుపు నిచ్చింది. క్రీ.పూ. 426 ఆరంభంలో గ్రీకు చరిత్ర కారుడు తుసైదిదేస్ తన పుస్తకం పెలిపొంనేసియన్ యుద్ధ చరిత్రలో సునామి కలుగచేసే కారణముల గురించి చర్చించి, అవి భూకంపం వల్లే సంభవిస్తాయని చెప్పాడు. ప్రపంచ వ్యాప్తంగా వందేళ్లలో 58 సునామీలు సంభవించాయి. రెండున్నర లక్షల మంది మృత్యువాత పడ్డారు. 2004లో వచ్చిన సునామీతో సుమారు 2,40,000 మంది వరకు అసువులు బాసారు. మరో 48,000 మంది కనిపించకుండా పోయిన విషయం విదితమే. ఈ సునామీ 14దేశాల వారిని ప్రభావితం చేసింది. అంతకు ముందు 1960 మేలోనూ, 1945 నవంబర్‌లోనూ సునామీలు సంభవించాయి. జపాన్ కు చెందిన గోహి అనే రైతు 1985లో సముద్రం వెనక్కి వెళ్లడాన్ని గుర్తించాడు. శబ్ద తరంగాల్లో మార్పును గమనించాడు. దీంతో సునామీ రాబోతుందని గుర్తించాడు. ప్రజలకు హెచ్చరిక చేయడానికి తన వరిపొలం మొత్తాన్ని తగుల బెట్టాడు. ఈ మంటల ద్వారా ప్రజలు రానున్న ఉపద్రవాన్ని గుర్తిస్తారని భావించి రైతు ప్రజల ప్రాణరక్షణకు పూనుకున్నాడు. ఇలా ఆయన ప్రేరణతో "వరల్డ్ సునామీ అవేర్నెస్ డే" వచ్చింది. అప్పటి వరకు సునామీపై ముందస్తు సమాచారం అందించే కేంద్రం ప్రపంచ దేశాల్లో ఎక్కడా లేదు. దీంతో భారత ప్రభుత్వం కూడా తేరుకుని సునామీ హెచ్చరిక కేంద్రం ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఆ మేరకు అప్పటికే ఇంకాయిస్ ద్వారా మహా సముద్ర సమాచార సేవలు అందుతుండడంతో దీనికి అనుబంధంగానే సునామీ హెచ్చరిక కేంద్రం నెలకొల్పింది. 2005 నుంచి 2007 వరకు ఆపరేషన్ ప్రక్రియ కొనసాగింది. 2007లో పూర్తి స్థాయిలో "ఇండియన్ సునామీ ఎర్లీ వార్నింగ్ సిస్టం" కేంద్రంగా అవతరించింది. మత్స్యకారులకు ఉపయోగకర సేవల కోసం హైదరాబాద్ లో 1999లో ప్రగతినగర్ సమీపంలో పొటెన్షియల్ ఫిషింగ్ జోన్ (పీఎఫ్జెడ్)గా ఇంకాయిస్ ఆవిర్భవించింది. సునామీకి ముందు మొదట సముద్రంలో భూమి కంపిస్తుంది. అలా భూప్రకంపనలు జరిగిన 5%-%6 నిమిషాలకు





ఇంకాయిస్ కు సమాచారం అందుతుంది. సముద్ర భూభాగంలో అమర్చిన సిస్మో మీటర్ల ఆధారంగా శాటిలైట్ ద్వారా భూకంపనలు జరిగిన సమాచారం ఇంకాయిస్ కు చేరుతుంది. ఆ తర్వాత భూకంపం ప్రభావంతో సునామీ ఉత్పన్నమయ్యే అవకాశం ఉందా? లేదా? అనే దానిపై దృష్టి సారిస్తారు. సముద్ర జలాలకు కొద్ది కి.మీ దూరంలో ఏర్పాటుచేసిన 'సునామీ బోయ్ నెట్వర్క్' పరికరాల ఆధారంగా కెరటాల ఎత్తు, వాయు దిశను పరిశీలించి సునామీని గుర్తిస్తారు. సునామీ అన్న పదం జపనీస్ భాషకు చెందింది. హార్బర్ కెరటం అని దీని అర్థం. సునామీలు ఏర్పడినప్పుడు రాకాసి అలలు 100 అడుగుల ఎత్తు వరకు వెళతాయి. పసిఫిక్ మహాసముద్రంలో రింగ్ ఆఫ్ ఫైర్ కారణంగానే 80 శాతానికి పైగా సునామీలు సంభవిస్తున్నాయి. సునామీ అలలు గంటకి 805 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తాయి. ఒక జెట్ విమానం స్పీడ్‌తో ఇది సమానం. ప్రపంచంలో జపాన్ తర్వాత అమెరికాలోని హవాయి, అలస్కా, వాషింగ్టన్, ఒరెగాన్, కాలిఫోర్నియాకు సునామీ ముప్పు ఎక్కువ. అందులో హవాయి దీవులకి ఉన్న ముప్పు మరెక్కడా లేదు. ప్రతీ ఏడాది అక్కడ సునామీ సంభవిస్తుంది. ప్రతీ ఏడేళ్లకి తీవ్రమైన సునామీ ముంచేస్తుంది. హిందూ మహాసముద్రంతో అనుబంధంగా ఉన్న 28 దేశాలకు సునామీ హెచ్చరికలు మన హైదరాబాద్ నుంచే వెళ్తుంటాయని చాలా మందికి తెలియని విషయం. సముద్రాల్లో ఏర్పడే భూప్రకంపనల నుంచి సునామీ రాక.. సముద్రపు అలల ఎత్తు.. వేగం.. వాటి తీవ్రత ఏమేర ఉంటుందో నిమిషాల్లో భారత్ తో పాటు ఆయా దేశాలకు చేరవేసే 'విజ్ఞాన వాహిని' భాగ్యనగర సొంతమనే విషయం గర్వకారణం. నగర కీర్తి కెరటంగా 'ఇంకాయిస్' (భారత జాతీయ మహా సముద్ర సమాచార సేవా కేంద్రం) పరిఢ విల్లుతోంది. ప్రపంచంలో మూడు దేశాల్లో సునామీ హెచ్చరిక కేంద్రాలు ఉంటే అందులో హైదరాబాద్ లోని ఇంకాయిస్ ఒకటి. మిగతా రెండు ఇండోనేషియా, ఆస్ట్రేలియా దేశాల్లో ఉన్నాయి. సముద్రంలో చేపలు ఎక్కువగా లభ్యమయ్యే ప్రాంతాలను గుర్తించి వారికి చేరవేసే కేంద్రంగా మాత్రమే ఉండేది. ఆ తర్వాత కొద్ది కాలానికి "ఓషియన్ స్టేట్ ఫోర్కాస్ట్ సేవలను" ప్రారంభించింది. సముద్ర భాగంలో వాయు దిశ, అలల వేగం, వాటి ఎత్తు, ఉష్ణోగ్రత వివరాలను అందించే సేవలకు అంకురార్పణ చేసింది. సునామీ, సముద్ర విపత్తులపై ఇంకాయిస్ విస్తృతమైన అవగాహన కల్పిస్తోంది. ముఖ్యంగా తీర ప్రాంతాల్లో సునామీ మాక్ డ్రిల్స్ నిర్వహిస్తున్నారు. సునామీ వచ్చే సమయంలో సంకేతాలు ఏవిధంగా ఉంటాయి, ప్రకృతి పరంగా జరిగే మార్పులు, ప్రమాదం నుంచి బయట పడేందుకు అనుసరించాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తోంది. ఆయా ఆధునిక పరికరాల ద్వారా సునామీ రాకను గుర్తించడమే కాకుండా తీరాన్ని ఎంత సమయంలో చేరుకుంటుంది, ఎంత ఎత్తులో కెరటాలు వస్తాయి, దాని తీవ్రత ఏమేర ఉంటుందో ఇంకాయిస్ అంచనా వేస్తుంది. అలా సేకరించిన సమాచారాన్ని జిల్లా స్థాయిలో ఉండే డిస్ట్రిక్ ఎమర్జెన్సీ సెంటర్లు, రాష్ట్ర స్థాయిలో ఉండే ఎస్ఈఓసీ (స్టేట్ ఎమర్జెన్సీ ఆపరేషన్ సెంటర్), జాతీయ స్థాయిలో ఉండే ఎన్డీఎంఏ (నేషనల్ డిజాస్టర్ మేనేజ్మెంట్ అథారిటీ), ఎంహెచ్ఏ (మినిస్ట్రీ ఆఫ్ హోం సైన్సెస్)లకు వెబ్సైట్, మెయిల్, ఎస్ఎంఎస్ ల ద్వారా కేవలం పది నిమిషాల లోపే చేరవేస్తుంది. మూడు స్థాయిల్లో ఇంకాయిస్ సమాచారం అందిస్తుంది. వార్నింగ్, అలర్ట్, వాచ్ స్థాయిల్లో సందేశం పంపుతుంది.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

## కార్తీక పౌర్ణమి... గురునానక్ జయంతి

పదిమంది సిక్కు గురువులలో ప్రధములు గురునానక్ దేవ్. 1469లో పాకిస్తాన్ లోని ప్రస్తుతం లాహోర్ సమీపంలోని తల్వాండీ గ్రామంలో (నన్కానా సాహిబ్)లో నానక్ దేవ్ కార్తీక పౌర్ణమి పుణ్య దినాన నవంబర్ 29న హిందూ కుటుంబంలో జన్మించారు. హిందూ ఇస్లామియా మత గ్రంథాలను చదివి, అవగాహన చేసుకుని, రెండు మతాలకు భిన్నమైన సిక్కు మతాన్ని స్థాపించారు. సిక్కు మతం ఏకేశ్వరోపాసక మతం. సిక్కులు ఏక్ ఓంకార్ (ఏకైక దేవుడు)ని విశ్వసిస్తారు. సిక్కుమత స్థాపకులై, ఏకేశ్వరోపాసనను ప్రబోధించి, కుల వ్యవస్థను వ్యతిరేకించారు. నానక్ దేవ్ అనంతరం ఈ గురు పరంపర కొనసాగు తున్నది. ఐదవ గురువు అర్జున్ తమకు ముందు గురువులకు దైవం అనుగ్రహించిన సూక్తులను, బోధనలను సంకలనం చేసి, "గురుగ్రంథ సాహిబ్" పవిత్ర గ్రంథ రూప కల్పన గావించారు. నానక్ తండ్రి కళ్యాణ్ చంద్ దాస్ కలుమెహతాగా సుపరిచితులై, ప్రభుత్వంలో భూ రెవెన్యూ వ్యవహారాల గుమాస్తాగా పని చేసే హిందూ పట్వారీ. తల్లి మాతా త్రిపుర, అక్క బీబీ నాన్కీ, నానక్ దేవ్ బాల్యం నుండే ప్రశ్నించే, ఆలో చించే తత్వం కలవారు. చిరుప్రాయంలోనే మతపరమైన ఉపనయనం చేసి, జంధ్యం వేయబోగా తిరస్కరించి, అంతకంటే భగవంతుని నిజ నామాన్ని హృదయంలో ధరిస్తామని, భగవ న్నామం యజ్ఞోపవీతం నూలుపోగులా తెగిపోవడం, మట్టిలో కలిసి పోవడం ఉండక, అఖండంగా రక్షణ కలిగిస్తుందని వాదించారు. అత్యంత చిన్న వయసునుండి అక్క బీబీనాన్కీ, తమ్మునిలో భగవంతుని జ్యోతిని చూడగా, ఈ రహస్యాన్ని ఎవరితోనూ ఆమె పంచుకోలేదు. ఆమె నాన క్ జీ తొలి శిష్యురాలిగా పేరొందారు. బాల్యంలోనే హిందూ మతంలోని తాత్వికతకు ఆకర్షితులై జీవిత రహస్యాల అన్వేషణకై ఇల్లు వదలి పోయారు. ఈ క్రమంలోనే నానక్ దేవ్ ముఖ్య తాత్వికులైన కబీర్, రవిదాస్ లను కలుసుకున్నారు. బతాలాకు చెందిన వ్యాపారి మూల్ చంద్ చోనా కూతురు సులేఖినిని వివాహ మాడారు. శ్రీచంద్, ,లక్ష్మీదాస్ అనే కుమారులు వారికి కలిగారు – 28ఏళ్ళ వయసులో నానక్ ఒక ఉదయం నది స్నానం, ధ్యానానికి వెళ్ళగా, మూడు రోజులు ఎవరికీ కన్పించలేదు. తిరిగి వచ్చి, దేవుని పవిత్రాత్మను నింపుకున్నాను అని ప్రకటించారు. అనంతరం "హిందువూ లేదు, ముస్లిమూ లేదు" అని మత సామరస్య బోధనలను వ్యాప్తి చేయడం ప్రారంభించారు. ఆ తర్వాత నాలుగు ప్రధాన దిశల్లో టిబెట్ దక్షిణాసియాలోని పలు ప్రాంతాలు, అరేబియా, మక్కా, బాగ్దాద్, ముల్తాన్ తదితరాలలో ఉదాసీలనే పేరున భగవంతుని సందేశాన్ని ప్రబోధిస్తూ, ప్రయాణాలు సాగిం చారు. నానక్ జీవిత చరమాంకంలో ఉచిత ప్రసాదం లభించిన కర్తార్ పూర్ లో జీవించారు. తాను తీసుకునే ఆహారాన్ని కుల, మత, ధన బేధం లేకుండా పంచుకునే వారు. పొలాలలో పని చేసి, జీవితం గడిపారు. కొత్త సిక్కు గురువుగా భాయ్ లెహ్నాను ప్రకటించాక అక్టోబర్ 10న 1539లో తన 70వ ఏట స్వర్గప్రాప్తి పొందారు. **రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**



## కాగితాల్లో నివేదికలు.. కన్నీళ్లు తుడవని పథకాలు

సిరిసిల్ల: పంట బీమా లేక అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. పంట చేతికొచ్చే సమయంలో తుపాన్లు, వడగళ్ల రూపంలో రైతులను నిండా ముంచుతున్నాయి. విపత్తులు వచ్చినప్పుడు వ్యవసాయశాఖ ప్రాథమిక సర్వేచేసి చేతులు దులుపుకొంటోంది. మరోవైపు పీఎం ఫసల్ బీమా పథకాన్ని అమలు చేస్తామని చెబుతున్నా ఇప్పటికీ అమల్లోకి రాలేదు. బీమా లేక నాలుగేళ్లుగా పంటలు దెబ్బతిన్న రైతులు భారీగా పెట్టుబడులు నష్టపోతున్నారు. వచ్చే సీజన్ నుంచి అయినా బీమా అమల్లోకి వస్తే రైతులకు భరోసా ఇచ్చినట్లు ఉంటుంది.

**ఇదీ పరిస్థితి**

జిల్లాలో ఈ సీజన్‌లో వరి, పత్తి పంటలు కంకి, పూత, కాయ దశలో ఒకసారి.. చేతికందే దశలో మరోసారి రెండుసార్లు వర్షాలు ముంచెత్తాయి. మానేరు వాగులో వచ్చిన భారీ వరదలకు పరివాహక ప్రాంతంలో పంటలు తుడిచిపెట్టుకుపోయాయి. ప్రభుత్వ ఆదేశాలతో వ్యవసాయశాఖ జిల్లాలో 564 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు ప్రాథమికంగా అంచనా వేసింది.

రెండ్రోజుల క్రితం కురిసిన వర్షానికి 178 ఎకరాలు గుర్తించారు.



నష్టం జరిగిన రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. దీనిలో 34 ఎకరాల్లోని పట్టా భూముల్లో మాత్రం ఉపాధిహామీలో పూడికతీతకు అంచనాలు సిద్ధం చేశారు.

మరోవైపు పంట నష్ట పరిహారం ఊసేలేదు. జిల్లాలో 2023లో యాసంగి సీజన్‌లో మాత్రం 192 ఎకరాల్లో 219 మంది రైతులకు చెందిన పంట నష్టం జరిగింది. అప్పుడు రాష్ట్ర ప్రభుత్వం విపత్తుల నిర్వహణలో భాగంగా రూ.19.20 లక్షలను నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేశారు. 2024 యాసంగి సీజన్‌లో జిల్లాలో గంభీరావుపేట, ముస్తాబాద్ మండలాల్లో వడగళ్ల వర్షం కురిసింది. ముస్తాబాద్ మండలం మద్దికుంట, మోహినికుంటలో 34 ఎకరాలు, గంభీరావుపేట మండలం గజసింగారంలో 10 ఎకరాల్లోని మామిడితోటల్లో కాయలు నేలరాలాయి. 23 మంది ఉద్యానవన పంటలు సాగుచేసే రైతులకు నష్టం వాటిల్లినట్లు గుర్తించారు. అలాగే 1014.23 ఎకరాల్లో వరి పంట నష్టాన్ని ప్రాథమిక అంచనా వేశారు.


## నలుదిక్కులా కొలువులు..

ఖమ్మం : ఉభయ జిల్లావాసుల దృష్టిలో విదేశీ కొలువులు అనగానే అమెరికా, ఆస్ట్రేలియా, కెనడా లాంటి దేశాలకు ఎం.ఎస్. చదువు పేరుతో వెళ్లటం, సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు సాధించి అక్కడే స్థిరపడటం అన్న అభిప్రాయం ఉండేది. కొన్నేళ్లుగా ఈ ధోరణి మారుతోంది. విదేశీ కొలువులంటే సాఫ్ట్‌వేర్ ఒక్కటే కాదని, ప్రాచ్య దేశాలూ ఉద్యోగ గనులన్న విషయం యువత గ్రహిస్తోంది. వృత్తి నైపుణ్యం ఉండీ ఇతర దేశాల్లో ఆకర్షణీయ వేతనంతో పనిచేయాలనుకునే వారికి 'టామ్‌కామ్' వారధిగా నిలుస్తోంది. ఉభయ జిల్లాల్లో మూడేళ్ల వ్యవధిలో ఇలా కొలువులు పొందుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. టామ్‌కామ్ అంటే?తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్. ఉపాధి కల్పన శాఖ అనుబంధ విభాగం. కార్మిక, పరిశ్రమల శాఖల సమన్వయంతో ఇది పనిచేస్తుంది. నర్సింగ్, ఐటీఐ, ప్లంబర్, హాస్పిటాలిటి, ఫార్మా, బిల్డింగ్ వర్కింగ్ తదితర విభాగాల్లో వృత్తి నైపుణ్యం ఉన్న వారిని పలు దేశాలు ఆహ్వానిస్తున్నాయి. అన్‌స్కిల్డ్ కొలువులకూ అర్హులను పిలుస్తునారు. ఆయా దేశాల్లో ఖాళీల ఆధారంగా ఎప్పటికప్పుడు టామ్‌కామ్ జిల్లాలో దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. స్క్రీనింగ్‌లో అర్హత ఉన్నవారిని ఎంపిక చేసి వారిని ఉద్యోగం చేయాల్సిన దేశాలకు పంపుతోంది. దళారీ వ్యవస్థకు దీనిద్వారా అడ్డుకట్ట పడుతోంది.

**మచ్చుకు కొందరు...**

టామ్‌కామ్ ద్వారా ఎం.రేవంత్ కుమార్, జి.ప్రవీణ్ కుమార్ (యూఏఈ), ఎం.సునీల్ (జర్మనీ), సాయిలు, కె.రాజేందర్ (ఇజ్రాయిల్) దేశాల్లోని కొలువులు అందిపుచ్చుకున్నారు. వీరి నెల వేతనం రూ.2-5 లక్షలు.భద్రాద్రి జిల్లా నుంచి మహ్మద్ హుస్సేన్ (ఆస్ట్రేలియా), పి.వీరబాబు, శ్రీరాములు అనంత వేణుగోపాలచారి, ఎం.కళ్యాణ్ నాయక్, జి.శ్రీకాంత్, ఎల్.సాయిశంకర్, జి.వంశీకృష్ణ, నవీన్ (జర్మనీ), జి.సునితలు అర్హత సాధించి జపాన్‌లో పనిచేస్తున్నారు.

గ్రీస్‌లోని సంస్థల్లో హౌస్ కీపింగ్, వెయిటర్లు, బార్ అటెండర్లు, రిసెప్షనిస్టులు, స్పా థియేటర్, ఎలక్ట్రీషియన్, ప్లంబర్, లైఫ్ గార్డులు, గార్డెనర్లు, క్లీనర్లు, బెల్ బాయ్స్, ఫిషర్‌మెన్ ఖాళీల భర్తీకి రెండు నెలల క్రితం ఎన్‌రోల్‌మెంట్ నిర్వహించారు. 350 మంది నమోదు కాగా



పాస్‌పోర్ట్, అనుభవం, ఆంగ్ల పరిజ్ఞానం ప్రాతిపదికన 32 మంది ఎంపికయ్యారు.తాజాగా జర్మనీలోని ఓ సంస్థకు ఎలక్ట్రీషియన్లు అవసరం కాగా ఖమ్మంలో ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. ఐటీఐ ఎలక్ట్రికల్ ట్రేడ్ పూర్తి చేసి 106 మంది ముందుకొచ్చారు. మౌఖికాల్లో విజయం సాధించిన వారికి అవకాశం దక్కుతుంది. నెల వేతనం రూ.2.7 లక్షలు.

**ఆ రెండు దేశాల్లో..**

జర్మనీ, జపాన్ మినహా మిగిలిన అన్ని దేశాల్లో కొలువులకు ఆంగ్ల భాష పరిజ్ఞానం సరిపోతుంది. జర్మనీ, జపాన్‌లో ఆ భాషలు నేర్చుకున్నవారికే అవకాశాలుంటున్నాయి. ఔత్సాహికులకు హైదరాబాదులోనే ఈ భాషలు నేర్పించే వెసులుబాటు టామ్‌కామ్ కల్పిస్తోంది.

ఉద్యోగ మేళాలను యువత సద్వినియోగం చేసుకోవాలి. ప్రభుత్వం కొన్ని దేశాలతో చేసుకున్న ఉద్యోగ ఒప్పందాలకు అనుగుణంగా ఉద్యోగాల భర్తీ ప్రక్రియ కొనసాగుతోంది. విదేశీ ఉద్యోగ సంస్థ, అభ్యర్థికి మధ్య టామ్‌కామ్ ఓ నమ్మక వారధి పాత్ర పోషిస్తోంది. నియామకాల ప్రక్రియ అనేది నిరంతర ప్రక్రియ.

ఉపాధి కల్పన శాఖ అధికారులు

## రైతుకు వెన్నంటి.. దిగుబడులు మిన్నంటి..



ధారూర్: ఉన్న వనరులను సద్వినియోగం చేసుకొని తక్కువ పెట్టుబడులతో ఎక్కువ దిగుబడులు సాధించేలా కృషి చేస్తోంది భారతీయ నూనె గింజల పరిశోధన సంస్థ. ఫార్మర్ ఫస్టు ప్రోగ్రామ్ కింద ధారూర్ మండల పరిధి గట్టేపల్లి, గురుదోట్ల, రాంపూర్, అంపల్లిని జూన్ 2017లో ఎంపిక చేశారు. వ్యవసాయాధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో అన్నదాతలకు సలహాలు, సూచనలిస్తూ పంటలు సాగు చేయిస్తున్నారు. రైతులు వేరుశనగ, ఆముదం, తెల్లకుసుమ, నువ్వులతోపాటు వరి, పెసర, కంది, మినుము సాగుచేసి మంచి దిగుబడులు సాధిస్తున్నారు.

**భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా..**

భూసార పరీక్షలు నిర్వహించి వాటి ఫలితాలను కర్షకులకు అందించారు. దాని ఆధారంగా ఎలాంటి పంటలు సాగు చేయాలి.. ఎంత మోతాదులో ఎరువులు వాడాలనే విషయాలను వివరించారు. క్షేత్రస్థాయిలో పంటలు పరిశీలించి సస్యరక్షణ చర్యల గురించి తెలిపారు.

**వ్యవసాయానికి అనుబంధంగా..**

మహిళా రైతులకు గట్టేపల్లిలో 31 సంఘాలకు651 రాజశ్రీ కోళ్లను అందించారు. అంపల్లి, గురుదోట్లలో రైతులకు 200 గొర్రెలిచ్చారు.పంట ఉత్పత్తులను నేరుగా విక్రయిస్తే నష్టపోతారని గుర్తించి కందులను పప్పుగా మార్చి అమ్ముకునేలా కృషి చేశారు.

**నాణ్యమైన విత్తనాల ఎంపిక..**

బహిరంగ విపణుల్లో లభించే నకిలీ విత్తనాలను సాగు చేయడంతో పంట దిగుబడులు రాక నష్టపోతున్నారని గుర్తించి మూల విత్తనాన్ని రైతులే స్వయంగా తయారు చేసుకునేలా అవగాహన కల్పించారు. వాతావరణ పరిస్థితులు, నేల స్వభావాన్నిబట్టి రైతులకు ఆసక్తి ఉన్న విత్తనాలను పరిశోధన సంస్థవారే సమకూర్చారు. కంది, పెసలు, మినుములు, వరిలో మేలైన వంగడాలను అందించారు. నూనెగింజల పరిశోధన సంస్థవారు గ్రామాలను దత్తత తీసుకొని సాంకేతిక పరిజ్ఞానం, క్షేత్రస్థాయిలో సలహాలు, సూచనలు ఇవ్వడంతో సాగు విస్తీర్ణం పెరిగిందని గ్రామస్థులు చెబుతున్నారు. ఈ ఏడాది వానాకాలంలో 400 ఎకరాల్లో పెసర, 200 ఎకరాల్లో మినుము, 350 ఎకరాల్లో కంది, 1500 ఎకరాల్లో వరి, యాసంగిలో 600 ఎకరాల్లో వేరుశనగ సాగుచేశారని వ్యవసాయాధికారులు తెలిపారు.

విత్తన శుద్ధితో తెగుళ్ల నివారణ..:

ఝాన్సీరాణి, క్షేత్ర పరిశోధకురాలు, నూనెగింజల పరిశోధన సంస్థ విత్తన శుద్ధితో పంటల్లో తెగుళ్లను నివారించి రోగ నిరోధక శక్తి పెరిగే అవకాశముంది. ఎరువుల ఖర్చు తగ్గించేందుకు డీఏపీ బదులుగా సూపర్ పాస్ఫేట్ వేసుకునేలా రైతులకు అవగాహన కల్పించాం. ఎప్పటికప్పుడు యాజమాన్య పద్ధతులు చేపట్టడంతో మంచి దిగుబడులు సాధిస్తున్నారు.

## నాలుగేళ్ల నిరీక్షణకు తెర



పూడూరు: నిధులు మంజూరైనా.. అనేక ఒడిదుడుకుల నడుమ హైదరాబాద్- బీజాపూర్ జాతీయ రహదారి విస్తరణకు ఎట్టకేలకు మోక్షం లభించటంతో ఈ ప్రాంత వాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. డబుల్ రోడ్డుగా ఉన్న రహదారి నాలుగు వరుసలుగా మార్చేందుకు ఆరేళ్ల కిందట కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకొచ్చాయి. అప్పా జంక్షన్ నుంచి మొయినాబాద్, చేవెళ్ల మీదుగా వికారాబాద్ జిల్లా మన్నెగూడ వరకు నాలుగు వరుసలుగా చేపట్టేందుకు నాలుగేళ్ల కిందట అనుమతులొచ్చాయి. దాదాపు 45 కి.మీ. విస్తరణ కోసం అధికారులు రూ.వేయి కోట్ల నిధులకు ప్రతిపాదించగా.. ముందస్తుగా రూ.785 కోట్లు మంజూరయ్యాయి. టెండర్ల ద్వారా అప్పట్లోనే ఓ ప్రైవేటు సంస్థ పనులు దక్కించుకుంది. పనులు ప్రారంభించాక పలుమార్లు వివిధ సర్వేలు నిర్వహించి ఇరువైపులా హద్దులు ఏర్పాటు చేయించటంతోపాటు కడీలు పాతించారు. రహదారికి ఇరువైపులా పొక్లెయిన్లతో చదును చేయించారు. రోడ్డు పక్కన ఏళ్లకాలం నాటి మర్రి వృక్షాలు ఉండటంతో వాటిని నరికివేయరాదంటూ ఓ స్వచ్ఛంద సంస్థ చెన్నైలోని ఎన్‌జీటీని (జాతీయ హరిత ధర్మాసనం) ఆశ్రయించటంతో స్టే విధించారు. దీంతో అనేక ప్రమాదాలు జరిగి ఎంతోమంది మృత్యువాతపడ్డారు.

**ఫలించిన ప్రభుత్వ యత్నాలు..**

సీఎం ఆదేశాలతో ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి పలుమార్లు కేసు వేసిన స్వచ్ఛంద సంస్థ సభ్యులతో చర్చించారు. నాలుగు వరుసల నిర్మాణంలో కేవలం 150 చెట్లనే నరకాల్సి ఉందని, వాటి స్థానంలో మొక్కలు నాటిస్తామని హామీ ఇవ్వడంతో వారు కేసు ఉపసంహరణకు ఒప్పుకున్నారు. ఇటీవల న్యాయస్థానం స్టే ఎత్తేయడంతో మోక్షం లభించింది. గుత్తేదారు తిరిగి పనులకు శ్రీకారం చుట్టారు. మరోసారి మార్కింగ్ వేసే పనులు సాగుతున్నాయి. రెండేళ్లలోపు ప్రాజెక్టు పనులు పూర్తి చేయాల్సి ఉంది. చేవెళ్ల, మొయినాబాద్‌లో బైపాస్ పనులు చురుగ్గా సాగుతున్నాయి. విస్తరణ పనులు పూర్తయితే వికారాబాద్ జిల్లా కేంద్రం, తాండూరు, పరిగి, కొడంగల్ పట్టణాతోపాటు కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాలకు రవాణా వేగవంతమవుతుంది.

**పనులు వేగవంతం చేస్తాం..- శరత్, ఎన్‌హెచ్ఏఐ అధికారి**

న్యాయస్థానంలో కేసు ఉపసంహరించుకోవడంతో విస్తరణ పనులు వేగంగా నిర్వహిస్తాం. ఇప్పటికే సర్వేలు పూర్తి కావడంతో జాప్యం లేకుండా చూస్తాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలిచ్చిన గడువులోగా ప్రాజెక్టు పూర్తి చేయాలనే లక్ష్యం పెట్టుకున్నాం. ఇప్పటికే చేవెళ్ల, మొయినాబాద్‌లో బైపాస్ నిర్మాణం సాగుతోంది.

## హెడ్‌ఫోన్స్ పెట్టు.. పదాలు పట్టు


ధర్మపురి : ప్రాథమిక స్థాయిలోనే విద్యార్థులకు కంప్యూటర్ విద్యపై కనీస సామర్థ్యాలు అందించేందుకు విద్యాశాఖ ఎంపిక చేసిన పాఠశాలల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ)పై తరగతులు నిర్వహిస్తోంది. మండలానికి ఒక పాఠశాల ఎంపిక చేసి అమలు పరుస్తోంది. ఇవే బడుల్లో తాజాగా రోజువారీ తరగతులకు భిన్నంగా ఎక్స్‌ఎల్(ఎక్స్ట్రా లెర్నింగ్ ప్రోగ్రాం)ద్వారా వెనుకబడిన విద్యార్థులపై దృష్టి సారించింది. ఒక్కో విద్యార్థి ఎంత వరకు నేర్చుకుంటున్నాడు అనే దానిపై ఉన్నతాధికారులు పర్యవేక్షణ చేస్తున్నారు. ఆంగ్లం, గణితం, తెలుగు తదితర సబ్జెక్టుల్లో అభ్యసన సామర్థ్యాలను పెంపొదిస్తున్నారు.

**వెనుకబడిన వారిపై ప్రత్యేక దృష్టి**

జిల్లాలో 21 పాఠశాలల్లో ఏఐపై విద్యాబోధన జరుగుతోంది. 3, 4, 5వ తరగతి విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తున్నారు. విద్యార్థులను ఫార్మటివ్ పరీక్ష ఆధారంగా ఏ, బీ, సీ గ్రూపులుగా విభజిస్తున్నారు. బీ, సీ విద్యార్థుల కోసం ప్రత్యేకంగా రూపొందించిన ఎక్స్‌ఎల్ విధానంతో పాటు జీ కాంప్రెస్ అనే యాప్‌ను అందుబాటులోకి తెచ్చారు. పిల్లలే దశలవారీగా సొంతంగా నేర్చుకుంటూ ముందుకు వెళ్తున్నారు. గణితంలో ఆరోహణ, అవరోహణ క్రమాలు, పజిల్స్, రంగులు వేయటం, డిజైన్లు రూపొందించటం లాంటివి ఉన్నాయి. ఆంగ్లంలో లెటర్స్ మిస్సింగ్, తెలుగులో పదాలు పలకటం, గుర్తించటం, తిరిగి చెప్పటం, చిత్రాల ద్వారా తప్పుఒప్పులులాంటి విషయాలను నేర్చుకుంటున్నారు. హెడ్‌ఫోన్స్ పెట్టుకొని పదాలను ఉచ్చరించటం, తప్పుఒప్పులను గుర్తించటం చేస్తున్నారు.

కంప్యూటర్లు అందిస్తే మరింత ప్రయోజనం

ప్రభుత్వం ఏఐ, ఇతర డిజిటల్ విధానాల్లో బోధన కొనసాగిస్తున్నప్పటికీ చాలా వరకు ప్రాథమిక పాఠశాలల్లో కంప్యూటర్లు, ఇతర వసతులు లేవు. సమీపంలోని ఉన్నత పాఠశాలల సామగ్రి వినియోగిస్తున్నారు. ఇప్పటికే పలు పాఠశాలలు హెడ్‌ఫోన్స్ కొనుగోలు చేశాయి.



కంప్యూటర్లు అందించేందుకు విద్యాశాఖ నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం. ఇటీవల కంప్యూటర్ల అవసరంపై ఉపాధ్యాయులు ప్రభుత్వాన్ని కోరినట్లు తెలుస్తోంది. వచ్చే విద్యాసంవత్సరం సిలబస్‌లో ఏఐ పాఠ్యాంశాలు చేర్చేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తుంది.

సులువుగా నేర్చుకుంటున్నా..

హెడ్‌ఫోన్స్ పెట్టుకుని వినటం, చదవటం, పలకటం, చూడటం ద్వారా పదాలను సులువుగా నేర్చుకోగలుగుతున్నాను. జీ కాంప్రెస్ యాప్ ఉపయోగం చాలా బాగుంది.

-బింగి నవ్య, విద్యార్థిని

ఎస్ఈఆర్‌టీలో శిక్షణ

ఎక్స్‌ఎల్ ద్వారా వెనుకబడిన విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు మెరుగవుతున్నాయి. చాలా సులువుగా పాఠాలను నేర్చుకోగలుగుతున్నారు. మెలకువలతో పాటు ఇతర అంశాలను విద్యార్థులకు బోధించేందుకు పలువురు ఉపాధ్యాయులకు ఇటీవల ఎస్ఈఆర్‌టీలో శిక్షణనిచ్చారు.

-స్వప్నప్రియ, ప్రధానోపాధ్యాయురాలు, దోనూరు

## భక్తి మాసం.. ముక్తి మార్గం

కూసుమంచి : కార్తికం శివ భక్తులకు ఇష్టమైన మాసం. నెలంతా ప్రత్యేక దీపారాధనలు, ఉపవాస దీక్షలు, నిత్య పూజలు నిర్వహిస్తారు. శివాలయాల్లో సందడి నెలకొంటుంది. కార్తిక శుక్ర, సోమవారాలు మహిళలు ప్రత్యేకంగా దీపాలు వెలిగించి పరమశివుణ్ని ఆరాధిస్తారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా శివాలయాలకు పెట్టింది పేరు. ఇక్కడ పురాతనమైన కోవెలలున్నాయి. కాకతీయుల కాలంలో నిర్మించిన పురాతన గుళ్లు భక్తుల పూజలు అందుకుంటున్నాయి. కార్తిక మాసం నేపథ్యంలో కొన్ని ఆలయాల పరిచయమే ఈ కథనం..

**కాకతీయుల కాలం నాటి కోవెల**

కూసుమంచి గణపేశ్వరస్వామి ఆలయం కాకతీయుల నాటి కట్టడం.. గంగాదేవిచెరువు వారగా కాకతీయుల కాలంలో నిర్మించారు. శిల్ప కళా నైపుణ్యానికి నైపుణ్యం ఆకట్టుకుంటుంది. జిల్లాలో ప్రాచుర్యం పొందిన ఈ ఆలయానికి శివరాత్రి, కార్తిక మాసాల్లో భక్తులు వేలాదిగా వస్తుంటారు. దక్షిణ భారతదేశంలోని ప్రముఖ శివాలయాల్లోని భారీ శివలింగాల్లో ఒకటైన ఇక్కడ అభిషేకంతో భక్తులు తరిస్తారు.

ఖమ్మం-సూర్యాపేట రహదారిలో కూసుమంచిలో బస్సు దిగాలి. ఇక్కడి నుంచి 1.5 కిలో మీటర్ల దూరంలో ఉన్న ఆలయానికి ఆటో సౌకర్యం ఉంది.

**ఖమ్మంలో కొలువైన గుంటుమల్లేశ్వరుడు**

ఖమ్మంలోని భ్రమరాంబ సమేత గుంటుమల్లేశ్వరస్వామి ఆలయం 500 ఏళ్ల పురాతనమైంది. ఈ ఆలయం ఖమ్మం నగరంలో ప్రముఖ శివాలయంగా పేరొందింది. నిత్య పూజలు, మహా శివరాత్రి ఉత్సవాలు వైభవోపేతంగా జరుగుతాయి.



**తీర్థాల సంగమేశ్వర ఆలయం..**

ఖమ్మం గ్రామీణం మండలంలోని తీర్థాలలో 400 ఏళ్ల నాటి పురాతన సంగమేశ్వరస్వామి ఆలయం ఉంది. మున్నేరు, ఆకేరు, బుగ్గేరు కలిసే ప్రాంతంలో ఉంది. ఇక్కడ పాలరాతి శివలింగం ఉంటుంది. శివరాత్రి సందర్భంగా ఉమ్మడి ఖమ్మం, ఉమ్మడి వరంగల్ నుంచి ఐదురోజుల జాతరకు లక్షలాదిగా భక్తులు తరలివస్తారు.

ఖమ్మం నగరం నుంచి కాల్వొడ్డు, దానవాయిగూడెం, రామన్నపేట, కామంచికల్లు మీదుగా.. అలాగే నాయుడుపేట, మారెమ్మ గుడి, పల్లెగూడెం, పోలేపల్లి, గోళ్లపాడు మీదుగా తీర్థాలకు రోడ్డు సౌకర్యం ఉంది.

**స్నానాల లక్ష్మీపురంలో రామలింగేశ్వరుడు**

వైరా మండలంలోని స్నానాల లక్ష్మీపురంలో రామలింగేశ్వరస్వామి ఆలయం ఉంది. 200 ఏళ్లనాటి పురాతన ఆలయం. వైరా నది ఒడ్డున ఉంది. నదిలో భక్తులు పుణ్య స్నానాలు ఆచరిస్తుంటారు. శివరాత్రి, కార్తిక మాసంలో భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తుంటారు.

వైరా పట్టణం నుంచి 4 కి.మీ. దూరంలో ఉంటుంది. రహదారి సౌకర్యం, ఆటో సౌకర్యం ఉంది.

**నీలాద్రి కొండలపై కొలువైన శివుడు**

పెనుబల్లి మండలంలోని నీలాద్రికొండపై నీలాద్రీశ్వరస్వామి ఆలయం కాకతీయుల కాలంలో నిర్మించారు. శివరాత్రికి లక్షలాది మంది భక్తులు దర్శించుకుంటారు. ఆదిమానవుల కాలంనాటి ఆనవాళ్లు కూడా ఉన్నాయని చెబుతుంటారు.

వీఎం బంజర నుంచి 17 కి.మీ. దూరం, లంకపల్లి నుంచి 8 కి.మీ. ఉంటుంది. ఇరువైపులా రహదారి సౌకర్యం ఉంది.

## అన్నదాతకు అదనపు వెత

ఖమ్మం: విడువకుండా కురిసిన వర్షాలు ఈ ఏడాది అన్నదాతలను నష్టాల ఊబిలోకి నెడితే గత నెల చివర్లో మొంథా తుపాన్ అదనపు కష్టాలు తెచ్చిపెట్టింది. ఆగస్టు నుంచి కురిసిన వానలకు ఇప్పటికే దిగుబడి తగ్గి దిగాలుగా ఉన్న రైతులు తుపాన్‌కు దెబ్బతిన్న పలు రకాల పంటలను కాపాడుకునేందుకు ఎదురు ఖర్చు చేస్తున్నారు.వరిమొంథా తుపాన్‌తో చాలాచోట్ల పొలాల్లో పైరు నేలవాలింది. వడ్లు రాలిపోయాయి. రైతులు కూలీలతో పైరు నిలబెట్టే పనులు చేయిస్తున్నారు. ఇలా దుప్పులు కట్టడానికి ఎకరాకు ఎనిమిది మంది కూలీలు అవసరం. అదనంగా రూ.4,800 చెల్లించాల్సి వస్తోంది.వాననీటి నిల్వతో ఎక్కడ చూసినా బురదే కనిపిస్తోంది. పొడి నేలల్లో టైరు యంత్రాల ద్వారా కోతకు గంటకు రూ.2 వేలు అయ్యేది. బురద ధాటికి గొలుసు చక్రాల యంత్రాలను వాడుతున్నారు. వీటికి గంటకు రూ.3 వేలు చొప్పున ఎకరాకు రూ.4,500 చెల్లిస్తున్నారు. కోత యంత్రాలే రోడ్డుపైకి వచ్చి ట్రాక్టర్లో ధాన్యం నింపుతున్నాయి. ఆరబెట్టే వీల్లేక దళారులకు విక్రయించడం వల్ల బస్తాకు బోనసు రూ.500 నష్టపోతున్నారు.

పత్తిజిపూత, గూడ రాలుతున్నాయి. కాయలను పురుగులు ఆశిస్తున్నాయి. నివారణకు పురుగు మందులు, బలానికి ఎరువుల కోసం ఎకరాకు రూ.పదివేలు అదనంగా వెచ్చించాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సాధారణంగా వరి సాగుకు ఎకరాకు పెట్టుబడి రూ.28,500 అవుతుంది. 35 నుంచి 40 బస్తాల దిగుబడి వస్తుంది. ఈ ఏడాది 15 నుంచి 20 బస్తాల వడ్లు పండుతున్నాయి.

ఎకరా మిరప సేద్యానికి రూ.లక్షన్నర నుంచి రూ.2 లక్షలు పెట్టుబడి అవుతుంది. ఆగస్టులో నాటుపెట్టిన మొక్కలు ఇప్పుడు పూత, కాత దశకు చేరాయి.

మిరపకు చలి గుబులు

గాలుల ధాటికి సుమారు ఐదు నుంచి పది శాతం మొక్కల శాఖలు విరిగిపోయాయి.

చలిగాలుల ప్రభావానికి పూత రాలింది. నేలవాలాయి. వాటిని పైకెత్తడానికి ఎకరాకు నలుగురు కూలీలు అవసరం. వీరికి రూ.2400 ఖర్చవుతోంది.

మొక్కలు వడపడ్డాయి. పండాకు వచ్చింది. పచ్చపురుగు రావడంతో మందుల పిచికారి, ఎరువులు చల్లడానికి రూ.10,500 వెచ్చించారు.

'మూడెకరాల్లో మిరప సాగు చేశాను. 50 రోజుల మొక్కలు నేలవాలాయి. అరెకరం విస్తీర్ణంలో మొక్కలు విరిగి పంట దెబ్బతింది. అదనంగా రూ.45 వేలు ఖర్చు పెట్టాల్సి వచ్చింది.'

కోసూరు నర్సింహారావు, అన్నారుగూడెం, తల్లాడ.

తుపాన్ భారం ఇలా.. (రూ.ల్లో)

వరి: 10,200 మిరప: 12,900 పత్తి: 10,000

చురకలు



# సాధారణ ప్రసవం.. రాష్ట్రంలోనే ప్రథమం

కరీంనగర్ : మాది గన్నేరువరం మండల హన్మాజుపల్లి. నా పేరు మగ్గం అఖిల. బుధవారం మధ్యాహ్నం తిమ్మాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నాకు సాధారణ ప్రసవంలో మగ బిడ్డ జన్మించాడు. ఆసుపత్రిలో వైద్య సేవలు బాగున్నాయి. మొదటి కాన్పు సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రిలో జరిగింది. ప్రస్తుతం నేను, బాబు ఆరోగ్యంగా ఉన్నాం. జిల్లాలో మాతా శిశు ఆరోగ్య కేంద్రంలోనే కాకుండా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోనూ సాధారణ ప్రసవాలు చేస్తున్నారు. జిల్లాలోని 18 ఆసుపత్రుల్లో ఈ సౌకర్యముంది. సెప్టెంబరులో జిల్లాలోని అన్ని ఆరోగ్య కేంద్రాల్లో కలిపి 35 సాధారణ ప్రసవాలు జరగడంతో కరీంనగర్ జిల్లా రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచింది. ఈ ఏడాది అక్టోబరు 29 వరకు 30 ప్రసవాలు జరిగాయి. గ్రామీణ ప్రాంతాల్లోని పేద, మధ్య తరగతి గర్భిణులకు ప్రసవ సౌకర్యాలు అందుబాటులో ఉండేందుకు జిల్లా పాలనాధికారి ప్రత్యేక చొరవ చూపుతున్నారు.

**గర్భిణులను గుర్తించి పర్యవేక్షిస్తూ..**

గ్రామీణ ప్రాంతాల్లోని ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు గర్భిణులను గుర్తించి వారి పేర్లు నమోదు చేసుకుంటారు. తరువాత ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు తీసుకెళ్లి అవసరమైన వైద్య పరీక్షలు చేయించడంతోపాటు వైద్యం అందిస్తూ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. ఏడో నెల పూర్తికాగానే ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, వైద్యులు ప్రత్యేక దృష్టి సారించి ఎప్పటికప్పుడు వైద్య సలహాలు అందిస్తున్నారు. తొమ్మిదో నెల మొదలవగానే ప్రసవానికి



కొన్ని రోజుల ముందే ఆసుపత్రిలో చేర్పించి తగిన వైద్యం అందిస్తున్నారు. అవసరమైన వారిని జిల్లా ఆసుపత్రికి, పిల్లల వైద్యుడి వద్దకు పంపిస్తున్నారు. ప్రసవం తర్వాత తల్లీబిడ్డలను 102 వాహనంలో ఇంటికి పంపిస్తున్నారు.

ఆసుపత్రుల వారీగా వివరాలు

ఈ ఏడాది జనవరి నుంచి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నిర్వహించిన సాధారణ ప్రసవాల వివరాలు.. జనవరిలో 17, ఫిబ్రవరిలో 19, మార్చిలో 10, ఏప్రిల్‌లో 20, మేలో 16, జూన్‌లో 21, జులైలో 9, ఆగస్టులో 25, సెప్టెంబరు 35, అక్టోబరులో 30.

**ప్రసవాల సంఖ్య మరింత పెంచుతాం**

జిల్లాలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సెప్టెంబరులో చేసిన సాధారణ ప్రసవాల సంఖ్య రాష్ట్రంలోనే అత్యధికం. కొన్ని రోజుల క్రిదట మానకొండూర్ ఆస్పత్రిలో రాత్రి వేళ ప్రసవం చేస్తుండగా విద్యుత్తు సరఫరా అంతరాయ కలిగింది. వైద్యులు, నర్సులు మొబైన్ ఫోన్ ఫ్లాష్ లైట్ల వెలుగులో ప్రసవం పూర్తి చేశారు. విషయం తెలుసుకున్న కలెక్టర్ మళ్లీ సమస్య తలెత్తకుండా అన్ని ఆరోగ్య కేంద్రాల్లో ఇన్వర్టర్లు ఏర్పాటు చేయించారు. ప్రసవాల సంఖ్యను మరింత పెంచేందుకు కృషి చేస్తాం.

– డాక్టర్ సనా జవేరియా, ప్రోగ్రామ్ అధికారి

# పూడిక.. మూసీ?


నకిరేకల్ : జిల్లాలో నాగార్జునసాగర్ తర్వాతి స్థాయిలో గుర్తింపు ఉన్న మూసీ ప్రాజెక్టు జలాశయంలో పూడిక నిండుతోంది. ఐదారేళ్ల నుంచి ఏటా వరద భారీగా వస్తుండటంతో అదే స్థాయిలో పూడిక వచ్చి చేరుతోంది. గతంలో రిజర్వాయర్ ఎగువన ఐదు కిలోమీటర్లకుపైగా దూరంలో పూడిక పేరుతో ఇసుకను తొలగించారు.

**ఆ గేట్లు మూత..**

పూడికను ఎప్పటికప్పుడు తొలగించేందుకు వీలుగా ప్రాజెక్టు నిర్మాణ సమయంలో స్పిల్‌వే అడుగు భాగంలో 10 స్కవర్ గేట్లను ఏర్పాటు చేశారు. వరద భారీగా వచ్చినప్పుడు వీటిని తెరవడం ద్వారా పూడిక, ఒండ్రును దిగువ మూసీలోకి పంపించే వీలుంది. వీటిని సరిగా నిర్వహించకపోవడంతో గతంలో రెండు గేట్లు కొట్టుకుపోయాయి. 1987లో పది గేట్లను కాంక్రీట్‌తో శాశ్వతంగా మూసి వేయడంతో పూడిక తొలగించే వీలులేకుండా పోయింది.

**తగ్గిన నిల్వ సామర్థ్యం**

43వేల ఎకరాల స్థిరీకరించిన ఆయకట్టు ప్రస్తుతం 33 వేల ఎకరాలకు తగ్గింది. పది వేల ఎకరాల ఆయకట్టుకు నీరందకుండా పోయింది. కేంద్ర జల సంఘం ఏడాది క్రితం హైడ్రోగ్రాఫిక్ రిమోట్ సెన్సింగ్ విధానంతో మూసీ పూడికపై సర్వే నిర్వహించింది. జలాశయంలో 15.32 శాతం



పూడిక పేరుకుందని, దీని వల్ల నీటి నిల్వ సామర్థ్యం 0.74 టీఎంసీలు తగ్గిపోయిందని గుర్తించారు. ప్రస్తుతం 3.72 టీఎంసీల నీరు నిల్వ ఉంటుంది. మూసీకి ఐదారేళ్ల నుంచి భారీగా వరద వస్తోంది. మండు వేసవిలోను జలాశయం నిండుకుండలా మారుతోంది. 2023లో మూసీ గేట్ల నుంచి 20.03 టీఎంసీల నీరు దిగువకు విడుదల చేశారు. ఏటా ఇదే రీతిన వరద వస్తున్నా నిల్వ చేసుకునే సామర్థ్యం తగ్గడంతో ఈ ప్రాంత రైతులకు ఉపయోగం లేకుండా పోతోంది.

రాష్ట్రంలో దిగువ మానేరు, మధ్యమానేరు, కండెం ప్రాజెక్టుల్లో 'డీసిల్టింగ్–డ్రెజింగ్' విధానంలో పూడిక తొలగించేందుకు నీటిపారు దల శాఖ గుత్తేదారు సంస్థలతో తాజాగా ఒప్పందాలు కుదుర్చుకుంది. ఉమ్మడి జిల్లాకు చెందిన నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మూసీ ప్రాజెక్టును కూడా డీసిల్టింగ్ కార్యక్రమంలో చేర్చాలని రైతులు కోరుతున్నారు.

**ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాను:** వేముల వీరేశం, ఎమ్మెల్యే, నకిరేకల్

పూడిక సమస్యను సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దృష్టికి ప్రత్యేకంగా తీసుకెళ్లాను. తొలి విడతలో 2లక్షల క్యూబిక్ మీటర్లకుపైగా పూడిక తొలగించాలని కోరుతూ పూర్తి వివరాలతో విన్నవించాను. మూసీ పునరుద్ధరణకు కృషి చేస్తాను.

# కాసులిస్తే దేనికైనా... ఎ'స్సై'!



హైదరాబాద్:పాతబస్తీ పరిధిలో సున్నితమైన ప్రాంతం. అక్కడ కాలనీలో గంజాయి గుప్పుమంటోంది. మైనర్లను పావులుగా మార్చి చోరీలు చేయిస్తున్నారు. ఈ ముఠా నాయకులతో చేతులు కలిపిన ఎస్సై ప్రతినెలా రూ.లక్షన్నర వసూలు చేస్తున్నట్లు తెలిసింది. గంజాయి పొట్లాలు చేతులు మార్చేందుకు అదే ప్రాంతంలోని హోటల్‌ను అడ్డాగా మార్చారు. ఎస్సై వ్యవహారంపై ఏసీపీ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. ఉత్తరమండలం పరిధిలోని ఠాణాకు కొత్తగా బదిలీపై వచ్చిన ఎస్సై. గతంలో పనిచేసిన చోట మర్దన కేంద్రాల నిర్వాహకులను బెదిరించి భారీగానే సంపాదించాడు. మరోప్రాంతానికి బదిలీ కాగానే తన అనుచరుడితో అక్కడ స్పా కేంద్రాన్ని ప్రారంభించినట్టు సమాచారం. ఇదే మండలంలోని మరో ఎస్సై షాపింగ్‌మాల్స్ దగ్గరికెళ్లి వసూళ్లకు దిగాడు.

నగరంలో పలువురు సబ్ ఇన్‌స్పెక్టర్ల(ఎస్సై)పై అవినీతి ఆరోపణలు పోలీసు వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. తాజాగా పోలీసుల అదుపులో ఉన్న ఆర్థిక నేరగాడు తప్పించుకోవడం సంచలనంగా మారింది. శాంతిభద్రతలు, సీసీఎస్, టాస్క్‌ఫోర్స్, సైబర్‌క్రైమ్ వంటి కీలక విభాగాల్లో కొందరు ఎస్సైల వ్యవహారశైలిపై ఆరోపణలు రావడంతో నగర కొత్వాల్ వీసీ సజ్జనార్ అప్రమత్తమయ్యారు. అసాంఘిక కార్యకలాపాలకు సహకరిస్తున్న 10 మంది ఎస్సైలపై అంతర్గత విచారణకు ఆదేశించినట్టు సమాచారం.

**వచ్చీరాగానే బేరసారాలు**

కొన్ని ఠాణాల్లో ఎస్సైల తీరు ఎస్‌హెచ్‌వోలను ఇరుకున పెడుతోంది. కోరుకున్న సెక్టార్ ఇస్తేనే పనిచేస్తామంటూ ఇన్‌స్పెక్టర్లతో వాదనకు దిగుతున్నారని ఓ ఏసీపీ వాపోయారు. తూర్పుమండలం పరిధిలో ఒక ఠాణాలో ఎస్‌హెచ్‌వో, డీఐ ఉన్నా ఇద్దరు ఎస్సైలు అన్నీతామై నడిపిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఇదే జోన్‌పరిధిలో ఓ ఎస్సై ఠాణాకు వచ్చే మహిళలతో అనుచితంగా ప్రవర్తిస్తాడనే ప్రచారం సాగుతోంది. మరో ఠాణా అడ్మిన్ ఎస్సై వ్యభిచార గృహాల నిర్వాహకులకు అండగా ఉంటూ యువతులను హోటల్ గదికి రప్పించుకుంటున్నట్టు సమాచారం. ఇటీవలే విధుల్లోకి చేరిన మహిళా ఎస్సై ఫిర్యాదు రాగానే బేరసారాలు సాగిస్తున్నట్టు తెలిసింది. తప్పని వారించిన ఇన్‌స్పెక్టర్‌ను మీరు తీసుకోవట్లేదా.. అంటూ నోటిదురుసు ప్రదర్శించడంతో సిబ్బంది అవాక్కయ్యారు.

# మైనార్టీల ఓట్లే కీలకం..!



హైదరాబాద్: జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ప్రచారం పతాక స్థాయికి చేరింది. ప్రధాన పార్టీలు సామాజిక వర్గాల సమీకరణాలపై దృష్టి సారించాయి. వివిధ వర్గాల నేతలతో సమావేశాలు నిర్వహిస్తున్నాయి. ప్రధానంగా అందరి దృష్టి మైనార్టీ వర్గాలపైనే ఉంది. ప్రభుత్వ లెక్కల ప్రకారం దాదాపు 50వేల కుటుంబాలకు వివిధ రకాల సంక్షేమ పథకాలు అందుతున్నట్లు చెబుతున్నారు.

**నాలుగు డివిజన్లలో వారిదే ఆధిక్యం..**

మైనార్టీల ఓట్లు దాదాపు లక్ష ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఆయా ఓట్ల కోసం అధికార, ప్రతిపక్ష పార్టీలు ప్రయత్నాలు చేస్తున్నాయి. దీనికి భిన్నంగా భాజపా ఆలోచన ఉంది. నగరంలో పాతబస్తీ మినహా అధిక సంఖ్యలో మైనార్టీ ఓట్లు ఉన్న నియోజకవర్గం జూబ్లీహిల్స్ మాత్రమే. మొత్తం ఏడు డివిజన్లలో నాలుగు డివిజన్ల పరిధిలో మైనార్టీల ఆధిక్యం ఎక్కువ. 2023 ఎన్నికల్లో 3.85లక్షల మంది ఓటర్లు ఉంటే.. 1.83 లక్షల మంది మాత్రమే ఓటు హక్కు వినియోగించుకున్నారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా మైనార్టీకి చెందిన అజారుద్దీన్ రంగంలోకి దిగారు. కానీ 16,333 ఓట్ల తేడాతో భారాస అభ్యర్థి మాగంటి గోపీనాథ్ చేతితో ఓడిపోయారు. నాడు మైనార్టీ ఓట్లు చీలిక వచ్చాయని ప్రచారం జరిగింది. ఎంఐఎంకు భారాసతో మైత్రి ఉండేది.

**వనభోజనాలు.. సమావేశాలు..**

వెనుకబడిన వర్గాలపై సైతం ప్రధాన పార్టీలు దృష్టి సారించాయి. వనభోజనాలు.. వివిధ సంక్షేమ సంఘాల సమావేశాల పేరుతో ప్రచారం నిర్వహిస్తున్నారు. తమ పార్టీలోని ఆయా సామాజిక వర్గాల నేతలు, మంత్రులతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఓ ప్రధాన పార్టీ అభ్యర్థి ఇతర వర్గాలను విస్మరిస్తున్నారని నేతలకు ఫిర్యాదులు అందినట్లు చెబుతున్నారు. దీంతో సామాజికవర్గాల సమీకరణాలు అటూఇటూ మారుతున్నట్లు చెబుతున్నారు.

కార్తికమాసం కావడంతో వనభోజనాల పేరుతో ఏర్పాట్లు చేస్తున్నారు. ఇతర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సమావేశాలు ప్రచార వ్యయం పరిధిలోకి రావని అంచనా వేస్తున్నారు.

**జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో..**

జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి ఒక్కరూ గెలవలేదు. కానీ భారాస నుంచి గెలిచిన బోరబండ, రహమత్‌నగర్, సోమాజిగూడ కార్పొరేటర్లు కాంగ్రెస్‌లో చేరారు.

అజారుద్దీన్‌కు మంత్రి పదవి దక్కింది. జూబ్లీహిల్స్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని మంత్రి పదవి ఇచ్చారని భారాస ఆరోపిస్తుండగా మైనార్టీలకు ఇస్తే జీర్ణించుకోవడం లేదని కాంగ్రెస్ విమర్శిస్తోంది.

# బస్తీ క్లినిక్.. జీవనశైలి వ్యాధుల నివారణకు ఉచిత చికిత్స




హైదరాబాద్: మారుతున్న జీవనశైలితో పలు రకాల వ్యాధులు చుట్టుముడుతున్నాయి. నగరానికి చెందిన హెల్పింగ్ హ్యాండ్ ఫౌండేషన్ (హెచ్‌హెచ్‌ఎఫ్) ఇటీవల నిర్వహించిన అధ్యయనంలో 70 శాతం మంది ఏదో ఒక జీవనశైలి వ్యాధితో ఇబ్బంది పడుతున్నట్లు తేలింది. రాజేంద్రనగర్ మండల పరిధి చింతల్‌మెట్, ఎంఎం పహాడి బస్తీల్లో ఎంపిక చేసిన ఇళ్లల్లో ఈ పరీక్షలు నిర్వహించారు. చాలామంది అధిక రక్తపోటు, మధుమేహంతోపాటు కొందరు రెండు రకాల వ్యాధులనూ ఎదుర్కొంటున్నట్లు గుర్తించారు. అస్తవ్యస్త జీవనశైలి, వ్యాయామం లేకపోవడం, అధిక బరువు ఇందుకు దోహదం చేస్తున్నట్లు హెచ్‌హెచ్‌ఎఫ్ అధ్యక్షుడు ముజ్తబా హసన్ అస్కారి అన్నారు.

**ముందుగా రెండు చోట్ల..**

తమిళనాడు తరహాలో బస్తీ బీపీ, షుగర్ క్లినిక్‌లను ముందుగా చింతల్‌మెట్, ఎంఎం పహాడిలో అందుబాటులోకి తెచ్చారు. కమ్యూనిటీ కేంద్రంగా ప్రత్యేక ఆరోగ్య సంరక్షణ నమూనా కింద ఏర్పాటు చేసినట్లు అస్కారి తెలిపారు. మధుమేహం, రక్తపోటు ఇతర దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు ఎవరైనా ఈ క్లినిక్‌లను సంప్రదించొచ్చు. టెస్టులు, మందులు ఉచితంగా అందిస్తామని.. వ్యాధి తీవ్రంగా ఉంటే ఉస్మానియా, గాంధీ ఆసుపత్రులకు రెఫర్ చేస్తామన్నారు.

# రియల్.. మూసీలో రెడీమిక్స్ ప్లాంట్లు



హైదరాబాద్ :మూసీ పరిరక్షణకు ప్రభుత్వం సంకల్పిస్తుంటే.. నదికి సమీపంలోని బహుళ అంతస్తుల భవనాలను నిర్మిస్తున్న రియల్ వెంచర్ల ప్రతినిధులు మాత్రం బఫర్‌జోన్‌లో దర్జాగా సిమెంట్ కాంక్రీట్ తయారీ యంత్రాల యూనిట్లను ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే రెండు రెడీమిక్స్ ప్లాంట్లు ఉండగా.. నార్సింగి ఔటర్ సర్వీస్‌రోడ్ సమీపంలోని ఓ రియల్ సంస్థ మూసీనది బఫర్‌జోన్‌లో తాజాగా రెడీమిక్స్ ప్లాంట్లను ఏర్పాటు చేసింది. రోజూ అటువైపుగా వెళ్లే హెచ్‌ఎండీఏ, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు, సిబ్బందికి అవి కనిపిస్తున్నా.. పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. వాటి నుంచి ఉత్పత్తి అయ్యే వ్యర్థాలను మూసీలోకి వదిలేస్తున్నారు.

**ఫుల్‌ట్యాంక్ లెవల్ హద్దులున్నా సరే...**

మూసీకి సమీపంలో భారీ నిర్మాణాలు వెలుస్తుండడంతో గండిపేట్, నార్సింగి, మంచిరేవుల ప్రాంతాల్లో ఎఫ్‌టీఎల్ హద్దులు ఏర్పాటు చేశారు. మూసీ బఫర్‌జోన్‌పై కొందరు అక్రమార్కులు కన్నేశారు. కొంచెం.. కొంచెంగా ఆక్రమించుకుని నిర్మాణాలు చేపట్టారు. కొన్ని రియల్ సంస్థల ప్రతినిధులు బఫర్‌జోన్లలో ఐదు, పదిమీటర్లు కలిపేసుకుని సైక్లింగ్ ట్రాక్, ఉద్యానాలు ఏర్పాటు చేసుకున్నారు. మరికొందరు నిర్మాణాలు పూర్తయ్యేంత వరకూ రెడీమిక్స్ ప్లాంట్లను నిర్వహిస్తున్నారు.

**తాఖీదులిచ్చి చర్యలు తీసుకుంటాం**

డి.రమ, ఇరిగేషన్ డీఈఈ, నార్సింగి

బఫర్‌జోన్‌లో రెడీమిక్స్ ప్లాంట్లను ఏర్పాటు చేసినట్టు మా దృష్టికి వచ్చింది. వారికి తాఖీదులిస్తాం. తొలగించకపోతే కఠిన చర్యలు తీసుకుంటాం.

# కొలువుల పల్లె..!

గుర్రంపోడు: గుర్రంపోడు మండలం చామలోని బావిలో 900 మంది జనాభా ఉన్నారు. ఇక్కడ 280 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. చిన్నకమతాలతో వ్యవసాయం చేసే రైతులతో పాటు కూలీలు, ఊరూరా తిరిగి దుస్తులు అమ్ముతూ ఉపాధిని పొందిన పద్మశాలి కుటుంబాలు అధికం. కసితో కష్టపడి ఉన్న వనరులను సద్వినియోగం చేసుకొని ఇప్పటి వరకు 65 మంది వరకూ ప్రభుత్వ ప్రైవేటు ఉద్యోగాల్లో ఉన్నారంటే అర్థం చేసుకోవచ్చు. అంతేకాదు మరో పాతికమంది యువకులు అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా వంటి దేశాల్లో ఉన్నత చదువులు



చదువుతున్నారు. ఇద్దరు ఎంఈవోలు, ఐదుగురు అధ్యాపకులు, 14 మంది ఉపాధ్యాయులు, 20 మంది సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు, ఇద్దరు కోర్టు ఉద్యోగులు, ఇద్దరు ఆర్టీసీ, ముగ్గురు బ్యాంకు ఉద్యోగులు, తొమ్మిది మంది రైల్వే, పోలీస్, సీఆర్‌పీఎఫ్ శాఖల్లో, నలుగురు రెవెన్యూ శాఖలో, ఇద్దరు నీటి పారుదలశాఖలో ఉన్నత స్థానాల్లో ఈ గ్రామం నుంచి ఉండటం విశేషం.పద్మశాలి కుటుంబాల నుంచి 1982లోనే దుడుకు కృష్ణయ్య బాంబే యూనివర్సిటీ నుంచి ఐఐటీ చదవడమే కాదు.. వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఆచార్యులుగా, అక్కడి నుంచి మలేషియా వెళ్లి పరిశోధకుడిగా గుర్తింపు సాధించారు. ఇప్పటి వరకు గ్రామంలో నలుగురు ఐఐటీయన్లు ఉన్నారు.

# రుణాల మాటున వసూళ్లపర్వం

శంకరపట్నం: మహిళలు ఉపాధి అవకాశాలు దక్కించుకొని ఆర్థిక స్వావలంబన సాధించాలని ప్రభుత్వం తక్కువ వడ్డీతో రుణాలు ఇస్తోంది. అయితే సర్కారు ఆశయానికి జిల్లాలోని క్షేత్ర స్థాయిలో కొందరు సిబ్బంది గండి కొడుతున్నారు. అతివలకు రుణాలు ఇప్పించడంలో చేతివాటం ప్రదర్శిస్తున్నారు. వారిపై అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో ఈ చర్యలకు పాల్పడుతున్నారు. జిల్లాలో అనేక చోట్ల ఈ పరిస్థితి ఉన్నా.. కొన్ని ప్రాంతాల్లో ఆలస్యంగా అక్రమాలు వెలుగులోకి వస్తున్నాయి.శంకరపట్నం మండలంలోని 27 గ్రామ పంచాయతీల్లో మొత్తం 1030 స్వశక్తి, 38 గ్రామైక్య సంఘాలు ఉన్నాయి. అన్ని గ్రామాల్లో సుమారు 38 మంది వీవోఏలు ఉండగా వీరిపై నలుగురు సీసీలు క్లస్టర్ గ్రామాల వారీగా పర్యవేక్షణ చేస్తున్నారు. స్వశక్తి సంఘాల సభ్యులకు బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి రుణం పొందాలంటే వీవోఏలు వసూళ్ల పేరుతో ఇబ్బందులు పెడుతున్నారు. రుణాలు తీసుకొన్న సమయాల్లో వీవోఏలు ఒక్కో రకం రుణానికి రూ.500 నుంచి రూ.1000 వరకు ఇస్తున్నామని సభ్యులు వాపోతున్నారు. గ్రామాల్లో ఒక్కో వీవోఏకు ఆ గ్రామ జనాభా ప్రకారం 15 నుంచి 30 సంఘాల ఉండే అవకాశముంది. సంఘంలో 150 నుంచి 300 వరకు సభ్యులు ఉండే అవకాశముంది. దీనిబట్టి గ్రామాల వీవోఏలు ఏ మేర డబ్బులు దండుకొంటున్నారో అర్థమవుతోంది.

తప్పుడు నిరభ్యంతర ధ్రువపత్రాలతో వ్యవహారం

ఇటీవల గ్రామంలోని ఓ వీవోఏ రెండు బ్యాంకుల ద్వారా సభ్యుల పేరిట తీసుకొన్న విషయం బహిర్గతమైంది. బ్యాంకు అధికారులు విచారణ చేస్తున్నారు.మండలంలోని మరో వీవోఏ లింకేజీ రుణం పొందేందుకు బ్యాంకుల్లో తప్పుడు నిరభ్యంతర ధ్రువపత్రాలు సమర్పించి సభ్యుల పేరిట రూ.లక్షల్లో రుణం తీసుకుంది. సొంత అవసరాలకు వాడుకున్నట్లు అధికారుల విచారణలో తేలింది. సదరు బ్యాంకు అధికారులు రుణం పొందిన తీరుపై విచారణ పూర్తి స్థాయిలో చేసి సదరు వీవోఏ ద్వారా రికవరీకి మార్గం సులువు చేసుకొన్నట్లు సమాచారం.కొన్నేళ్ల కిందట ఓ గ్రామంలో మగ వీవోఏ రుణాలు దుర్వినియోగం చేసినట్లు తేలినా ఇప్పటికీ కొనసాగిస్తున్నారు.

అలాంటి వారిపై దృష్టి సారిస్తాం

రుణాలు తీసుకొన్న సమయాల్లో సంఘాల సభ్యుల ద్వారా వసూళు (నగదు) తీసుకునే గ్రామాల వీవోఏలపై ప్రత్యేక దృష్టి సారిస్తాం. అన్ని గ్రామాల వీవోఏలకు సమావేశాల నిర్వహణతో అవగాహన కల్పించి నిబంధనలు పాటించాలని సూచిస్తాం. స్వశక్తి సంఘాల సభ్యులను ఇబ్బందులకు గురి చేసే వారిపై ఉన్నతాధికారులకు నివేదించి వారి ఆదేశానుసారం చర్యలు చేపడతాం.

– శ్రీనివాస్, ఏపీఎం శంకరపట్నం మండలం

# వర్షాల ప్రభావం.. ఉత్పత్తికి విఘాతం

గోదావరిఖని: సింగరేణి వార్షిక బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని చేరుకోవడానికి మరింత కసరత్తు చేయాల్సిన అవసరం ఏర్పడింది. రోజు వారి ఉత్పత్తిని సాధించలేకపోతున్న సంస్థ నిర్దేశిత లక్ష్యాన్ని అధిగమించలేకపోతోంది. దానికి తోడు వర్షాలు పడటంతో ఉత్పత్తిపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఈ ఏడాది 72 మిలియన్ టన్నుల(నైనీ కాకుండా) బొగ్గు ఉత్పత్తి లక్ష్యంగా నిర్దేశించుకొంది. గడిచిన ఏడు నెలల్లో కేవలం 32.64 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి మాత్రమే సాధించింది. రానున్న అయిదు నెలల్లో 39.37 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధిస్తేనే వార్షిక లక్ష్యాన్ని చేరుకుంటుంది. 2025–26 వార్షిక సంవత్సరానికి 72 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తిని లక్ష్యంగా నిర్దేశించుకుంది. మరో 4 మిలియన్ టన్నులు నైనీ బొగ్గుబ్లాకుకు లక్ష్యంగా నిర్ణయించింది. ప్రస్తుతం సింగరేణి విస్తరించి ఉన్న 11 డివిజన్లలో ఏప్రిల్ నుంచి అక్టోబరు వరకు 32.64 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించడంతో రానున్న అయిదు నెలల్లో భారీగా ఒత్తిడి పెరిగే అవకాశం ఉంది. మొత్తం ఏరియాల్లో కేవలం రామగుండం–2 మాత్రమే 103 శాతం బొగ్గు ఉత్పత్తిని ఆక్టోబరు నెలలో సాధించింది. ఏడు నెలల లక్ష్యంలో బెల్లంపల్లి డివిజన్ 101 శాతంతో ముందుంది. మిగతా ఏ డివిజన్ కూడా వంద శాతం బొగ్గు ఉత్పత్తిని అందుకోలేకపోయాయి.నెలకు 8 మిలియన్ టన్నులు

రానున్న అయిదు నెలల్లో నెలకు 8 మిలియిన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేపడితేనే సంస్థ వార్షిక లక్ష్యాన్ని చేరుకుంటుంది. రోజుకు 2.75 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం 1.74 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధిస్తున్న సింగరేణి రానున్న అయిదు నెలల్లో దాన్ని 2.75 లక్షల టన్నులకు పెంచుకోవాలి. రోజు వారి లక్ష్యాన్ని చేరుకుంటేనే నెలకు 8 మిలియన్ టన్నులకు ఉత్పత్తి చేరుకుంటుంది. దీంతో వార్షిక లక్ష్యం చేరేందుకు అవసరమైన 39.37 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తికి అవకాశం ఉంటుంది.

ముంచిన మొంథా తుపాన్‌మొంథా తుపాను బొగ్గు ఉత్పత్తిపై తీవ్ర ప్రభావం చూపింది. అక్టోబరు నెలలో తుపానుతో పాటు వర్షాలు కూడా భారీగానే కురియడంతో ఉపరితల గనుల్లో పనులు నడవలేదు. భారీ యంత్రాలు కదలలేని పరిస్థితి. ఫలితంగా బొగ్గును ఆశించిన స్థాయిలో వెలికి తీయలేకపోయారు. నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా ఉత్పత్తి పెంచుకోలేకపోయారు.

## మానేద్దాం.. మన'సారా'

సిరిసిల్ల :అల్మాస్‌పూర్‌కు చెందిన ఓ యువతి వీర్నపల్లి మండలం సీతారాంనాయక్‌తండాలో 10 లీటర్ల సారా కొనుగోలు చేసింది. పొట్లాలను కళాశాల బ్యాగులో నింపుకొని ఆర్టీసీ బస్సు ఎక్కింది. తోటి ప్రయాణికులకు అనుమానం రావడంతో వీర్నపల్లిలో బస్సును ఆపి తనిఖీ చేసిన పోలీసులకు చిక్కింది. వీర్నపల్లి మండలం గర్జనపల్లి ప్రధాన రహదారికి పక్కనే ఇద్దరు వ్యక్తులు చాలా రోజులుగా గుడుంబా కాస్తున్నారు. ఎవరికి అనుమానం రాకుండా పెరటి తోట మధ్యలో గుడిసెలు వేశారు. బెల్లం పులిశాక బట్టీలు పెడుతూ సారాయి కాస్తున్నారు. వారం రోజుల క్రితం పోలీసులకు చిక్కారు.

జిల్లాలో సారా వ్యాపారం గుట్టుచప్పుడు కాకుండా జరుగుతోంది. వీర్నపల్లి, ఎల్లారెడ్డిపేట, రుద్రంగి, చందుర్తి, కోనరావుపేట, గంభీరావుపేట మండలాల్లో అధికారుల కళ్లుగప్పి గుడుంబా తయారీ చేస్తున్నారు. గతంలో కిరాణ దుకాణాల ద్వారా ముడి సరకులు కొనుగోలు చేసేవారు. వర్తకులపై కేసుల నమోదుతోపాటు బైండోవర్లు, అవగాహనతో చాలావరకు వ్యాపారానికి దూరంగా ఉంటున్నారు. ఈ క్రమంలో కొంతమంది ద్వారా సరిహద్దులోని కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల ద్వారా రాత్రిపూట సారా తయారీకి అవసరమైన



ముడి సరకు సరఫరా చేసుకుంటున్నారు. దీంతో వ్యాపారం ఒక్క సేరు.. నూరు రూపాయలుగా సాగుతోంది. అధికారులు దాడు చేసిన క్రమంలో కొంతమంది మాత్రమే పట్టుబడుతున్నారు.

**నిలిచిన పునరావాసం**

గుడుంబా తయారీదారుల్లో మార్పు తీసుకొచ్చేందుకు సర్కారు పునరావాసం పథకాన్ని అమలు చేసింది. 2015లో జిల్లాలో వివిధ సామాజికవర్గాలకు చెందిన 59 మందిని గుర్తించారు. రూ.2 లక్షల ఆర్థిక సాయాన్ని అందించి ఆసక్తి కలిగిన వ్యాపారాలు పెట్టించగా సత్ఫలితాలు కనిపించాయి. ఆ తర్వాత ఆపేయడంతో మళ్లీ పల్లెల్లో గుడుంబా గుప్పుమంటోందనే అభిప్రాయాలు ఉన్నాయి.

**పట్టణాలకు సరఫరా..**

మద్యం ధరల దృష్ట్యా చాలామంది సారాకు అలవాటు పడుతున్నారు. ఒళ్లు నొప్పులు తగ్గిస్తాయన్న అపోహలతోనూ తాగుతుంటారు.

ఇప్పపువ్వుతో కాసే సారాకు గిరాకీ ఉంటోంది. బట్టీ నుంచి వచ్చే మొదటి సీసాకు లీటర్‌కు రూ.500 నుంచి రూ.1,000 వరకు ధర పలుకుతోంది. నీరు కలిపిన లీటరు సారాయిని డిమాండ్ ప్రకారం.. రూ.150 వరకు అమ్ముతుంటారు. కొందరు బెల్లం, పటిక పులియబెడుతున్నారు. ప్రత్యేకంగా తయారీ చేసుకున్న పాత్రలను బట్టీలపై పెడుతూ సారా కాస్తున్నారు. ఇప్పపువ్వు సారాయి పేరిట వేములవాడ, సిరిసిల్లకు గుట్టుచప్పుడు కాకుండా తరలిస్తున్నారు. ఈ వ్యాపారం 24 గంటలు అందుబాటులో ఉండడంతో చాలా మంది మత్తుకు బానిసవుతూ ఆనారోగ్యం పాలవుతున్నారు.

## లేలేత ప్రాయం.. మానని గాయం

నల్గొండ :జిల్లా కేంద్రంలో ఓ బాలిక నయవంచకుడి మాటలు నమ్మి గదికి వెళ్లి అతని చేతిలో అత్యాచారానికి గురై ప్రాణాలు పోగొట్టుకుంది. ఇతనికి మరో నిందితుడు సహకరించడంతో వీరిద్దరిపై నల్గొండ పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. ఆరు నెలల క్రితం నార్కట్‌పల్లి మండలానికి చెందిన (16) బాలికను అదే ప్రాంతానికి చెందిన ఓ యువకుడు ప్రేమపేరుతో మోసం చేసి కిడ్నాప్ చేశాడు. బాధితురాలి తల్లిదండ్రులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. పోలీసులు బాలికను అదుపులోకి తీసుకొని బాలసదన్‌లో చేర్చి చదువుకు ఏర్పాటు చూస్తున్నారు.

జిల్లాలో కొంతకాలంగా బాలలు, పెద్దలు అనే తేడా లేకుండా నేరాలకు పాల్పడుతున్నారు. మానవత్వం లేకుండా వయసుతో సంబంధం లేకుండా అత్యాచారాలకు పాల్పడుతున్నారు. అభం శుభం తెలియని చిన్నారులు చిన్న వయసులోనే ప్రాణాలు కోల్పోతున్నారు. ఓ వైపు పోలీసులు నేర నియంత్రణ చర్యలు చేపడుతున్నా.. జరగాల్సిన అనర్థాలు జరుగుతూనే ఉన్నాయి. ప్రధానంగా అత్యాచారం,



కిడ్నాప్‌లకు గురవుతున్న వారిలో చిన్నారులే అధికంగా ఉండటం ఆందోళన కలిగిస్తోంది. నేరానికి గురైన బాల,బాలికల్లో 60 నుంచి 70 శాతం మంది మాత్రమే పోలీస్‌స్టేషన్ల మెట్లు ఎక్కుతున్నారు.

**కఠిన చర్యలు తీసుకుంటున్నాం.: శరత్‌చంద్ర పవార్, ఎస్పీ**

చిన్నారులపై జరుగుతున్న నేరాల విషయంలో కఠినంగా వ్యవహరిస్తున్నాం. పోక్సో కేసులు నమోదు చేయడంతో పాటు త్వరితగతిన కోర్టులో సాక్ష్యాలు పొందుపరిచి నిందితులకు శిక్షలు పడేలా చూస్తున్నాం. విద్యాసంస్థలు, ప్రధాన కూడళ్ల వద్ద షీటీం సిబ్బందిని ఏర్పాటు చేసి రక్షణ కల్పించడంతో పాటు ఫిర్యాదుల పెట్టెలు ఏర్పాటు చేశాం. బాధితులు ఫిర్యాదులు చేస్తే రక్షణ కల్పించి.. షీటీం, భరోసా, సఖి, కేంద్రాల ద్వారా న్యాయం జరిగేలా చూస్తాం.

**సామాజిక మాధ్యమాల ద్వారా పక్కదారి : డా.శివకుమార్, మానసిక వైద్యుడు** యువత పెడదారి పట్టడానికి ప్రధాన కారణం సామాజిక మాధ్యమాలే. వీటి ద్వారా ఏర్పడిన పరిచయాలతో చిన్న వయసులోనే ప్రేమ, పెళ్లి అంటూ ముందుకు వెళ్తున్నారు. మంచికి ఉపయోగించాల్సిన చరవాణిని నీలి చిత్రాలు చూస్తూ కొందరు అఘాయిత్యాలకు పాల్పడుతున్నారు. నేర ప్రవృత్తిని పెంచే వీడియోలను పిల్లలు ఎక్కువగా చూస్తున్నారు. చరవాణి, ల్యాప్‌ట్యాబ్‌లు తరచూ పరిశీలించాలి. ప్రతి విషయాన్ని వారితో మాట్లాడడం ద్వారా కొన్ని తప్పులు జరిగే అవకాశం ఉండదు.

## చతికిల'బడి'న పనులు



కోరుట్ల : కోరుట్ల మండలం చిన్నమెట్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో 2022లో 'మన ఊరు-మన బడి', ఉపాధిహామీ పథకం కింద రూ.73.60 లక్షలతో నూతన భవన నిర్మాణం చేపట్టారు. రెండు స్లాబులు వేశాక బిల్లులు రావడం లేదని గుత్తేదారు పనులు నిలిపివేశారు. మిగతా పనులు చేయకుండా వదిలేశారు. మరోవైపు విద్యార్థులకు గదులు సరిపోక 70 మందిని స్లాబ్ కిందనే కూర్చోబెట్టి పాఠాలు బోధిస్తున్నారు.కోరుట్ల పట్టణంలోని ఉన్నత పాఠశాలకు మూడేళ్ల కిందట 'మన బస్తీ-మన బడి' కింద రూ.1.50 కోట్లు మంజూరయ్యాయి. 8 తరగతి గదులు, డైనింగ్‌హాల్, కిచెన్‌షెడ్, మూత్రశాలలతో జీం1తో కూడిన భవనం నిర్మించాలని నిర్ణయించారు. పనులు ప్రారంభించినా పిల్లర్ల దశలో వదిలేశారు. అంతలోనే శాసనసభ ఎన్నికలు రావడంతో బిల్లులు రావని గుత్తేదారు చేతులెత్తేశారు. దీంతో మొత్తం 285 మంది విద్యార్థులను 1959లో నిర్మించిన రేకుల గదుల్లో, వరండాల్లో కూర్చోబెట్టి పాఠాలు చెబుతున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో పూర్తి స్థాయిలో మౌలిక వసతులు కల్పించి ప్రైవేటుకు దీటుగా తీర్చిదిద్దేందుకు 2022లో గ్రామీణ ప్రాంతాల్లో 'మన ఊరు-మన బడి', పట్టణ ప్రాంతాల్లో 'మన బస్తీ-మన బడి' పథకానికి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా మొదటి విడతలో మండలంలోని మూడో వంతు పాఠశాలల్లో పనులను గుర్తించి నిధులు మంజూరు చేశారు. పట్టణానికి, మండలానికి ఒకటి చొప్పున బడిని ప్రయోగాత్మకంగా ఎంపిక చేయగా పనులు పూర్తయ్యాక ఎమ్మెల్యేలు, కలెక్టర్ చేతుల మీదుగా ఆర్భాటంగా ప్రారంభించారు. అనంతరం మిగతా పాఠశాలల్లోనూ పనులు చేపట్టాలని ఆదేశించడంతో గుత్తేదారులు, స్థానిక ప్రజాప్రతినిధులు మొదలుపెట్టారు.

**శిథిలమవుతున్న కట్టడాలు**పాఠశాలల్లో ఒక అంతస్తు(జిం1)తో కూడిన అధునాతన భవనాల నిర్మాణం చేపట్టారు. పలు చోట్ల రూ.లక్షల విలువైన స్లాబులు వేశారు. సగం కూడా చెల్లించకపోవడంతో పనులను అర్ధంతరంగా వదిలేశారు. డైనింగ్‌హాల్, కిచెన్ షెడ్ల నిర్మాణాలు పూర్తి చేసినా అరకొరగా బిల్లులు వచ్చాయి. అన్ని చోట్లా పనులు ప్రారంభించినా 2023 చివరలో శాసనసభ ఎన్నికలు రాగా భారాస స్థానంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైంది. పాత పనులకు సంబంధించిన బకాయిల చెల్లింపులను ప్రభుత్వం పూర్తిగా నిలిపివేసింది. దీంతో రెండేళ్లుగా పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. నిర్మాణ దశలోనే భవనాలు దెబ్బతింటున్నాయి.

## రాజన్న గోశాల.. ఎన్నటికో ఆధునికీకరణ?



వేములవాడ: వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకునే భక్తుల్లో చాలామంది కోడె మొక్కులు చెల్లించుకుంటారు. కొందరు భక్తులు నిజకోడెను సమర్పిస్తుంటారు. ఆలయానికి ఏటా భక్తుల ద్వారా సమకూరే ఆదాయంలో సింహభాగం కోడె మొక్కుల ద్వారా వస్తోంది. ఈ కోడెలను ఆలయ సమీపంలోని కట్టకింద గోశాల షెడ్లలో ఆలయ అధికారులు సంరక్షిస్తుంటారు. భక్తులు సమర్పించే నిజ కోడెలను తిప్పాపూర్ గోశాలలో సంరక్షిస్తుంటారు. తిప్పాపూర్ గోశాలలో కోడెలకు అవసరమైన షెడ్లు, వసతులు చాలావరకు సమకూరినప్పటికీ కట్టకింద గోశాలలో వసతులు మెరుగు పడాల్సి ఉంది. దీన్ని ఆధునికీకరించాలని ఏళ్ల క్రితమే ప్రతిపాదించినప్పటికీ కార్యరూపం దాల్చలేదు.

**ఇదీ పరిస్థితి**కట్టకింద గోశాలలో ఏళ్ల క్రితం నిర్మించిన షెడ్డు ఉంది. మరోరెండు రేకుల షెడ్లున్నాయి. అనేకసార్లు తాత్కాలిక మరమ్మతులు చేయించినప్పటికీ షెడ్డు పూర్తిగా శిథిలమవ్వడంతో అందులోని ఆవులను తిప్పాపూర్ గోశాలకు తరలించారు. ప్రస్తుతం ఆ షెడ్డులో స్వామివారికి నిత్యం చేసే గోపూజ ఆవును మాత్రమే ఉంచుతున్నారు. స్వామివారికి భక్తులు మొక్కులు చెల్లించుకునే దాదాపు 150 వరకు కోడెలను ఈ రేకుల షెడ్లలో ఉంచుతున్నారు. ఎండాకాలంలో రేకుల షెడ్లలో కోడెలు ఇబ్బందులు పడుతున్నాయి.

**వర్షం కురిస్తే అస్తవ్యస్తం**

ప్రస్తుతం కట్టకింద గోశాల రోడ్డుకు చాలావరకు దిగువన ఉంటుంది. రోడ్డు మీదుగా వెళ్లే వర్షంనీరు పక్కన మురుగు కాలువలోకి చేరుతున్నప్పటికీ గోశాల ప్రధాన గేటు వద్ద కాలువ నిర్మాణం అసంపూర్తిగా ఉండి మట్టి కూరుకుపోవడంతో వర్షం నీరంతా గోశాలలోకి చేరుతోంది. గోశాల ఆవరణ బురదగా మారుతుండగా కోడెలు బురదతోనే ఆలయానికి రావాల్సి వస్తోంది. కొన్ని సందర్భాల్లో కోడెలు జారి పడిన సందర్భాలున్నాయని సిబ్బంది పేర్కొంటున్నారు.

**షెడ్లకు ప్రతిపాదన**

ప్రస్తుతం ఉన్న గోశాలను ఆధునికీకరించాలని అధికారులు ప్రతిపాదనలు చేశారు. ఇందులో భాగంగా గోశాలను పూర్తిగా తొలగించి మట్టిని నింపి రోడ్డుకు సమాంతరంగా తయారు చేసిన తరువాత ఆధునిక పద్ధతులతో కోడెలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా షెడ్లను నిర్మాణం చేయాలని నిర్ణయించారు.

కోడెలకు గాలి, వెలుతురుతోపాటు మేత, నీటి వసతి ఉండేలా నిర్మాణం చేయాలని సంకల్పించినప్పటికీ ఆ ప్రతిపాదనలేవీ ముందుకు సాగలేదు. దీంతో గోశాల ఆధునికీకరణకు మోక్షం లభించడం లేదు. ప్రస్తుతం కట్టకింద గోశాల రోడ్డు కంటే చాలా లోతులో ఉందని.. షెడ్లన్నీ శిథిలమై ఉన్నాయని.. గోశాలను రోడ్డుకు సమాంతరంగా చేసి ఆధునిక షెడ్ల నిర్మాణం చేయడం కోసం ప్రణాళిక తయారు చేశామని రాజన్న ఆలయ డీఈ రఘునందన్ పేర్కొన్నారు.

## చెక్'ఢాం'లు.. నీరుగారిన లక్ష్యం



ఓదెల: వరద నీరు వృథా కాకుండా ఉండేందుకు ఓదెలలోని మానేరు వాగులో చెక్‌డ్యామ్‌ల నిర్మాణం చేపట్టారు. దీంతో నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలు పెరిగేందుకు అవి ఎంతగానో దోహదం చేశాయి. సమృద్ధిగా జలాల లభ్యత ఉండి ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఇంతవరకు బాగానే ఉన్నా.. నిర్మించిన కొన్నాళ్లకే అవి పేకమేడల్లా కూలడంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారినట్లైంది. దీంతో కూలినవాటి స్థానంలో పునర్నిర్మాణం జరిగితే సాగు, తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ప్రజలకు మేలు చేకూరనుంది.

**రెండేళ్లకే కూలిపోయి..**ఓదెలలోని మడక-కరీంనగర్ జిల్లా వీణవంక మండలంలోని కోర్కల్ గ్రామాల మధ్యన మానేరులో 2017లో అప్పటి పాలకులు మానేరు సమీప గ్రామాల ప్రజలకు, రైతులకు.. సాగు, తాగునీటి కొరత తీర్చేందుకు రూ.22 కోట్ల వ్యయంతో దాదాపు 900 మీటర్ల పొడవునా చెక్‌డ్యామ్ నిర్మించారు. 2019లో వచ్చిన వరద నీటి ప్రవాహానికి అది నిట్ట నిలువునా కూలిపోయింది. నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు, నిబంధనలు పాటించకపోవడంతోనే చెక్‌డ్యామ్ కూలిందనే ఆరోపణలున్నాయి.

**నిర్మాణ సమయంలోనూ లీకేజీలు**

ఓదెలలోని రూపునారాయణపేట-కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలం విలాసాగర్ గ్రామాల మధ్య 2017లో రూ.12.8 కోట్లతో మరో చెక్‌డ్యామ్ నిర్మించారు. కాగా నిర్మాణ సమయంలో సిమెంట్ దిమ్మెల కింద నుంచి నీరు లీకేజీలైన సందర్భాలున్నాయి. దీంతో ఐదేళ్లకే వరదనీటి ప్రవాహానికి చెక్‌డ్యామ్ పలుచోట్ల కూలిపోయింది. అప్పటినుంచి తిరిగి పునర్నిర్మాణానికి నోచుకోలేదు.

**ప్రతిపాదనలు తెప్పిస్తాం- విజయరమణారావు, ఎమ్మెల్యే పెద్దపల్లి**

ఓదెలలోని మడక, రూపునారాయణపేట మానేరు వాగుల్లో అప్పటి ప్రభుత్వం నాసిరకంగా నిర్మాణాలు చేపట్టడంతోనే రెండు చెక్‌డ్యామ్‌లు కూలిపోయాయి. రైతాంగానికి, మానేరు సమీప గ్రామాల ప్రజలకు తాగు, సాగునీటి ఎద్దడి తలెత్తకుండా ఉండేందుకు అధికారులతో చర్చించి పునర్నిర్మాణానికి నూతనంగా ప్రతిపాదనలు తెప్పిస్తాం. తప్పకుండా చెక్‌డ్యామ్‌ల పునర్నిర్మాణానికి కృషి చేస్తాం.

## ఇంట్లోకి.. ఒంట్లోకి.. దుమ్ము..!

నల్గొండ: చిట్యాల పెద్దకాపర్తి, కట్టంగూరు జంక్షన్(నల్గొండ రోడ్డు), ఇనుపాముల, టేకుమట్ల, సూర్యాపేట ఎస్వీ కళాశాల-జనగామ జిల్లా కూడలి, జమ్మిగడ్డ కూడలి, దురాజ్‌పల్లి, ముకుందాపురం యూటర్న్ మునగాల, కోమరబండ, కోదాడ, మేళ్లచెరువు పై వంతెన, శ్రీరంగా పురం వద్ద అండర్ పాస్ వంతెన, సర్వీస్ రోడ్డు పనులు కూడా నత్తనడకన సాగుతున్నాయి. ఏడాదిన్నర కాలంలో పనులను పూర్తి చేయాలని ఎన్‌హెచ్‌ఏఐ గుత్తేదారు సంస్థను ఆదేశించినా..పనులు నెమ్మదిగా సాగుతున్నాయి.

చౌటుప్పల్‌లో మురికి కాలువలు, సర్వీస్ రహదారుల పనులు ఆగుతూ సాగుతూ నడుస్తున్నాయి. తంగడపల్లి రహదారి నుంచి వ్యవసాయ మార్కెట్ యార్డు వరకు, మీసేవ నుంచి ఆర్డీవో కార్యాలయం వెళ్లే దారి వరకు కంకర వేసి తారు వేయలేదు. బస్టాండ్ నుంచి చిన్న కొండూరు రహదారి వరకు 150 మీటర్ల మేర పైవంతెన వస్తుంది. మిగిలిన ప్రాంతంలో మట్టికట్టను నిర్మిస్తున్నారు.

హైదరాబాద్- విజయవాడ జాతీయ రహదారిపై అత్యంత ప్రమాదకరమైన ప్రాంతాల్లో (బ్లాక్‌స్పాట్స్) పనులు మూడడుగులు ముందుకు.. ఆరు అడుగులు వెనక్కి అన్నచందంగా కొన..సాగుతున్నాయి. గతేడాది జూన్‌లో తరచూ ప్రమాదాలు జరిగే 17 బ్లాక్‌స్పాట్లలో పనులను మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి రూ.300 కోట్లతో ప్రారంభించారు. ఒక పైవంతెన, 13 అండర్‌పాస్ వంతెనలు, 10 చోట్ల సర్వీస్ రహదారుల నిర్మాణాలను ప్రారంభించారు. కాగా అధికారులు 16 బ్లాక్‌స్పాట్లు ఉమ్మడి నల్గొండ జిల్లా పరిధిలో, మిగిలిన ఒక ప్రాంతం ఏపీలోని నవాబుపేట వద్ద గుర్తించి ప్రమాదాల నివారణకు పనులు చేపడుతున్నారు.

**అధికారులు పట్టించుకోవడం లేదు : పోకల రాములు, పాన్**



**దుకాణయజమాని, ఇందిరానగర్, చిట్యాల**

ఆరు నెలల నుంచి రహదారి పనులు ఆగుతూ సాగుతున్నాయి. మట్టి, ఇసుక, కంకర రవాణా లారీలతో పాటు ట్రాఫిక్ రాకపోకల మూలంగా గుంతలు ఏర్పడ్డాయి. ఆ గుంతల్లో ఫ్లైయాష్‌ను నింపుతున్న ప్రతిసారి గాలికి చెలరేగి మా దుకాణంపై, నాపై పడుతుంది. కనీసం నీళ్లు తెచ్చి గుమ్మరిస్తే దుమ్ము రేగదు. ఎన్నిసార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం ఉండటం లేదు.

**పూలు కొనడం లేదు : ఎండీ.మన్నన్, పూలదుకాణం, ఉరుమడ్ల రోడ్, చిట్యాల**

ఈ దుమ్ము, ధూళితో ఇప్పటికే మా కుటుంబం మొత్తం అనారోగ్యం పాలైంది. దుమ్ము పేరుకుపోయి పూలు ఎవరూ కొనకపోవడంతో బంద్ పెట్టుకోవాల్సి వస్తుంది. ఇంకెప్పుడూ పనులు పూర్తిచేస్తారో అధికారులకే తెలియాలి.


**వర్షాలతో పనులు నిలిచాయి : నాగేశ్వరరావు, ఎన్‌హెచ్-65 ప్రాజెక్టు డైరక్టర్** చిట్యాల, ఇందిరానగర్, పెద్దకాపర్తి, చౌటుప్పల్ ప్రాంతాల్లో పనులు వర్షాలతో నిలిచిపోయాయి. అండర్‌పాస్ పనులకు గోతులు తవ్వి ఫిల్లర్లు నిర్మించిన అనంతరం గడ్డర్స్, ప్రికాస్ట్ వాల్స్ అమర్చి మట్టిని నింపితే వర్షానికి తడిచి పనులకు అడ్డంకిగా మారింది. భారీ వాహనాలు మట్టి, ఇతర వస్తు సామగ్రి రవాణా చేస్తుండటం మూలంగా అక్కడక్కడ గోతులు పడుతుండగా సిబ్బంది ఫ్లైయాష్‌ను నింపుతున్నారు. తాత్కాలికంగా నీటిని చల్లించి సమస్యను నివారిస్తాం. డిసెంబరులోగా మిగిలిన పనులను పూర్తి చేస్తాం.

## వడ్డీ పేరుతో వల.. జీవితం భళా

నల్గొండ : భారీ విల్లాలు.. భవనాలు.. ఖరీదైన కార్లు.. విలాసవంతమైన జీవితం అనుభవిస్తున్న వడ్డీ వ్యాపారి బాలాజీ నాయక్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా వడ్డీవ్యాపారం నిర్వహించడం, బాధితులను మభ్యపెట్టి మనీలాండరింగ్‌కు పాల్పడటం కారణాలతో అతనిపై ఎస్పీ శరత్‌చంద్రపవార్ కేసు నమోదు చేసి ఆచూకీ కోసం పోలీసు బృందాలతో గాలిస్తున్నారు. పీఏపల్లి, మిర్యాలగూడ, దేవరకొండ, నాగార్జునసాగర్ నియోజకవర్గాల్లో అమాయకులైన గిరిజనులే లక్ష్యంగా అధిక వడ్డీ ఆశచూపి రూ.కోట్లు కొల్లగొట్టాడు. 30 ఏళ్ల లోపు వయస్సు..హల్‌చల్ చేసే అతని దినచర్య.. ప్రముఖ రాజకీయ, పోలీసులతో ఉండే సన్నిహిత సంబంధాలు సెలబ్రిటీలను మించి ఉండటంతో గిరిజనులు మోసపోయారు.

**నల్గొండ జడ్పీపీఠంపై కన్నేసే 'రేంజ్'!**

స్థానిక సంస్థల్లో ఈసారి నల్గొండ జిల్లా జడ్పీ పీఠం ఎస్టీ మహిళకి కేటాయించడంతో.. బాలాజీనాయక్ దృష్టి దీనిపై పడిందని అతని సన్నిహితులు చెబుతున్నారు. అధికారం చేజిక్కితే 'అన్నీ వ్యవహారాలు' సర్దుకుంటాయని భావించి స్థానిక సంస్థలే ఎన్నికలే తనకు చక్కని అవకాశమని భావించాడు. మిర్యాలగూడకు చెందిన ఓ ప్రముఖ



అధికార పార్టీలోని సామాజికవర్గ నేతను కలిసి తన రాజకీయ ప్రస్థానాన్ని, భార్యకు జడ్పీ టికెట్ విషయమై చర్చించారు. ఈ క్రమంలో ఆ నేత తనకు 'రేంజ్‌రోవర్' కారు కానుకగా ఇస్తేనే జడ్పీఛైర్మన్‌పై హామీ ఇస్తానని చెప్పడంతో అతను అక్రమ సంపాదనంతా దీనికి వెచ్చించేందుకు సిద్ధమవుతుండగా.. బాలాజీనాయక్ బాధితుడు రమావత్ సరియా చనిపోవడం కలకలం సృష్టించింది.

**ఉద్రిక్త పరిస్థితి**

పీఏపల్లి మండలం పలుగుతండాకు చెందిన బాలాజీనాయక్‌కు ఇదే గ్రామానికి చెందిన యువకుడు సరియా పెద్దమొత్తంలో డబ్బులిచ్చి తిరిగి చెల్లించకపోవడంతో మనస్తా పానికి గురై మిర్యాలగూడలో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీంతో బాధితులు బాలాజీ ఇంటిపై దాడి చేసి ఇంట్లోని సామగ్రి దగ్ధం చేశారు. సరియా మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకువస్తున్నారన్న సమాచారంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు గ్రామంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. బాలాజీనాయక్‌కి అప్పులు ఇచ్చిన బాధితులు మిర్యాలగూడలోని విద్యానగర్‌లో ఉంటున్న అతడి సోదరుడి నివాసం వద్దకు చేరుకున్నారు. విషయం తెలుసుకున్న ఒకటో పట్టణ నాగభూషణరావు, ఎస్సైలు సైదిరెడ్డి, భిక్షమయ్య, వేములపల్లి ఎస్సై వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

# అనంత జలకళ

అనంతపురం : మునుపెన్నడూ లేనివిధంగా ఉమ్మడి అనంత జిల్లా జలకళ సంతరించుకుంది. సాధారణ వర్షపాతం నమోదైనా నీటికి కొదవలేదు. నదులు, చెరువులు, కుంటలు, జలాశయాలు, కాలువలు.. కళకళలాడుతున్నాయి. భూగర్భంలోనూ ఆశించిన మేర ఉండటం విశేషం. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని రకాల వనరులను కలిపితే 106.908 టీఎంసీలు నిల్వ ఉండటం శుభపరిణామం. హెచ్చెల్సీ, హంద్రీనీవా ప్రధాన, ఉప కాలువల్లో ప్రవహిస్తున్న నీరు అదనం. గతంలో తాగునీటికే గగనంగా మారేది. ఇప్పుడు పంటలు సైతం సాగు చేస్తున్నారు. ప్రధానంగా వరి, వేరుసెనగ మాత్రమే కాదు.. ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు.. ఆరుతడి పంటలు సాగు చేశారు.

**సాధారణ వర్షపాతమే..**

ఇరు జిల్లాల్లో జూన్ నుంచి అక్టోబరు ఆఖరు దాకా సాధారణ వర్షపాతం నమోదైంది. అనంత జిల్లాలో 423.4 మి.మీ. కురవాల్సి ఉండగా.. 442.2 మి.మీ నమోదైంది. శ్రీసత్యసాయి జిల్లాలో 478.4 మి.మీ.లకు గాను 483.3 మి.మీ వర్షం కురిసింది. మొత్తంగా పడిన వానలో 9



నుంచి 12 శాతం భూమిలోకి ఇంకుతుంది. ఈ లెక్కన ఉమ్మడి జిల్లాలో 84 టీఎంసీలు భూగర్భంలో అందుబాటులో ఉన్నట్లే.

**నిండుగా..**

ఉమ్మడి జిల్లాలో ప్రధానంగా 14 రకాల జలాశయాలు ఉన్నాయి. బైరవానితిప్ప, యోగివేమన, పేరూరు, పీఏబీఆర్, ఎమ్పీఆర్, కణేకల్లు, చాగల్లు, పెండేకల్లు, సుబ్బరాయసాగర్, ముచ్చుకోటతోపాటు హంద్రీనీవా ప్రధాన కాలువ కింద జీడిపల్లి, గొల్లపల్లి, మారాల, చెర్లోపల్లి ఉన్నాయి. ఇవన్నీ దాదాపు నిండాయి.

పీఏబీఆర్, చాగల్లు, బీటీపీ, యోగివేమన ప్రాజెక్టు గేట్లను ఎత్తి దిగువకు విడుదల చేసిన సంగతి తెలిసిందే. అటు చిత్రావతి గేట్లను ఎత్తారు. ఇప్పటికే హెచ్చెల్సీకి 16.25 టీఎంసీలు దాకా జిల్లాకు చేరాయి. హంద్రీనీవా కింద 20 టీఎంసీలకుపైగా సరఫరా అయ్యాయి.

# ఇదో ఏకేయూ మార్కు నిర్లక్ష్యం!

ఒంగోలు : ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం (ఏకేయూ) పరిధిలోని 2023 డిగ్రీ మొదటి బ్యాచ్ సెమిస్టర్ మార్కుల జాబితాలు పత్తా లేవు. పరీక్షలు నిర్వహించి ఫలితాలు విడుదల చేసిన 15 రోజులకు వివరాలు డిజీలాకర్‌లో ఉంచి, విద్యార్థులకు హార్డ్‌కాపీలు అందజేయాలి. గతేడాది మార్చిలో నిర్వహించిన సెమిస్టర్ పరీక్షలకు సంబంధించిన మార్కులు ఇంతవరకు కళాశాలలకు రాలేదు. ఇతర విశ్వ విద్యాలయాలో అన్ని సెమిస్టర్ల మార్కుల పత్రాలు పంపిణీ చేసినా ఏకేయూ పరీక్షల విభాగం తీరు మాత్రం మారడం లేదు. పరీక్షల విభాగంలో అడపాదడపా సంస్కరణలు చేపట్టినా ఎలాంటి ఫలితాలివ్వడంలేదు. తగినంతమంది సిబ్బంది ఉన్నా సకాలంలో పనులు జరగడంలేదు.ఏకేయూ పరిధిలో 87 డిగ్రీ కళాశాలుండగా, ఒక్కో బ్యాచ్‌లో 6 వేల మందికి పైగా చదువుతున్నారు. మొదటి సెమిస్టర్ పరీక్షలకు సంబంధించిన మార్కుల జాబితా మాత్రమే విద్యార్థి చేతికందింది. రెండో సెమిస్టర్ గతేడాది మార్చిలో, మూడో సెమిస్టర్ నవంబరులో, నాలుగో సెమిస్టర్ ఈ ఏడాది మార్చిలో నిర్వహించారు.




ఈ మూడు సెమిస్టర్ల మార్కుల మెమోలు ఇంతవరకు వెలుగుచూడలేదు. ఈ నెల 10వతేదీ నుంచి అయిదో సెమిస్టర్ పరీక్షల నిర్వహణకు షెడ్యూలు ప్రకటించారు. విద్యార్థులు ఫెయిలైన సబ్జెక్టులకు మళ్లీ ఫీజు కట్టుకోవాలంటే మార్కుల వివరాలుండాలి. కనీసం డిజీలాకర్‌లో కూడా ఉంచలేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం మొదటి సెమిస్టర్ మార్కుల వివరాలు మినహా మిగిలినవి వెబ్‌సైట్‌లో లభ్యం కావడంలేదని వాపోతున్నారు. రెండో ఏడాది పూర్తయ్యాక మూడో ఏడాదిలో ఇతర జిల్లాలోని కళాశాలకు మారాలనుకునేవారికి మార్కుల జాబితాలు ఇవ్వకపోవడం సమస్యగా మారింది. ఈ విషయమైవీసీ డాక్టర్ డీవీఆర్ మూర్తి మాట్లాడుతూ రెండో సెమిస్టర్ మార్కుల మెమోల ముద్రణ జరుగుతోందని, త్వరలో మిగిలినవి కూడా ఇచ్చేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు.

## పేరులో జాతీయం.. పనుల్లో జాప్యం!

కొనకనమిట్ల: శ్రీకాళహస్తి- హైదరాబాద్-565 రహదారి అధ్వానంగా తయారైంది. సుమారు 8 ఏళ్ల కిందట నిర్మించిన ఈ రహదారి నిర్వహణను ఎన్‌హెచ్ఏఐ గాలికొదిలేసింది. సూచిక బోర్డులు, విద్యుత్తు దీపాల ఏర్పాటును పూర్తిగా విస్మరించింది. రహదారి అంచులపై పేరుకుపోయిన చెత్తను తొలగించకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. కొనకనమిట్ల తహసీల్దార కార్యాలయం నుంచి బస్టాండు కూడలి వరకు ఏర్పాటు చేసిన విద్యుత్తు దీపాలు అయిదేళ్లుగా వెలగకపోవడంతో ప్రమాదాలు జరిగి పలువురు మృతిచెందారు. కొనకనమిట్ల బస్టాండు కూడలి నుంచి భారత్ పెట్రోలుబంకు వరకు రెండు వందల మీటర్ల రహదారి పనులు చేయకుండా వదిలేశారు. రెండేళ్ల కిందట అర్‌అండ్‌బీ ఆధ్వర్యంలో రూ.50 లక్షలతో నామమాత్రంగా ఒక వరుస పనులు చేసి వదిలేయడంతో వాహనచోదకులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. మరోపక్క జాతీయ రహదారుల నిర్మాణ సంస్థ నిర్వహణ పేరిట వాహనాల సామర్థ్యాన్ని బట్టి టోల్ వసూలు చేస్తోంది. ఈ విషయమై ఎన్‌హెచ్ఏఐ జేఈ నవీన్ మాట్లాడుతూ జాతీయ రహదారిపై గుంతలు పూడ్చడంతోపాటు విద్యుత్తు దీపాల ఏర్పాటు తదితర పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. నిధులు మంజూరైన వెంటనే పనులు చేపడతామన్నారు.

# సంఘటిత 'హల'దారి



కర్నూలు : "ఒక్కరు చేయలేని పనిని పది మంది చేయగలరు.. పది మందితో కానిది వంద మందితో సాధ్యమవుతుంది.. రైతులంతా సంఘటితమై సాగులో సవాళ్లు అధిగమించారు. తుంగభద్ర తీరాన్ని 2009 సెప్టెంబరులో వరద ముంచెత్తింది. పచ్చని పొలాలను ఇసుక మేటలు కప్పేశాయి. బెంగ పడుతున్న సి.బెళగల్ రైతులకు ప్రభుత్వం అండగా నిలిచింది.. సెంటర్ ఫర్ సస్టైనబుల్ అగ్రికల్చర్ (సీఎస్ఏ) సహకారంతో ఇసుక మేటలు తొలగించారు. సంఘటితమై హల'దారి' లాభాల బాటలో సాగుతున్నారు. పదహారేళ్ల కిందట ఇసుక మేటలు నిండిన ఆ పొలాలు మాగాణులుగా మార్చారు. నిస్సారమైన ఆ భూములు ఇప్పుడు లాభాలు 'వరి'స్తున్నాయి."

**కొత్త రకాల సాగు**

నవర బియ్యంలో ఔషధ గుణాలెక్కువ. కొత్తకోటకు చెందిన ఇద్దరు రైతులు 30 సెంట్లలో సాగు చేస్తున్నారు. ఈ బియ్యం ఎర్రగా ఉంటుంది. ఇందులో ప్రొటీన్లు, ఫైబర్ ఎక్కువగా లభిస్తుంది.

చిన్న ముత్యాలు బియ్యం చిన్నగా, సువాసనతో ఉంటుంది. పులావ్, బిర్యానీ వంటి వాటికి ఉపయోగిస్తారు. తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ నేపథ్యంలో మధుమేహం బాధితులు వినియోగిస్తారు. సంగాలలో ఓ రైతు సాగు చేస్తున్నారు.

**స్ఫూర్తి నింపిన నాలుగు గ్రామాలు**

కొండాపురం (రంగాపురం), సంగాల గ్రామాల్లో రైతులంతా సంఘటితమై తుంగభద్ర సేంద్రియ వ్యవసాయ ధాన్య, విత్తన రైతుల పరస్పర సహాయ సహకార సంఘాన్ని ఏర్పాటు చేసుకొన్నారు.

160 మంది రైతులతో ఏర్పాటైన ఆ సంఘంలో ప్రస్తుతం 1,100 మంది వరకు ఉన్నారు. నాలుగు గ్రామాల్లో 700 ఎకరాల్లో సేంద్రియ పద్ధతిలో వరి, కూరగాయలు, ఉద్యాన పంటలు సాగు చేస్తున్నారు. ఆయా గ్రామాలను స్ఫూర్తిగా తీసుకొని కొత్తకోట, కె.సింగవరం, గుండ్రేవుల, సంగాల, తిమ్మందొడ్డి, ఎనగండ్ల పంటలు సాగు చేస్తున్నారు.

**బియ్యంగా మార్చి.. లాభాలు ఆర్జించి**

సేంద్రియ పద్ధతిలో ఎకరా సాగుకు రూ.30 వేలకుపైగా ఖర్చవుతుంది. సాధారణ దిగుబడులతో పోలిస్తే ఎకరాకు 16-17 క్వింటాళ్లు మాత్రమే వస్తుంది. ధాన్యాన్ని బియ్యంగా మార్చితే మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. క్వింటా బియ్యం రూ.6,500 నుంచి రూ.7 వేల వరకు పలుకుతోంది. పలువురు రైతులు బియ్యంగా మార్చి అమ్ముకుంటూ అధిక లాభాలు ఆర్జిస్తున్నారు.

**నాణ్యతకు గుర్తింపు**

2023-24లో సి.బెళగల్ మండలం కొండాపురం, గుండ్రేవుల గ్రామాల్లో గ్యాప్ పద్ధతులు పాటిస్తూ బీపీటీ 5204 రకం వరి సాగు చేశారు. ఈ పద్ధతికి కేంద్ర ప్రభుత్వ సంస్థ.. క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఇండ్ గ్యాప్ ధ్రువపత్రం అందిస్తుంది.

సాధారణంగా వరి సాగు చేసే రైతులు క్వింటా బియ్యాన్ని రూ.5,500కు విక్రయిస్తే.. ఇండ్ గ్యాప్ పత్రం పొందిన సహకార సంఘం ద్వారా మధుసూదన్‌రెడ్డి అనే రైతు క్వింటా బియ్యాన్ని రూ.7,500కు అమ్ముకోవడం విశేషం.

# జాగా ఇచ్చారు.. జాగరణ చేస్తున్నారు



కర్నూలు : ఓర్వకల్లు మండలంలో 'మెగా ఇండస్ట్రియల్ హబ్' నిర్మాణానికి భూములు ఇచ్చిన రైతులు పరిహారం కోసం మూడేళ్లుగా ఎదురు చూస్తున్నారు. 11 గ్రామాల పరిధిలో సుమారు 2,500 ఎకరాల ప్రైవేటు భూములు తీసుకొన్నారు. పట్టా భూములకు ఎకరాకు రూ.18 లక్షలు, సాగులోని డీపట్టా భూములకు ఎకరాకు రూ.8 లక్షల పరిహారం ఇవ్వాలని నిర్ణయించారు. గత తెదేపా ప్రభుత్వంలో కొంతమందికి పరిహారం ఇచ్చింది. ప్రైవేటు భూములు ఇచ్చిన వారిలో కొందరికి, డీపట్టా సాగుదారుల్లో చాలామందికి గత వైకాపా ప్రభుత్వం చెక్కులు అందలేదు. మూడేళ్లుగా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

**ఇష్టానుసారం పరిహారం నిర్ణయం**

పరిహారం అంచనాల తయారీలో భారీఎత్తున అక్రమాలు జరిగాయి. భూముల్లో చెట్లు, బావులు, ఇతర నిర్మాణాలకు పరిహారాన్ని నిర్ణయించి చెల్లించాలి. ఆయా నిర్మాణాలు, చెట్లు, బావులను అసలు పరిగణనలోకే తీసుకోలేదు.

భూమి విస్తీర్ణం తక్కువగా ఉందని పరిహారానికి కోతపెట్టారు. గుట్టపాడుకు చెందిన మహబూబ్‌బాషాకు 2.50 ఎకరాలు ఉండగా 2.31 ఎకరాలే ఉన్నట్లు చూపారు. ఇతనికి రూ.36 లక్షలకు పైగా పరిహారం అందాల్సి ఉంది. మూడేళ్లుగా ఆ మొత్తం చెల్లించకుండా ఇబ్బంది పెడుతున్నారు. ఇదే గ్రామానికి చెందిన మహ్మద్‌కు రూ.12 లక్షలు రావాల్సి ఉంది.

గత వైకాపా ప్రభుత్వ హయాంలో చెక్కుల పంపిణీ జరిగింది. ఆ సమయంలో కొందరు తెదేపా వారన్న ఉద్దేశంతో వారికి ఇవ్వాల్సిన చెక్కులను వెనక్కి పంపేశారని బాధితులు కంటతడిపెడుతున్నారు. కొందరికి మాత్రమే పరిహారం ఇవ్వాల్సి ఉందని, వారికి కూడా త్వరలోనే అందజేస్తామని రెవెన్యూ, ఏపీఐఐసీ అధికారులు చెబుతున్నారు.

**కోర్టుకెళ్లామని కోత పెట్టారు**

గుట్టపాడులోని సర్వే నంబరు 274లో నా భార్య పేరిట రెండెకరాల డీపట్టా భూమి ఉంది. దానికి పరిహారం ఇవ్వాలని న్యాయస్థానాన్ని ఆశ్రయించాం. ప్రభుత్వ విలువ ఆధారంగా పరిహారం చెల్లించాలని న్యాయస్థానం తీర్పునిచ్చింది. వాస్తవానికి అప్పటి ప్రభుత్వం డీపట్టా భూములకు ఎకరాకు రూ.8 లక్షలు ఇచ్చింది. నాతో పాటు మరో 20 మంది న్యాయస్థానాన్ని ఆశ్రయించామన్న కోపంతో మాకు న్యాయస్థానం సూచించినట్లుగా ప్రభుత్వ రికార్డుల ప్రకారం ఎకరం రూ.4.30 లక్షలు మాత్రమే కావడంతో అంతే చెల్లించారు.

దస్తగిరి, గుట్టపాడు

**చెక్కులను వెనక్కి పంపేశారు**

మా గ్రామంలో నాతో పాటు మరికొందరు రైతులు భూములు కోల్పోయారు. వైకాపా హయాంలో పరిహారం చెక్కులు తీసుకోవడానికి నన్ను, మహ్మద్, సుగుణమ్మ, ప్రభాకర్, సుబ్బరాయుడు తదితరులను పిలిచారు. మేము సర్పంచి ఎన్నికల్లో తెదేపాకు అనుకూలంగా పనిచేశామని ఆ చెక్కులు ఇవ్వకుండా తీసుకెళ్లిపోయారు. నేటి వరకు నాకు పరిహారం అందలేదు.

చిన్న సుంకన్న, గుట్టపాడు

గ్రామాలు 13

సేకరించాల్సిన భూమి 10,921.45

ఏపీఐఐసీకి ఇచ్చింది 7,214.87

ప్రభుత్వ 5,140.64

డీకేటీ భూములు 2074.23

# బయటపెడుతోంది.. అక్రమార్కుల రంగు

చింతలపూడి ప్రభుత్వం పేదలకు పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యం అక్రమార్కుల కడుపు నింపుతోంది. ప్రతి నెలా ప్రజల నుంచి టన్నుల కొద్దీ అడ్డదారిలో కొని జేబులు నింపుకొంటున్నారు.దీని అడ్డుకట్టకు ప్రభుత్వం ఎన్ని చర్యలు తీసుకుంటున్నా సాధ్యం కావడం లేదు. కూటమి ప్రభుత్వం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, పౌర సరఫరాల శాఖ ఉప తహసీల్దార్లకు రసాయనాలతో కూడిన ర్యాపిడో కిట్లు అందిస్తోంది. దీని ద్వారా పట్టుబడిన బియ్యం రేషన్‌లో ఇచ్చినవా.. కాదా అనేది తేలిపోతుంది. అక్రమార్కుల రంగు బయటపెడుతుంది.

మెట్ట.. అక్రమ రవాణాకు అడ్డా.. జిల్లాలో రేషన్ బియ్యం అక్రమ రవాణాకు మెట్ట మండలాలు అడ్డాగా మారాయి. చింతలపూడి, టి.నరసాపురం, నూజివీడు, జంగారెడ్డిగూడెం, లింగపాలెం, కామవరపుకోట, జీలుగుమిల్లి, బుట్టాయగూడెం, కొయ్యలగూడెం, పెదవేగిలో విచ్చలవిడిగా కొంటున్నారు. వాటిని శివారు ప్రాంతాల్లోని గోదాముల్లో నిల్వ చేసి రాత్రి వేళల్లో లారీల్లో సరిహద్దులు దాటిస్తున్నారు. ర్యాపిడో కిట్లు వల్ల బియ్యం అక్రమ రవాణాను నిరోధించవచ్చని జిల్లా పౌర సరఫరాల శాఖాధికారి విలియమ్స్ తెలిపారు.

గుర్తింపు ఇలా.. జిల్లాలోని సంబంధిత అధికారులకు 20 కిట్లు ఇస్తున్నారు. వీటి సాయంతో పట్టుకున్న ప్రాంతంలోనే బియ్యం పరీక్షిస్తారు. రేషన్‌వి అయితే ఎరుపు రంగులోకి మారతాయి.

చౌక డిపోలు 1,123

రేషన్ కార్డులు 6,14,879

ప్రతి నెలా బియ్యం కేటాయింపు-8 వేల టన్నులు

గతేడాది నమోదు చేసిన 6ఏ కేసులు- 120

పట్టుకున్న బియ్యం - 180 టన్నులు

# చెరువు కాదండోయ్.. శ్మశాన వాటిక

కైకలూరు : ఏంటీ సమృద్ధిగా నీరుంది.. చేపల చెరువు అనుకుంటున్నారా. అలా అనుకుంటే మీరు నీటిలో కాలేసినట్లే. ఇది ముమ్మాటికీ శ్మశాన వాటిక అంటే నమ్మగలరా.. అవునండీ కైకలూరు మండలం సీతనపల్లి ఎస్సీ కాలనీలో ఉంది ఈ శ్మశాన వాటిక. ఇటీవల జిల్లాపై ప్రభావం చూపిన మొంథా తుపాను నేపథ్యంలో కురిసిన వర్షాలకు ఇలా మారింది. వదర్లపాడు- సీతనపల్లి ప్రధాన రోడ్డు చెంతనే ఉన్న ఎటువంటి రక్షణ లేకుండా బహిరంగంగా ఉంటుంది. రోడ్డు కంటే దిగువన ఉండటంతో మోస్తరు వర్షం పడినా ఇందులో నీరు తిష్ఠ వేస్తుంది. ఇక ఇటు నుంచి పాత ఎస్సీవాడకు చేరే మార్గం సైతం పల్లంగా మారడంతో తరచూ ముంపు బారిన పడుతునే ఉంటుంది. వారం రోజులుగా నీరు నిలిచి ఉన్నా పంచాయతీ అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. శ్మశానానికి కూత వేటు దూరంలోనే పుల్లవామురుగు కాలువ ఉంది. పంచాయతీ అధికారులు కాస్త దృష్టి సారించి ఇంజన్లు ఏర్పాటు చేసే అర గంటలో నీరంతా ఈ కాలువలో చేరుతోంది. ఈ ముంపునీరు పక్కనే ఉన్న కాలనీలోని కొందరు నివాసాల చెంతకు చేరి స్థానికులు అవస్థలు పడుతున్నారు. పరిసరాలంతా బురదమయంగా మారడంతో అంటు రోగాల బారిన పడతామని ఆవేదన చెందుతున్నారు.

# నల్లమలలో పుష్ప

నంద్యాల : నల్లమల అడవుల్లో అరుదుగా లభించే శ్రీగంధం అక్రమార్కులకు వరంగా మారింది. ఒకప్పుడు వేలాది హెక్టార్లలో విస్తరించిన ఈ చెట్లు ప్రస్తుతం పదుల హెక్టార్లలోనూ కనిపించడం లేదు. స్మగ్లర్ల రంపపు కోతకు ఇవి నేలకొరుగుతున్నాయి. ఇటీవల కర్ణాటక రాష్ట్రంలో పెద్దఎత్తున శ్రీగంధం చెక్కలను పట్టుకోవడం కలకలం రేపింది. జిల్లాలో నల్లమల అడవి నుంచే అక్కడికి రవాణా అయినట్లు సమాచారం. దీనిని పరిశీలిస్తే జిల్లా నుంచి యథేచ్ఛగా సరిహద్దులు దాటుతోందని అర్థమవుతోంది.

**దాచిపెట్టి.. తరలించి**

స్మగ్లర్లు శ్రీగంధం చెట్లను నరికిన కొంత కాలానికి యంత్రాల సాయంతో కోయిస్తారు. అనంతరం చిన్నచిన్న ముక్కలుగా చేసి అనుకూలమైన ప్రాంతాల్లో దాచిపెడుతారు. ఆ తర్వాత వాటిని అవసరాన్ని బట్టి తరలిస్తారు.

**ఇతర రాష్ట్రాలకు అక్రమంగా తరలింపు**



జిల్లాలోని అటవీ ప్రాంతంలో 15 ఏళ్ల కిందటే స్మగ్లర్లు శ్రీగంధపు చెట్లను నరికి చెక్కలుగా మార్చి బెంగళూరు, మంగళూరు, చిత్రదుర్గ, చెన్నై, కొయంబత్తూరు, కన్యాకుమారి తదితర ప్రాంతాలకు అక్రమంగా తరలించేవారు. ఆ తర్వాత అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవడం.. జైలుశిక్షలు పడటంతో అక్రమ రవాణాకు తాత్కాలికంగా తెరపడింది.

ప్రస్తుతం గుట్టుచప్పుడు కాకుండా చెట్లు కొట్టేసి ముక్కలు చేసి గిరిజనుల సాయంతో బయటకు తీసుకొచ్చి వాహనాల ద్వారా పొరుగు రాష్ట్రాలకు తరలిస్తున్నారు. ప్రత్యేకించి పచ్చర్ల, బసాపురం, చాగలమర్రి, ముత్యాలపాడు, ఆత్మకూరు ప్రాంతాలకు చెందిన కొందరు ఇప్పటికీ శ్రీగంధపు చెక్కలను అక్రమంగా రవాణా చేస్తున్నారు.

అక్రమ రవాణాలో పెద్దలు ఉంటుండగా.. చెట్ల నరికివేతలో మాత్రం అమాయక గిరిజనులు కొంతమంది ఉంటున్నారు. వీరేకాక చిత్తూరు, చెన్నై తదితర ప్రాంతాలకు చెందిన కూలీలు సైతం శ్రీగంధం చెట్లను ఇష్టానుసారంగా నరికేస్తున్నారు.

**కిలో రూ.5 వేలకుపైగానే..**

శ్రీగంధం చెట్లలో వివిధ రకాలున్నాయి. గంధం, సరి గంధం, చందనం తదితర పేర్లతో వీటిని పిలుస్తారు. బహిరంగ విపణిలో వీటి విలువ కిలో రూ.5 వేల నుంచి రూ.8 వేల వరకు ఉంది. పరిమళ ద్రవ్యాలు, అత్తరు, అగరబత్తి, సబ్బులు, కొన్నిరకాల ఔషధాల తయారీలో వీటిని ఉపయోగిస్తారు.

**100 హెక్టార్లలో విస్తరణ**

ఆత్మకూరు, ఆళ్లగడ్డ అటవీ డివిజన్ల పరిధిలోని నల్లమల అటవీ ప్రాంతంలో శ్రీగంధం చెట్లు విస్తరించి ఉన్నాయి. మహానంది, శిరివెళ్ల, చాగలమర్రి, ఆత్మకూరు, రుద్రవరం, బండిఆత్మకూరు, వెలుగోడు మండలాల పరిధిలో సుమారు 100 హెక్టార్లలో అక్కడక్కడా ఉన్నాయి. కొందరు స్మగ్లర్లు వీటిని నరికేసి ఇతర రాష్ట్రాలకు అక్రమంగా తరలిస్తున్నారు.

# మరి నాకేం లేదా ?

ఒంగోలు: లెక్క ప్రకారం మీ వ్యాపారంలో ఇంత మొత్తం సమర్పించండి.. లేకుంటే తెలుసుగా అధికారులు క్వారీల్లోకి దిగుతారు. అప్పుడు పరిస్థితి మరోలా ఉంటుంది.. గ్రానైట్ యాజమానులకు ఓ ప్రజాప్రతినిధి హుకుం జారీచేయడమే తరువాయి వెనువెంటనే క్వారీల్లోకి అధికారులు అడుగుపెట్టేశారు. అధికారికంగా క్వారీల్లో ఎలాంటి లోపాలు వెల్లడి చేయకున్నా ఆ ప్రజాప్రతినిధి తన సత్తా ఏమిటో చూపించాడు.. అసలే తాము నష్టాల్లో ఉండగా ఈ వసూళ్ల గోలేంటని గ్రానైట్ క్వారీల యజమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.జిల్లాలోని గ్రానైట్ క్వారీల నుంచి కొంత వసూళ్లు రాబట్టవచ్చునని ఓ ప్రజాప్రతినిధి పథకం వేశాడు. ఈ మేరకు సంబంధిత సంఘం



పెద్దలను పిలిపించి, చేస్తున్న వ్యాపారంలో కొంత పర్సంటేజీ నిర్ణయించి ఇవ్వాల్సిందిగా కోరాడు. గతంలో పెద్దలకు ఇచ్చిన మాదిరి మీరే నిర్ణయించుకుని కప్పం కట్టాల్సిందిగా హుకుం జారీ చేశాడు. ఇప్పటికే తాము కష్టాల్లో ఉన్నామని, తామెలా చెల్లించేదని క్వారీల యజమానులు సమాధానమిచ్చారు,. అంతే నా మాటలు బేఖాతరు చేస్తారా.. అంటూ సదరు ప్రజాప్రతినిధి హుటాహుటిన అధికారులను రంగంలోకి దించారు. క్వారీల్లో తనిఖీలు చేపట్టిన అధికారులు క్వారీల యజమానులు పిలిపించి మాట్లాడారు. ఓవైపు క్వారీల్లో రాయికి సీనరేజీ వసూలు బాధ్యత ప్రైవేటు సంస్థకు అప్పగించడంతో గ్రానైట్ క్వారీల యజమానులు ఇప్పటికే ఆందోళనలో ఉన్నారు. ఇప్పుడు అధికారులను తీసుకొచ్చి తనిఖీల పేరిట ఇబ్బందులు పెడుతూ ముడుపులు ఇవ్వాల్సిందేనని డిమాండు చేయడం ఎంత మాత్రం సమంజసం కాదని వాపోతున్నారు. విదేశాలకు ఎగుమతులు నిలిచిపోయాయని, గ్రానైట్ రంగం సంక్షోభంలో ఉందని పెద్దలుగా చేయూతనివ్వాల్సిందిపోయి మానసిక క్షోభకు గురిచేస్తున్నారని ఆవేదన చెందుతున్నారు.

నిబంధనల అస్త్రాన్ని ప్రయోగించి గత వైకాపా ప్రభుత్వంలో కొందరు పెద్దలు క్వారీల యజమానుల నుంచి అక్రమ వసూళ్లకు పాల్పడేవారు. మాట విననివారిని తమ చెప్పుచేతల్లోకి తీసుకునేవారు. ప్రస్తుతం ఆ తరహాలో వసూళ్లు చేపట్టేందుకు సదరు ప్రజాప్రతినిధి తెరలేపాడు. ఎందుకు ఇవ్వారనే ధోరణిలో బెదిరింపులకు దిగుతున్నారు. వసూళ్లు చూసుకుంటున్నారే గానీ నిబంధనల ఉల్లంఘన పేరుతో ప్రభుత్వ ఖజనాకు చిల్లు పడుతున్నా, కార్మికుల ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నా పెద్దలకు పట్టకపోవడం గమనార్హం.

చురకలు



# పేరుకే కాలనీలు.. అసౌకర్యాలు కోకొల్లలు!

గుత్తి : జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయల కల్పన పేరుతో గత ప్రభుత్వ హయాం లబ్ధిదారులను వంచించింది. అధికారులు పెద్ద ఎత్తున నిధుల వినియోగించి కట్టిన కట్టడాలన్నీ వృథా అయ్యాయి. ప్రధానంగా గుత్తి, గుంతకల్లు, తాడిపత్రి పురపాలికల్లో రూ.కోట్లు పక్కదారిపట్టాయి. కాలనీలకు తాగునీటి పథకాలు, రోడ్లు, కాలువల నిర్మాణానికి ప్రభుత్వం విడుదల చేయగా అధికారులు, గుత్తేదారులు అరకొర సౌకర్యాలు కల్పించి రూ.కోట్లు కాజేశారు.

**రూ.కోట్లు గుమ్మరించారంతే..**

గుంతకల్లులోని దోనిముక్కల కాలనీలో రూ.2 కోట్లతో తాగునీటి ట్యాంకులు నిర్మించారు. ఇవి ఎక్కడా పని చేయడం లేదు. బోర్లు వేయించి చిన్న చిన్న ట్యాంకులను ఏర్పాటు చేసి చేతులు దులిపేసుకున్నారు. ట్యాంకులు అలంకారప్రాయంగా ఉన్నాయి.

ప్రస్తుతం పురపాలిక అధికారులు ట్యాంకర్లతో ప్రజలకు తాగునీటిని సరఫరా చేస్తున్నారు. కాలనీలో ఏర్పాటు చేసిన నీటిపథకాలు మూలనపడ్డాయి. ఇక్కడ భారీగా నిధులను కాజేశారన్న ఆరోపణలు ఉన్నాయి. తాడిపత్రిలోని ఎర్రగుంటపల్లి జగనన్నకాలనీలో ఎలాంటి సౌకర్యాలు, మౌలిక వసతులులేవు. రూ.లక్షలతో చేపట్టిన పనులన్నీ మధ్యనే ఆపేశారు. కాలనీ పట్టణానికి కాలనీ దూరంగా ఉండటం అధికారులు ఎవరూ పట్టించుకోలేదు. తాగునీటి పథకాలు, రోడ్లు, తదితర నిర్మాణాలేవీ చేపట్టలేదు. నిధులేమో స్వాహా అయ్యాయన్న



ఆరోపణలు ఉన్నారు.

గుత్తిలో నాలుగు కాలనీలు ఉన్నాయి. నేమితాబాదు గ్రామానికి వెళ్లేదారిలో ఉన్న కాలనీలో తాగునీరు లేక ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. నేమితాబాదు రోడ్డులోని కాలనీలో బోర్లు వేసి నీటి ట్యాంకులు ఏర్పాటు చేశారు. అవేవీ పని చేయడం లేదు. జనం నివాసం ఉంటున్నా మౌలిక సదుపాయాలను కల్పించ లేదు. లచ్చానిపల్లి రోడ్డులోని కాలనీలో ఉప్పునీటి కుళాయిలు ఉన్నాయి. ఇక్కడ తాగునీటిని ప్రైవేట్ ప్లాంట్లలో కొనాల్సి వస్తోంది. చెట్నేపల్లి కాలనీ, కొత్తపేట లేఅవుట్‌లోనే ఇదే పరిస్థితి ఉంది.

**నిధులు వెనక్కువెళ్లాయి**

గుత్తిలోని కాలనీలకు ప్రభుత్వం రూ.11కోట్లు ఇచ్చింది. పక్కా గృహాలు పూర్తికాకపోవడంతో అవన్నీ వెనక్కుతీసున్నారు. ప్రస్తుతం రూ.243 కోట్లతో గార్లదిన్నె ఎంపీఆర్ డ్యామ్ పథకం పనులు పూర్తయితే కాలనీలకు తాగునీటి పైపులైన్‌లను ఏర్పాటు చేసి నీటి సౌకర్యం కల్పిస్తాం. కొత్తపేట లేఅవుట్ గ్రామీణంలో ఉండటంతో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు తాగునీటి సౌకర్యం కల్పించాల్సి ఉంది.

కేతన్, డీఈఈ, ప్రజాఆరోగ్య విభాగం,గుంతకల్లు

# ముఖ్యమంత్రి మెచ్చారు.. కానీ..!

తిరుపతి : ముఖ్యమంత్రి చంద్రబాబు మెచ్చుకున్న ఈ ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణ కేంద్రం రేణిగుంట మండలం తూకివాకంలో ఉంది. రూ.120 కోట్లతో తెదేపా హయాంలో నిర్మించిన కేంద్రం నిర్వహణ వైకాపా హయాంలో నీరుగారింది. తిరుపతి నగరంలో ఉత్పత్తి అయ్యే ప్రతి కిలో వ్యర్థాన్ని నిర్వహించి జీరో వేస్టేజ్ నగరంగా తీర్చిదిద్దాలన్న సంకల్పంతో పనిచేయాల్సి ఉండగా.. లక్ష్యానికి సుదూరంగా పయనిస్తోంది.

భవన నిర్మాణ వ్యర్థాల నిర్వహణ ప్లాంట్: నగరంలో నిత్యం 25 టన్నులకు పైగా భవన నిర్మాణ వ్యర్థాలు ఉత్పత్తి అవుతుంటాయి. రోజుకు 80 టన్నుల సామర్థ్యం గల ఈ ప్లాంట్ వ్యర్థాలతో ఫుట్‌పాత్‌లకు వినియోగించే పేవర్ బ్లాక్స్, పార్కింగ్ టైల్స్ తయారు చేయొచ్చు. ప్రస్తుతం: భవన నిర్మాణ వ్యర్థాల్ని ప్లాంట్‌కు చేర్చడంలో నగరపాలిక విఫలం కావడంతో ఇది పనిచేయడం లేదు.

మురుగు నీటిశుద్ధి ప్లాంట్

నగరంలో నిత్యం 55 ఎంఎల్‌డీల మురుగు నీరు ఉత్పత్తి అవుతోంది. ప్లాంట్‌లో 32 ఎంఎల్‌డీల నీటిని శుద్ధి చేయొచ్చు. ఓ సిమెంట్ కర్మాగారానికి నిత్యం 5 ఎంఎల్‌డీల శుద్ధి చేసిన నీటిని విక్రయిస్తూ నెలకు రూ.15 లక్షల ఆదాయం పొందుతున్నారు. రోజూ 18 ఎంఎల్‌డీల నీటిని స్థానిక రైతుల అవసరాలకు సరఫరా చేస్తున్నారు. మరో 25 ఎంఎల్‌డీ మురుగునీటి శుద్ధి కోసం రూ.47 కోట్ల ప్లాంట్ పనులు అసంపూర్తిగా ఉన్నాయి.

పొడి వ్యర్థాల నిర్వహణ .. రోజుకు వంద టన్నుల ప్లాస్టిక్, కాగితపు, గాజు, ఇతర పొడి వ్యర్థాలు నిర్వహించగల ప్లాంట్‌లో 40 టన్నుల వ్యర్థాల్నే ప్రాసెస్ చేస్తున్నారు. ఓ ప్రైవేటు సంస్థ బేళ్లు, కట్టలుగా తయారు చేసిన వ్యర్థాల్ని కర్మాగారాలకు కిలో రూ.40 చొప్పున విక్రయిస్తుండగా.. అందులో రూ.2 నగరపాలికకు చెల్లిస్తోంది.



తడివ్యర్థాల... తడి వ్యర్థాల్ని సేంద్రియ ఎరువుగా మార్చి రైతులకు, నగరపాలిక అవసరాలకు వినియోగించే లక్ష్యంతో రూ.3 కోట్ల వ్యయంతో ఈ ప్లాంట్ పెట్టారు. రోజుకు వంద టన్నుల వ్యర్థాల్ని నిర్వహించవచ్చు. ప్రస్తుతం మూతపడింది.

బయో మిథనైజేషన్ ప్లాంట్

హోటళ్లు, మార్కెట్లు, వసతిగృహాల్లోని తడి, ఆహార వ్యర్థాలతో సీఎన్‌జీ ఉత్పత్తికి ప్లాంట్ ఏర్పాటు చేశారు. రోజుకు 50 టన్నుల వ్యర్థాలు కావాల్సి ఉండగా.. 20 టన్నులకు మించి రావడం లేదు. దీంతో 700 కిలోల బయోగ్యాస్ ఉత్పత్తి అవుతోంది. దీన్ని కిలో రూ.76కు విక్రయిస్తున్నారు.

# కందిపప్పు లేనట్టే



చిత్తూరు : ఈ నెలలోనూ బియ్యం కార్డుదారులకు కందిపప్పు సరఫరా నిలిచిపోయింది. దీంతో పేదలకు పప్పన్నం దూరమైంది. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా కందిపప్పుతో పాటు పామాయిల్, గోధుమలు, రాగులు, జొన్నల పంపిణీకి కూటమి ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నా క్షేత్రస్థాయిలో కార్యాచరణకు నోచుకోవడం లేదు. గత ఏడు నెలలుగా పంపిణీ చేస్తామని అధికారులు చెబుతున్నా.. టెండర్ల ప్రక్రియలో జాప్యం జరుగుతోంది. జిల్లాలో 5.34 లక్షల బియ్యం కార్డులున్నాయి. వీరికి ప్రతి నెల 8,250 టన్నుల బియ్యం, 250 టన్నుల చక్కెర, 540 టన్నుల కందిపప్పు పంపిణీ చేయాలి. బహిరంగ మార్కెట్లో కందిపప్పు నాణ్యతను అనుసరించి కిలో రూ.100- 120 పలుకుతోంది. పేదలు కందిపప్పు కొనలేక అవస్థలు పడుతున్నారు. నవంబరు నెల రేషన్ ప్రక్రియ శనివారం నుంచి ప్రారంభమైందని, కందిపప్పు వస్తే అందజేస్తామని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి శంకరన్ తెలిపారు.

# ఇంటి నుంచే విద్యుత్తు సేవలు




చిత్తూరు :విద్యుత్తు వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేందుకు ఏపీఎస్పీడీసీఎల్ ప్రత్యేక యాప్‌ను ప్రవేశపెట్టింది. ఆండ్రాయిడ్ చరవాణుల్లో ప్లేస్టోర్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. దీనిద్వారా వచ్చిన సమస్యలను విద్యుత్తు శాఖ అధికారులు పరిశీలించి సత్వరం పరిష్కరిస్తారు.

**బిల్లు చెల్లించొచ్చు:** విద్యుత్తు బిల్లులు చెల్లించేందుకు బిల్‌పే ద్వారా సర్వీసు నంబరు, చరవాణి నంబరు పొందుపరిస్తే సంబంధించిన వివరాలు ప్రత్యక్షమవుతాయి.

**నూతన కనెక్షన్ :** నూతన కనెక్షన్ కోసం సమగ్ర వివరాలను యాప్‌లో పొందుపరచాల్సి ఉంటుంది. అధికారులు పరిశీలించి కనెక్షన్ ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటారు.

**మొబైల్ లింకింగ్ :** విద్యుత్తు వినియోగదారులు తమ విద్యుత్తు కనెక్షన్‌కు సంబంధించి చరవాణి నంబరును అనుసంధానిస్తే విద్యుత్తు బిల్లుల సమాచారం చరవాణికి అందుతుంది.

**ఎనర్జీ కాలిక్యులేటర్ :** ఏఏ ఉపకరణానికి ఎంత విద్యుత్తు ఖర్చవుతుందో దీని ద్వారా తెలుసుకోవచ్చు. నెలవారీ విద్యుత్తు వినియోగానికి సంబంధించిన మీటరు రీడింగ్ వివరాలు పొందుపరిస్తే బిల్లు సమాచారం కనిపిస్తుంది.

**కస్టమర్ కేర్:** వినియోగదారులు తమ సమస్యలను ఇందులో పొందుపరచొచ్చు. అందిన సప్లై వివరాలు, అవసరమైన అన్ని లింకులు ఇందులో పొందుపరిచి ఉంటాయి.

**ఫీడ్ బ్యాక్:** విద్యుత్తు శాఖ అందిస్తున్న సేవలపై అభిప్రాయాలు పంచుకోవచ్చు.

**కన్‌జంప్షన్:** వినియోగదారులు వాడిన యూనిట్లు.. చెల్లించాల్సిన నగదు.. బిల్ లెడ్జర్ వివరాలు అందుబాటులో ఉంటాయి.

**పేమెంట్ హిస్టరీ :** వినియోగదారులు నెలవారీగా చెల్లించిన విద్యుత్తు బిల్లుల సమాచారం ఇందులో ఉంటుంది.

**ఎనర్జీ సేవింగ్స్ టిప్స్ :** విద్యుత్తు ఉపకరణాలు వాడుతున్నప్పుడు ఆచరించాల్సిన పొదుపు సూచనలు విపులంగా ఉంటాయి.

**పే బిల్:** సర్వీసు నంబరు నమోదు చేసుకుని నెలవారీ విద్యుత్తు బిల్లులకు సంబంధించిన నగదు చెల్లించొచ్చు.

**అధికారుల వివరాలు :** వినియోగదారుల పరిధిలోని అధికారుల ఫోన్ నంబర్లు లభ్యమవుతాయి. ఫోన్ చేసి సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు.

**టారిఫ్ :** వినియోగదారులకు సంబంధించిన టారిఫ్ వివరాలు ఇందులో పొందుపరిచి ఉంటాయి.

**క్విక్‌పే :** సర్వీసు నంబరు, చరవాణి నంబరును నమోదు చేస్తే సంబంధిత బిల్లు వివరాలు వస్తాయి. అక్కడినుంచి బిల్లు చెల్లించొచ్చు.

# రూ.కోట్లతో భవనం.. సేవలు అధమం!




అనంతపురం : వైకాపా పాలకుల నిర్వాకంతో ఆసుపత్రి నిర్వహించాల్సిన భవనంలో డీసీహెచ్‌ఎస్ కార్యాలయం కొనసాగుతోంది. కోట్లాది రూపాయలతో అనంతపురంలోని పాతూరులో ఛాతి వ్యాధుల వైద్యశాలను నిర్మించారు. 80శాతం పనులు పూర్తిచేసి హడావుడిగా 2023, సెప్టెంబరులో ప్రారంభించారు. సదరు భవనంలో ఎంఆర్ఐ, సిటీస్కాన్ తదితర పరీక్షలు నిర్వహించేందుకు ప్రత్యేక గదులను నిర్మించారు. ఎక్స్‌రే మినహా సిటీస్కాన్, ఎంఆర్ఐ యంత్రాలు అందుబాటులో లేని దుస్థితి. కాగా రక్త పరీక్షలు పూర్తిస్థాయిలో ఇప్పటికీ అందుబాటులో లేవు. ఆపరేషన్ థియేటర్ గది నిర్మించినా పరికరాలు కేటాయించని పరిస్థితి. తగిన సదుపాయాలు లేకపోవడంతో సగం పడకలే అందుబాటులో ఉన్నాయి.

రోగుల సహాయకులు ఉండేందుకు పెద్దషెడ్, యోగా భవనాన్ని నిర్మించినా ఇప్పటి వరకు ప్రారంభించలేదు. కనీసం ఆసుపత్రి అభివృద్ధి కమిటీని ఏర్పాటు చేయకపోవడం గమనార్హం.

వైద్యశాల నిర్వహణకు ఎలాంటి ప్రత్యేక బడ్జెట్ లేదు.

ఎన్‌టీఆర్ వైద్యసేవ కింద రోగులకు చేసే చికిత్సకు సంబంధించి ప్రభుత్వం విడుదల చేసే నిధులతోనే నెట్టుకొస్తుండటం గమనార్హం. వైద్యసామగ్రికి రూ.50 లక్షలు కేటాయించినా ఇప్పటిదాకా సరఫరా చేయని దుస్థితి.

రోగులకు సిటీ స్కాన్, ఎంఆర్ఐ అవసరమైతే సర్వజన వైద్యశాలకు పంపుతున్నారు. ప్రస్తుతం జనరల్ మెడిసిన్, పల్మనాలజి విభాగాలు మాత్రమే నిర్వహిస్తున్నారు.

రెండు విభాగాల్లో మొత్తం తొమ్మిది మంది వైద్యులకుగాను ఏడుగురే ఉన్నారు. భవనంలోని సగ భాగం ఎలాంటి కార్యకలాపాలు సాగటం లేదు. కింది భాగంలో జిల్లా ఆసుపత్రుల సమన్వయకర్త (డీసీహెచ్‌ఎస్) కార్యాలయం నిర్వహిస్తున్నారు. పైభాగంలోని గదులన్నీ ఖాళీగానే ఉన్నాయి.

**ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం**

– డాక్టర్ నవీన్, వైద్యాధికారి

నిధుల కోసం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. హెచ్‌డీఎస్ కమిటీ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని నివేదించాం. రెండు విభాగాల ద్వారా రోగులకు సేవలు అందిస్తున్నాం.


**పది శాతం పనులు చేయాల్సి ఉంది**– నవీన్, ఈఈ, ఏపీఎంఎస్ఐడీసీ

భవనానికి సంబంధిచి 90శాతం పనులు పూర్తయ్యాయి. అధికారులకు అప్పగించాం. వైద్యసామగ్రి రావాల్సి ఉంది. ప్రస్తుతం కొన్ని పనులే పెండింగ్ ఉన్నాయి.

# పగలు తవ్వకం.. రాత్రి అమ్మకం

శింగనమల : శింగనమల నియోజకవర్గంలో ఇసుకాసురులు బరితెగిస్తున్నారు. తరచు పోలీసులు, రెవెన్యూ అధికారులు ఇసుక వాహనాలపై దాడులు చేస్తున్నా అక్రమ రవాణా ఆగడం లేదు. పగటి పూట పోలీసులు, రెవెన్యూ అధికారులు రహదారులపై నిఘా వేస్తుండటంతో అక్రమార్కులు వారిని తప్పుదోవ పట్టించేందుకు పథకం పన్నారు. ఇందులో భాగంగా పగలంతా చీలేపల్లి సమీప వాగులో హిటాచీలు, జేసీబీ యంత్రాలతో ఇసుక తవ్వి కుప్పలుగా వేసుకుంటున్నారు. అర్ధరాత్రి వేళల్లో తవ్విన ఇసుకను టిప్పర్లకు నింపుకొని అనంతపురం నగరం, ఇతర పట్టణాలకు తరలించి, అమ్మేసుకొని సొమ్ము చేసుకుంటున్నారు.

**రోజుకు 15 టిప్పర్లపైనే...** ప్రతి రోజూ రాత్రుల్లో వాగు నుంచి 15 టిప్పర్లపైనే ఇసుక తరలిస్తున్నట్లు గ్రామస్థులు చెబుతున్నారు. ఒక్కో టిప్పరు ఇసుక రూ.12వేలు నుంచి రూ.15వేలు పలుకుతోందని, విలువ దాదాపు రూ.2 లక్షలపైనే ఉంటుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళల్లో అధికారుల, పోలీసుల నిఘా ఉండదన్న ధైర్యంతో అక్రమార్కులు ఈ పంథా ఎంచుకున్నారని, గ్రామీణ రోడ్లపై టిప్పర్లు



వేగంగా దూసుకెళుతుండటంతో ఇళ్ల నుంచి బయటకు రావాలంటేనే భయమేస్తోందని స్థానికులు వాపోతున్నారు. ఇకనైనా పోలీసులు, రెవెన్యూ అధికారులు రాత్రి వేళల్లో గస్తీ పెంచి ఇసుక అక్రమ రవాణా అరికట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు. దీనిపై న్యూస్‌టుడే తహసీల్దారు శేషారెడ్డిని వివరణ కోరగా స్పందించారు. రాత్రిపూట వాగు సమీప గ్రామాల్లో రెవెన్యూ సిబ్బందితో గస్తీ ఏర్పాటు చేసి ఇసుక అక్రమ రవాణా అరికడతామని వెల్లడించారు.

# పుర గొంతులో గరళగంగ

కర్నూలు : ఒక నగరపాలకం.. తొమ్మిది పురపాలికలు.. 18 లక్షల మంది నివాసం.. వీరికి నిత్యం 240–250 ఎంఎల్‌డీల నీరు అందించాల్సి ఉండగా 220 ఎంఎల్‌డీలు సరఫరా చేస్తున్నారు.. నిర్వహణకు ఏటా రూ.కోట్లు వెచ్చిస్తున్నారు.. శుద్ధి పేరిట నిధులు మింగేస్తున్నారు.. ప్ర‘జల’ గొంతులో గరళం నింపుతున్నారు.

ఈ చిత్రం శరీన్‌నగర్ పరిధిలోనిది. మంచినీరు సరఫరా చేసినప్పుడు మొదట్లో నీరు కలుషితంగా వస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. మట్టితో కూడిన నీరు వస్తోందని ఆవేదన చెందుతున్నారు. నీరు సైతం దుర్వాసన వస్తోందని.. శుద్ధజలం అందించాలని కోరుతున్నారు.

**లీటరుకు రూ.6 ఖర్చు**

ఉమ్మడి కర్నూలు జిల్లాలోని మున్సిపాలిటీల్లో 1,87,398 కుళాయి కనెక్షన్లు ఉన్నాయి. నీటి పన్ను ద్వారా ఏటా రూ.22 కోట్ల వరకు మున్సిపాలిటీలకు ఆదాయం సమకూరుతోంది.

నీటి సరఫరా నిర్వహణకు రూ.38 కోట్లు వెచ్చిస్తున్నారు. ఒక్క ఎం.ఎల్. నీటిని శుద్ధి చేసేందుకు.. క్లోరినేషన్ (200 ఎం.ఎల్. నీటికి 900 కిలోల క్లోరిన్ సిలిండర్ అవసరం.. దీని విలువ రూ.23 వేలు).

ప్రతి లక్ష మంది జనాభాకు సరాసరిన 13–14 ఎం.ఎల్. (ఒక ఎం.ఎల్. = పది లక్షల లీటర్లు) నీరు అవసరం.

**రూ.కోట్లు పక్కదారి**

కర్నూలు నగరపాలక సంస్థతోపాటు పురపాలక సంఘాల్లో నీటి శుద్ధి పేరుతో ఏటా రూ.40 కోట్ల వరకు ఖర్చు చేస్తున్నారు.

ఆలమ్, విద్యుత్తు తదితరాలు కలిపి రూ.34 వేల వరకు ఖర్చవుతుంది. ఒక లీటరు నీటిని శుద్ధి చేసేందుకు రూ.5–6 వరకు వ్యయమవుతుంది. ఆలమ్, క్లోరిన్ సిలిండర్లు, బ్లీచింగ్ తదితరాల పేరుతో రూ.లక్షలు ఖర్చు చేస్తున్నట్లు లెక్కలు రాసుకొంటున్నారు.

పురపాలక సంఘాల్లో 500 కి.మీ.కుపైగా ప్రధాన నీటి సరఫరా గొట్టాలు విస్తరించి ఉన్నాయి. దశాబ్దాల కిందట వేసిన పైపులైన్లు కావడం.. కాలం తీరినా మార్చకపోవడంతో దెబ్బతిని లీకేజీలు ఏర్పడుతున్నాయి. లీకేజీల నివారణ పేరుతో రూ.కోటికిపైగా ఖర్చు చేస్తున్నారు.



కనిపించని చిత్త‘శుద్ధి’

ప్రధానంగా పురపాలికల సంఘాల పరిధిలో నీటి శుద్ధి చేసే ప్లాంట్లదే కీలకపాత్ర. ఏటా వీటిని శుభ్రం చేయాల్సి ఉంటుంది. కుంటలోని ఇసుకను తొలగించి రెండు.. మూడు రోజులపాటు ఆరబెట్టాలి. తర్వాత కొత్త ఇసుకతో నింపాలి. ఆదోని లాంటి పురపాలక సంఘాల పరిధిలో రూ.30 లక్షల వరకు ఖర్చవుతుంది. కర్నూలులో రూ.50 లక్షలు.. నంద్యాలలో రూ.40 లక్షల పైమాటే.. చాలాచోట్ల వీటిని సవ్యంగా చేయడం లేదు. పైపై పనులు చేసి నిధులంతా పెద్దఎత్తున స్వాహా చేస్తున్నారు.

| ప్రాంతం | కుళాయిలు |
| --- | --- |
| కర్నూలు | 80,000 |
| ఆదోని | 24,500 |
| గూడూరు | 2,300 |
| ఎమ్మిగనూరు | 14,955 |
| నంద్యాల | 32,400 |
| డోన్ | 9,182 |

# వేగానికి వేద్దాం కళ్లెం

తిరుపతి : ప్రైవేట్ బస్సుల వేగం అనేక కుటుంబాల్లో అంధకారం నింపుతోంది. పెద్ద ఘటనలు జరిగి తనిఖీల హడావుడి నెలకొన్నప్పుడు దాక్కోవడం.. తరువాత ఉల్లంఘనలు కొనసాగించడం వాటి యాజమాన్యాలకు పరిపాటిగా మారింది. సాంకేతికత అభివృద్ధి చెందుతున్నప్పటికీ రవాణా శాఖాధికారులు నేరుగా పట్టుకుని కేసులు నమోదు చేయడంపైనే దృష్టి సారిస్తున్నారు.

పుణ్యక్షేత్రం తిరుపతి నుంచి హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, విజయవాడ, మదురై, కోయంబత్తూరుకు నిత్యం 50 – 60 ప్రైవేటు బస్సులు రాకపోకలు సాగిస్తున్నాయి. వాటిలో సుమారు మూడువేల మంది ప్రయాణిస్తుంటారు. శ్రీవారి దర్శనార్థం భక్తులు, పర్యాటకులు, విద్యార్థులు, వ్యాపారులు వాటిపై ఎక్కువగా ఆధారపడుతున్నారు.

**ప్రమాదాలప్పుడే పరిశీలన**

తిరుపతి నుంచి విజయవాడ బయలుదేరిన బస్సు మేర్లపాక టోల్‌గేట్ వద్దకు ఎన్ని గంటలకు వెళ్లింది.. ఆ తర్వాత భూదానం టోల్‌ప్లాజా వద్దకు ఎన్ని గంటలకు వెళ్లిందనే సాంకేతికత ఆధారాలతో కేసులు నమోదు ప్రక్రియ అందుబాటులోకొస్తే అతివేగాన్ని నియంత్రించవచ్చు.

**మొక్కుబడిగా స్పీడ్ గన్‌ల వినియోగం**

జిల్లాలో స్పీడ్ గన్‌ల వినియోగం సైతం మొక్కుబడిగా మారడంతో సాధారణ జరిమానాలు లెక్కచేయకుండా దూసుకెళ్తున్నారు.

ఈ మార్పులు అవసరం

టోల్‌గేట్లను మరింత ఆధునికీకరించడం. సాంకేతికత ఆధారంగా వేగం లెక్కించడం. ఉల్లంఘించిన వాహనాలను ఎక్కడికక్కడ అనుమతించకపోవడం.

చెక్‌పోస్టుల్లో బ్రీత్ అనలైజర్లు ఏర్పాటు చేయడం.

జాతీయ రహదారులపై స్పీడ్ లేజర్ గన్‌లతో నిఘా పెట్టడం. వాటిని కమాండ్ కంట్రోల్ ద్వారా అడ్డుకోవడం. ఆటోమేటిక్ ఎలక్ట్రానిక్ చెక్‌రిపోర్ట్ జనరేట్ చేసే వ్యవస్థను తీర్చిదిద్దడం.

కర్నూలు దుర్ఘటన తర్వాత కేసులు

బస్సుల సీజ్ : 14

జరిమానాలు : 52

జనవరి–సెప్టెంబరు వరకు : 650

# పార్ట్‌టైం ఉద్యోగం.. ఫుల్‌టైం మోసం

చిత్తూరు :ఉద్యోగం చేస్తున్నా సరే.. ఖాళీ సమయంలో గంట సమయం కేటాయిస్తే చాలు. రోజూ రూ.వేలల్లో ఆదాయం మీ సొంతం...! ఇలాంటి ప్రకటనలు ఆన్‌లైన్‌లో.. వాట్సాప్‌లో తరచూ చూస్తుంటాం. నిజమేనని ఆశపడి క్లిక్ చేశామా..? రోజూ రూ.వేలల్లో సంపాదన పక్కనపెడితే.. క్షణాల్లో రూ.లక్షలు మాయమవుతాయి. సైబర్ నేరగాళ్లు పార్ట్ టైమ్ ఉద్యోగాల పేరుతో రూ.వందల కోట్లు కాజేస్తున్నారు. కరోనా తర్వాత వర్క్ ఫ్రమ్ హెూమ్ విధానం మొదలైంది. దీనికితోడు ఇంటిదగ్గరే ఉంటూ డేటా ఎంట్రీ, ఇతర పనిచేసుకోవచ్చంటూ అనేక సంస్థలు ఉద్యోగ ప్రకటనలు ఇచ్చాయి. ఈ క్రమంలోనే సైబర్ నేరగాళ్ల పార్ట్‌టైమ్ ఉద్యోగాల దందా మొదలుపెట్టారు. ఉదాహరణకు హెూటళ్లు, రెస్టారెంట్లకు రివ్యూలు ఇవ్వాలని, యూట్యూబ్‌లో వీడియోలకు లైకులు, కామెంట్లు పెడితే డబ్బులిస్తామని టాస్కుల పేరుతో మోసగించడం ఈ కోవలోకే వస్తుంది. తొలుత యూట్యూబ్ ఛానెళ్ల సబ్‌స్క్రైబ్, వీడియోలకు లైకుల పేరుతో టాస్కులు పూర్తి చేస్తే డబ్బులిస్తామని ఆశపెడతారు.

**ఎలా తప్పించుకోవాలి..?**



ఈ వర్క్ ఫ్రమ్ హెూం, పార్ట్ టైమ్ ఉద్యోగాల పేరుతో జరిగే మోసాల్లో బాధితులు ఎక్కువ మంది సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు, గృహిణులు ఉంటున్నారు. – గృహిణులు ఇంటి ఖర్చులకు పనికొస్తాయని, భర్త సంపాదనకు చేదోడుగా ఉండొచ్చనే ఉద్దేశంతో సైబర్ నేరగాళ్ల వలకు చిక్కుతున్నారు. – సామాజిక మాధ్యమాల్లో వర్క్ ఫ్రమ్ హెూమ్ పేరుతో వచ్చే ప్రకటనల్ని నమ్మకూడదు– వ్యాపార సంస్థలు ఇలాంటి ప్రకటనలు ఇవ్వవు. సంప్రదించాలంటూ ఫోన్ నంబర్లు పెట్టవు.– ఏం సంస్థ కూడా బ్యాక్‌డోర్ ఉద్యోగాలను ప్రోత్సహించదు. అందుకే ముఖాముఖి లేకుండా ఉద్యోగాలంటే నమ్మొద్దు.– కచ్చితంగా సంస్థల అధికార వెబ్‌సైట్లలో తనిఖీ చేసుకోవాలి. అవసరమైతే నేరుగా సంస్థ కార్యాలయానికి వెళ్లి ఆరా తీయాలి.

**ఒకవేళ మోసపోతే..**

ఉద్యోగం పేరుతో మోసగిస్తే ఆలస్యం చేయకుండా 1930 టోల్‌ఫ్రీకి, స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలి. ౖ బాధితులు వందలు, వేల సంఖ్యలో బాధితులు ఉంటారు. వీటిని బహిర్గతం చేస్తేనే నేర నియంత్రణ సాధ్యమవుతుంది. చిత్తూరు

# చిత్తూరుకిచ్చింది.. నీళ్లా.. కన్నీళ్లా

తిరుపతి : వర్షాధారిత ఉమ్మడి చిత్తూరు జిల్లాలో చెప్పుకోవడానికి భారీ సాగునీటి ప్రాజెక్టులు అంటూ ఏమీ లేవు. మధ్య తరహా రిజర్వాయర్లు అంతంతమాత్రమే. 2014–19 మధ్య తెదేపా పాలనలో హంద్రీ – నీవా సుజల స్రవంతి ప్రాజెక్టులో భాగంగా అడవిపల్లె రిజర్వాయర్ పూర్తి చేశారు.

గత పాలనలో కుప్పం, పుంగనూరు, పూతలపట్టు నియోజకవర్గాల్లో రిజర్వాయర్ల నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించారు. తిరుపతి జిల్లాలో అరణియార్ ప్రాజెక్టు ఆధునికీకరణకు హామీ ఇచ్చి అటకెక్కించారు. దాంతో అడపాదడపా వరదలు వచ్చిన సమయంలో నీరంతా వృథాగా తమిళనాడుకు వెళ్తోంది. ఒక్క 2020లో 22 టీఎంసీలు జిల్లా దాటి పోయాయి. ఈ ప్రభుత్వం స్పందించి గతంలో ప్రతిపాదించిన జలాశయాలను పూర్తిచేస్తే అటు హంద్రీ–నీవా నీరు, ఇటు వరద జలాలను నిల్వ చేసుకోవచ్చు.

**చామంతిపురం వద్ద 5 టీఎంసీలతో..**

పూతలపట్టు మండలం చామంతిపురం వద్ద ఏకంగా అయిదు టీఎంసీలతో రూ.3 వేల కోట్లతో రిజర్వాయర్ నిర్మిస్తామని జగన్ సర్కారు తెలిపినా ఒక్క అడుగూ ముందుకు పడలేదు. దీని ద్వారా గంగాధరనెల్లూరు, పూతలపట్టు నియోజకవర్గాల్లో 80 వేల ఎకరాల ఆయకట్టుకు నీరందిస్తామని హామీ ఇచ్చారు.ప్రస్తుతం సాధ్యాసాధ్యాలను పరిశీలించి నూతన జలాశయాలకు ఆమోదం తెలిపితే రైతులకు ఉ



పయోగకరంగా ఉంటుంది.

**పాలనా అనుమతులే..**

ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందు గుడుపల్లె మండలం యామగానిపల్లెలో 0.710 టీఎంసీలు, శాంతిపురం మండలం మాదనపల్లిలో 0.354 టీఎంసీల సామర్థ్యంతో రూ.535.435 కోట్లతో రిజర్వాయర్ల నిర్మాణానికి జగన్ ప్రభుత్వం పాలనా అనుమతులు మంజూరు చేసింది. ఐదు వేల ఎకరాలకు నీరందిస్తామని ప్రకటించారు.

**మల్లెమడుగు.. పడని అడుగు**

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో తూర్పు ప్రాంతాలకు జీఎన్‌ఎస్‌ఎస్ ప్రాజెక్టు నుంచి నీరందించవచ్చు. రేణిగుంట మండలంలోని మల్లెమడుగు సామర్థ్యం 0.181 టీఎంసీలు కాగా.. 3,950 ఎకరాలకు నీరందుతోంది. ఇందులో 2.69 టీఎంసీలు నిల్వ చేసేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. రూ.280 కోట్లు అవుతుందని అంచనా వేశారు. దీనికి ప్రభుత్వం నుంచి పాలనా అనుమతులు రావాలి. అరణియార్ ఆధునికీకరణకు రూ.35.64 కోట్ల జైకా నిధులు మంజూరైనా కుడి కాలువ, నల్లచెరువు కాలువ పనులు ఇంకా కాలేదు. వీటికి త్వరగా నిధులు విడుదల చేస్తే మూడేళ్లలో పనులు ఓ కొలిక్కి వస్తాయి.

# పీలేరును పీల్చేసినా ఏవీ చర్యలు!



పీలేరు : గత వైకాపా ప్రభుత్వంలో కొందరు నేతలు ఇష్టారాజ్యంగా చెలరేగారు. జగనన్న కాలనీల పేరుతో భారీ ఆక్రమణలకు పాల్పడ్డారు. అనర్హులు, తమ అనుచరులకు ఇళ్ల స్థలాలను అడ్డగోలుగా రాసిచ్చారు. గృహ నిర్మాణ శాఖ నుంచి మంజూరుతో పని లేకుండా బహిరంగ సమావేశాలు నిర్వహించి పప్పు బెల్లాల్లా పట్టాలు పంపిణీ చేశారు. అర్హులైన పేదల ఆశలకు సమాధి కట్టారు. ఇవన్నీ నిజమే అని అధికారులూ నిర్ధారించారు. అయినా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోకుండా చోద్యం చూస్తున్నారు.

**పేదల ముసుగులో పాగా**

పీలేరు పారిశ్రామికాభివృద్ధికి అప్పటి ముఖ్యమంత్రి నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి రూ. 4 కోట్ల వ్యయంతో 250 ఎకరాల ప్రైవేట్ భూములు, 500 ఎకరాల ప్రభుత్వ, డీకేటీ భూములను సేకరించి ఏపీఐఐసీకి అప్పగించారు. 2014 తర్వాత తెదేపా హయాంలో ఆయా స్థలాల్లో రూ.10 కోట్ల వ్యయంతో మౌలిక వసతులు కల్పించారు. 2019 అనంతరం వైకాపా అధికారంలోకి రాగానే కొందరు నేతలు వీటిపై కన్నేశారు. పేదల ముసుగులో పాగాకు తెర లేపారు. ఈ క్రమంలోనే ఇళ్ల స్థలాల పేరుతో ఏపీఐఐసీ లేఅవుట్– 1లో 1,118, ఏపీఐఐసీ లేఅవుట్–2లో 2,500, ఏపీఐఐసీ లేఅవుట్– 3లో 2,300, ఏపీఐఐసీ లేఅవుట్–4లో 2,500 పట్టాలు కేటాయించారు. గూడరేవుపల్లె పంచాయతీ పరిధి పీలేరు– తిరుపతి మార్గం ఆనుకుని ఉన్న నూనె విత్తుల కర్మాగారం లేఅవుట్‌లో 1,146, కంకర ఫ్యాక్టరీ లేఅవుట్‌లో 689 పట్టాలు పంపిణీ చేశారు. లబ్ధిదారుల్లో పలువురు అనర్హులే ఉండటం గమనార్హం.

**నివేదికలతో సరి**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పీలేరు మండల పరిధిలోని మొత్తం పది లేఅవుట్‌లను అధికారులు పరిశీలించారు. లబ్ధిదారుల జాబితాలను జల్లెడ పట్టారు. మొత్తం 3,600 మంది అక్రమంగా పట్టాలు పొందినట్లు తేల్చారు. తిరుపతి మార్గంలోని నూనె విత్తుల కర్మాగారం లేఅవుట్, కంకర ఫ్యాక్టరీ లేఅవుట్, ఏపీఐఐసీ లేవుట్– 3, ఏపీఐఐసీ లేఅవుట్– 4లో అధికంగా అక్రమార్కులు చోటుచేసుకున్నట్లు గుర్తించారు. ఇంతవరకు బాగానే ఉంది. ఆ తర్వాత ఎలాంటి చర్యలు లేకపోయాయి. ఈ విషయమై రాయచోటి ఆర్డీవో శ్రీనివాసులు మాట్లాడుతూ.. పీలేరు జగన్న కాలనీల్లో వెలుగుచూసిన అక్రమాల నివేదికను ఉన్నతాధికారులకు పంపామని.. అక్కడి నుంచి అందే ఆదేశాల మేరకు చర్యలుంటాయని తెలిపారు.

# చూసే నయనం.. చీకటిలోకి పయనం!



అనంతపురం : చిన్నపిల్లలు మొదలు, పెద్దల వరకూ సెల్‌ఫోన్ వాడకం పెరిగింది. గృహాల్లో టీవీలకు దగ్గరగా ఉంటూ సినిమాలు, సీరియల్స్ చూస్తున్నారు. నయనాలకు విశ్రాంతి లేక సమస్యలు వస్తున్నాయి. ఇప్పటికీ కళ్లను సంరక్షించుకోవటంలో చాలామంది నిర్లక్ష్యం చూపుతున్నారు. ఇది ఆందోళనకర అంశం. కంటి చూపు విషయంలో జాగ్రత్తలు తీసుకోకపోతే భవిష్యత్తులో ఇబ్బందులు తప్పవని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ప్రపంచ దృష్టి దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

కళ్ల సమస్యలున్న పిల్లలను గుర్తించి వారికి సకాలంలో చికిత్సలు అందించటం, అవసరమైన అద్దాలను ప్రభుత్వం ఉచితంగా అందజేస్తోంది. ఇందుకోసం జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో పాఠశాలల్లో చిన్నపిల్లలకు కంటి పరీక్షలను నిర్వహిస్తున్నారు. పెద్దల్లో కంటి సమస్యలు తలెత్తితే వారికి ప్రభుత్వ ఆసుపత్రులతోపాటు ఎన్టీఆర్ వైద్యసేవలు అందించే ప్రైవేట్ ఆసుపత్రుల్లో శస్త్రచికిత్సలను ప్రభుత్వం ఉచితంగా చేయిస్తోంది.

**అలవాట్లు.. ఆటుపోట్లు**

గంటల తరబడి సెల్‌ఫోన్, టీవీ చూడటం, సమయానుగుణంగా నిద్రలేకపోవటం, కళ్లకు విశ్రాంతి ఇవ్వకుండా వాహనాలు నడపటం, గంటల తరబడి ల్యాప్‌టాప్, కంప్యూటర్లు చూస్తూ గడిపేయడం, సరైన ఆహారపు అలవాట్లు పాటించకపోవటం, పోషకాలున్న ఆహారం, ఆకుకూరలు తినకపోవటం వంటి కారణాలతో వివిధ రకాల కంటి సమస్యలు తలెత్తుతాయని వైద్యులు చెబుతున్నారు.

పుస్తకాలు, బోర్డులో ఉన్న అక్షరాలు కనిపించకపోవటం, కళ్ల నొప్పి, మంటలు, మసకగా అక్షరాలు కనపడటం వంటి సమస్యలున్న కేసులు ఉమ్మడి అనంతపురం జిల్లాల్లో పెరుగుతూనే ఉన్నాయి. ప్రస్తుత అంచనా ప్రకారం ప్రతి పదిమందిలో ఒకరికి దృష్టి సమస్య ఉన్నట్లు వైద్యులు చెబుతున్నారు. ఇలానే కొనసాగి.. ప్రతి ఐదుగురిలో ఒక్కరికి దృష్టిలోపం తలెత్తే ప్రమాదకర స్థితికి వెళ్తుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

**జాగ్రత్తలు పాటించాల్సిందే..**

– డాక్టర్ సైదన్న, అంధత్వ నివారణ సంస్థ అధికారి, అనంతపురం జిల్లా

పిల్లలకు సెల్‌పోన్‌లు ఇవ్వకూడదు. ఎక్కువ సేపు పిల్లలు ఇతర పిల్లలతో ఆడుకునేలా చూడాలి. వారికి ఆట వస్తువులు ఇవ్వాలి. ఎక్కువసేపు సెల్ చూడటం ద్వారా మెడ, వెన్నెముకలో సమస్యలు వస్తాయి. మానసిక ఒత్తిడి పెరుగుతుంది. మంచి వెలుతురులోనే చదువుకోనివ్వాలి.. ఆరునెలలకోసారి కంటి పరీక్షలు చేయించుకోవాలి. వైద్యుల సూచన మేరకు మాత్రమే కంటి మందులు వాడాలి. జిల్లావ్యాప్తంగా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో కళ్లను కాపాడుకునేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవాలన్న అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

గత ఏడాది అనంతపురం జిల్లాలో పాఠశాల స్థాయిలో కంటి సమస్యలు తేలిన విద్యార్థుల సంఖ్య 2743

ఈఏడాది 5 నెలల వ్యవధిలోనే కంటి సమస్యలు ఉన్న చిన్నారులు (ఏడాది మొత్తంగా చూస్తే ఈ సంఖ్య రెట్టింపు అయ్యే ఆస్కారం ఉందని అంచనా) 1372

# పెన్నహెూబిలం ఆలయ అభివృద్ధిపై నీలినీడలు



ఉరవకొండ : ఉరవకొండ మండలంలో ఉన్న పెన్నహెూబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయం అభివృద్ధిపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఈ ఆలయాన్ని ఏటా 1.5 లక్షలకుపైగా భక్తులు దర్శించుకుంటారు. ఆలయానికి 2,134 ఎకరాల భూమి ఉంది. అందులో 1,556 ఎకరాలు కౌలుకు ఇచ్చారు. వాటితోపాటు హుండీల ద్వారా ఏటా రూ.కోటికి పైగా ఆదాయం వస్తుంది. అయితే దశాబ్దాలు గడుస్తున్నా అభివృద్ధి శూన్యం. భక్తులకు కనీస సదుపాయాలు కరవే. ఆలయ పరిసరాల్లో దాతలు నిర్మించిన గదులే దిక్కు. వాటిలో చాలా మండపాలు శిథిలం అయ్యాయి. భక్తుల రద్దీకి అనుగుణంగా గదులు నిర్మించలేదు. వారాంతాలు, ప్రత్యేక రోజులు, బ్రహ్మోత్సవాల సమయాల్లో గదుల కొరత వేధిస్తుంది. కనీసం మరుగుదొడ్లు లేవు. తాగునీటి సదుపాయం అంతంత మాత్రమే. మాడవీధుల్లో చెప్పుకోదగిన అభివృద్ధి లేదు.

**పట్టించుకునేదెవరు?**

ఆలయ అభివృద్ధిపై దేవదాయ అధికార యంత్రాంగం కనీసం దృష్టి సారించడం లేదు. ఇక్కడ పని చేసే అధికారులు తమ సీటును కాపాడుకోవడానికి ఇస్తున్న ప్రాధాన్యం ఆలయ అభివృద్ధిపై పెట్టడం లేదు. భక్తులు రూ.కోటి విరాళం ఇస్తే మూడేళ్లుగా శ్రీవారి నూతన రథాన్ని తయారు చేయించడంలో ఘోర విఫలం చెందారు. వారి మనోభావాలను గాలికి తోసేసి, కాలయాపన చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించుకునే ప్రయత్నాలు చేసింది లేదు.

**ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం..**

ఉన్నతాధికారుల సూచనలతో మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయాల మెరుగు, ఆలయం అంతా శ్యాండ్ బ్లాస్టింగ్ చేయించడానికి ఇంజినీరింగ్ అధికారులతో ప్రతిపాదనలు తయారు చేయిస్తున్నాం. పాలక మండలి ఏర్పాటు కాగానే వారి సహకారంతో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడానికి ప్రణాళిక రూపొందిస్తాం.రుమలరెడ్డి, ఆలయ ఈవో


# గ్రేటర్ తిరుపతి ప్రతిపాదనలు సిద్ధం

తిరుపతి : గ్రేటర్ తిరుపతి ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. కమిషనర్ ప్రభుత్వానికి సమర్పించనున్నారు. ఇది సాకారమైతే గ్రేటర్ పరిధి 300 చదరపు కిలోమీటర్లకు చేరుతుంది.

**వేగంగా విస్తరణ..**నగరపాలక సంస్థ పరిధి అధికారికంగా కేవలం 30.17 చ.కి.మీ.లు అయినా తిరుపతి గ్రామీణం, చంద్రగిరి, రేణిగుంట మండలాలు తిరుపతిలో అంతర్భాగంగానే ఉంటాయి. నగర పరిసరాలను పరిశీలిస్తే 300 చ.కి.మీ.ల మేర పట్టణ లక్షణాలు స్పష్టంగా కనిపిస్తాయి. అవన్నీ గ్రామాలే అయినా పట్టణ వాతావరణమే ఉంటుంది. కార్పొరేట్ ఆసుపత్రులు, విద్యా సంస్థలు, వాణిజ్య భవనాలు, విల్లాలు, షోరూమ్‌లు, బహుళ అంతస్తుల భవనాలతో నగరానికి 10 నుంచి 30 కి.మీ.ల మేర విస్తరించాయి.

**ప్రభుత్వానికి సమర్పించనున్న కమిషనర్**

తిరుపతి నగరపాలిక పరిధి విస్తరించాలన్న ఆలోచన 2010 నుంచే ఉంది. మౌలిక సదుపాయాల అభివృద్ధి, పట్టణ ప్రణాళిక, ఆర్థికాభివృద్ధిని విస్తృతం చేయడంలో గ్రేటర్ కీలకం కానుంది. తిరుపతి పరిసరాల్లో వాణిజ్య కార్యకలాపాలకు తగిన వసతులు లేకపోవడానికి కారణం మాత్రం అవి తక్కువ ఆదాయం వచ్చే పంచాయతీల పరిధిలో ఉండడమే. తిరుపతి గ్రేటర్ ప్రతిపాదనతో ఈ సమస్యకు పరిష్కారం లభించనుంది.**ఆమోదమే ఆలస్యం..**



అధికారులు సిద్ధం చేసిన గ్రేటర్ ప్రతిపాదనలకు ప్రభుత్వ అంగీకరించాలి. తరువాత ఆయా పంచాయతీలు తీర్మానం చేసి ఆమోదిస్తే విలీన ప్రక్రియ పూర్తవుతుంది.

గ్రేటర్ ప్రతిపాదిత పంచాయతీల సంఖ్య: 63

ప్రభావిత మండలాలు: తిరుపతి గ్రామీణ, చంద్రగిరి, రేణిగుంట, ఏర్పేడు నగరపాలిక పరిధి: 30.17 కి.మీ.

ప్రతిపాదిత పరిధి: 299 కి.మీ.

ఆదాయం: రూ. 151 కోట్లు

విలీనంతో వచ్చే ఆదాయం: రూ.33 కోట్లు

తిరుపతి నగర జనాభా: 4.52 లక్షలు

63 గ్రామాల జనాభా: 2.98 లక్షలు

# ఇనుము.. నాణ్యతకు చిలుము

కర్నూలు : సొంతిల్లు నిర్మించుకోవాలన్నది ప్రతి ఒక్కరి కల. పట్టణాల్లో చాలామంది.. తమ ఇళ్ల నిర్మాణాలను బిల్డర్లు, గుత్తేదారులు, బేల్దార్లకు అప్పగిస్తున్నారు. వారు ఐరన్ (స్టీల్) మర్చంట్ వ్యాపారులతో కుమ్మక్కై 'మూడో' రకం స్టీలు కొనుగోలు చేసి నాణ్యతకు తిలోదకాలిస్తున్నారు. ఒక సెంటు స్థలంలో ఇల్లు నిర్మించేందుకు 6 క్వింటాళ్లకుపైగా స్టీలు అవసరమవుతుంది. కొందరు బిల్డర్లు, గుత్తేదారులు మూడో రకం స్టీలును ఎక్కువగా వినియోగించి రూ.లక్షలు మిగిల్చుకుంటున్నారు.

**మూడో రకంతో ముడి**

కర్నూలు నగరంలో 150కిపైగా స్టీల్ (ఐరన్) మర్చంట్ దుకాణాలున్నాయి. కొన్ని దుకాణాల్లో నాసిరకం ఐరన్ విక్రయాలతోపాటు తూకాల్లో మోసాలకు పాల్పడుతున్నారు. ఇనుము దుకాణాలపై పర్యవేక్షణ కరవైంది. తూనికలు, కొలతల శాఖ అధికారులు తనిఖీలు చేసిన దాఖలాలు లేవు. క్వింటా స్టీలుకు 4–5 కిలోల వ్యత్యాసం ఉండేలా ఎలక్ట్రానిక్ వేయింగ్ యంత్రాల్లో మార్పులు చేస్తున్నారు. మూడో రకం స్టీలు తక్కువ బరువు ఉంటుంది. నాణ్యత ప్రమాణాలు కలిగిన స్టీలుతో పోలిస్తే కిలోకు రూ.2–3 తక్కువ ధరకు లభిస్తుంది.

**ప్రభుత్వ ఆదాయానికి గండి**

కొందరు వ్యాపారులు జీఎస్టీ లేకుండానే వ్యాపారాలు చేస్తున్నారు. మరికొందరు జీఎస్టీ నంబరు కలిగి ఉన్నప్పటికి రోజులో వంద క్వింటాళ్ల విక్రయాలు చేస్తే అందులో 20–30 క్వింటాళ్లను మాత్రమే జీఎస్టీ



పరిధిలో చూపుతూ మిగతా విక్రయాలను జీఎస్టీ నుంచి తప్పిస్తున్నారు. వాణిజ్య పన్నుల శాఖ అధికారులు మామూళ్లకు రుచిమరిగి అక్రమార్కులపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది.

**గుర్తించడం ఎలా..**

పట్టణ ప్రాంతాల్లో ఏటా కొత్తగా 5–10 శాతం, గ్రామీణ ప్రాంతాల్లో 1–2 శాతం మేర ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయి. పట్టణ ప్రాంతాల్లో ఒక్కో ఇంటికి రూ.10 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు వెచ్చిస్తున్నారు. నిర్మాణంలో కీలకమైన స్టీలు వినియోగంలో జాగ్రత్తలు తీసుకోవాలంటున్నారు గృహనిర్మాణ శాఖ ఇంజినీర్ చిరంజీవులు.

నాణ్యమైన స్టీలు బార్ ఉపరితలం నునుపుగా, పగుళ్లు, అతుకులు, తుప్పు లేకుండా బూడిద రంగంలో ఉండాలి.

స్టీలు బార్‌పై కంపెనీ లోగో స్పష్టంగా ఉండాలి. ఐఎస్ఐ, బీఐఎస్ ముద్రలు గమనించాలి. అన్ని చువ్వల పొడవు, బరువు ఒకేలా ఉండాలి. ఒక స్టీలు బార్ సాధారణంగా 11 నుంచి 12 మీటర్ల పొడవు ఉంటుంది. ఇందుకు భిన్నంగా ఉంటే సరైనది కాదు.

స్టీలు బార్లపై రింగుల్లా ఉండేవాటిని రిబ్స్ అంటారు. రిబ్స్ దగ్గరగా ఎత్తుగా ఉండాలి. ఇనుప చువ్వలను 135 డిగ్రీల కోణంలో వంచినప్పుడు వంగిన ప్రదేశంలో పగుళ్లు రాకూడదు. 180 డిగ్రీలు వంచితే విరిగిపోకూడదు.

# పూలకుంటను పూడ్చేశారు

నంద్యాల : భూతాలు చిన్ననీటి వనరులను 'చెర'బట్టాయి. మహానంది మండలంలో ఏకంగా చెరువునే మాయం చేశారు. బుక్కాపురం గ్రామ పరిధిలో 80 ఎకరాల్లో విస్తరించిన పూలకుంటను ఆనవాళ్లు మిగలకుండా ఆక్రమించారు. 'ఖద్దరు' అండతో అక్రమంగా పట్టాలు పొంది దర్జాగా అరటి తోటలు సాగు చేస్తున్నారు. దస్త్రాలు మాయం చేశారు. ఫలితంగా కేంద్ర జల వనరుల శాఖ ఆధ్వర్యంలో ప్రతి ఐదేళ్లకోసారి జరిగే చిన్ననీటి వనరుల సర్వేలో ఈ విషయం వెలుగులోకి వచ్చింది.

**ఏక్‌సాల్ పేరుతో పాగా**మహానంది మండలంలోని నల్లమల అడవుల్లో కురిసిన వర్షంనీటితో పూలకుంట చెరువు నిండేది. ఈ నీటితో బుక్కాపురం, పుట్టుపల్లె, తిమ్మాపురం, అబ్బీపురం గ్రామాల రైతులు తమ పొలాలు సాగు చేసుకునే వారు. తెలుగుగంగ ప్రాజెక్టు రావడంతో మండలంలోని పలు గ్రామాలకు సాగునీటి ఇబ్బందులు తీరాయి. ఈ క్రమంలోనే పూలకుంట చెరువు నల్లమల అటవీ ప్రాంతానికి మధ్య తెలుగుగంగ ప్రధాన కాల్వ నిర్మాణం జరిగింది. దీంతో ఈ నీళ్లు వచ్చే మార్గం లేక చెరువు ఎండిపోయింది. ఇదే అదనుగా అక్రమార్కులు రంగంలో దిగారు. రెవెన్యూ అధికారుల అండతో తొలుత చెరువు భూమిలో ఏక్‌సాల్ పట్టాలు తీసుకోవడం ప్రారంభించారు. పేదల పేరుతో కొందరు, రాజకీయ పలుకుబడితో మరికొందరు చెరువును పంచుకున్నారు.

**దస్త్రాలు ఏమయ్యాయి?**

పూలకుంట చెరువుకు సంబంధించిన దస్త్రాలు ప్రస్తుతం ఏ శాఖలోనూ కనిపించడం లేదు. కబ్జాకు పాల్పడిన వారిలో పెద్దలు, అధికారుల పాత్ర ఉండటంతో రెండు దశాబ్దాలుగా దీని దస్త్రాలను ఒక పద్ధతి ప్రకారం మాయం చేశారు. ఓ విశ్రాంత వీఆర్వో కీలకంగా వ్యవహరించి కొందరు రెవెన్యూ అధికారుల సాయంతో దస్త్రాలు కనిపించకుండా చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. చిన్ననీటి పారుదల శాఖ వద్ద చెరువుకు సంబంధించిన వివరాలు లేకపోవడం గమనార్హం. గతంలో అటవీ శాఖ వద్ద పూలకుంట వివరాలు ఉండగా.. ప్రస్తుతం వారి వద్ద అందుబాటులో లేనట్లు సమాచారం. ఏ శాఖ అధికారులను అడిగినా చెరువు ఉన్నట్లే తెలియదన్న విధంగా సమాధానం ఇస్తుండటం గమనార్హం.

**దొంగపట్టాలతో పంచిపెట్టారు**

పూలకుంట చెరువును కనుమరుగు చేయడంలో కొంతమంది రెవెన్యూ సిబ్బంది కీలకంగా వ్యవహరించారు. 20 ఏళ్ల కిందటే ఓ వీఆర్వో భారీగా డబ్బులు దండుకుని పలువురికి పట్టాలు ఇప్పించారు. మరికొందరు దొంగ పట్టాలతోనే ఆక్రమించారు. అక్రమార్కుల్లో తిమ్మాపురం, బుక్కాపురం, పుట్టుపల్లె, అబ్బీపురం, మహానందికి చెందిన నాయకులు కూడా ఉన్నారు. ఓ పోలీసు అధికారి సమీప బంధువులకు కూడా ఇందులో పట్టాలు ఉండటం గమనార్హం.

ప్రత్యేకించి 2000– 2007 సంవత్సరాల మధ్య ఇక్కడ పెద్ద ఎత్తున పట్టాలు పుట్టించారు. వీటిలో తహసీల్దార్లు ఇచ్చినవి కొన్ని ఉండగా.. గతంలో ఇక్కడ పనిచేసి ప్రస్తుతం ఉద్యోగ విరమణ చేసిన నలుగురు తహసీల్దార్ల పేర్లతో సృష్టించిన దొంగ పట్టాలు ఎక్కువగా ఉన్నాయి. గత కొన్నేళ్లుగా ఈ భూములకు రిజిస్ట్రేషన్లు కూడా జరుగుతున్నాయి. పక్కనే ఉన్న పట్టా భూముల సర్వే నంబర్లు వేసి ఈ భూములకు రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు. రిజిస్ట్రేషన్లతో చేతులు మారుతుండటంతో ఈ భూములకు విలువ కూడా పెరిగింది.

## కాజేస్తున్న వాటిని కనిపెట్టేస్తున్నారు

కడప : ప్రస్తుతం చరవాణి చోరులు చెలరేగి పోతున్నారు. బస్టాండ్లు, మార్కెట్లు, సినిమా థియేటర్లు, పర్యాటక ప్రాంతాలు ఇతర రద్దీ ప్రాంతాల్లో తమ హస్త లాఘవం ప్రదర్శిస్తున్నారు. సెల్‌ఫోన్లను పోగొట్టుకున్న పలువురు ఠాణాల మెట్లు ఎక్కుతున్నారు. ఈ క్రమంలో పోలీసులు కొన్నింటిని గుర్తించి బాధితులకు అందిస్తున్నారు. ఇందుకు గాను మిస్సింగ్ మొబైల్ ట్రాకింగ్ విధానం(ఎంఎంటీఎస్), సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటీ రిజిస్ట్రార్(సీఈఐఆర్)ను వినియోగిస్తున్నారు. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా ఆరు విడతల్లో రూ.9.11 కోట్ల విలువజేసే 4,670 చరవాణులను బాధితులకు అందజేశారు.



**పోగొట్టుకుంటే ఇలా చేయండి**

చరవాణిని పోగొట్టుకుంటే, ఇతరులు ఎవరైరనా చోరీ చేస్తే తక్షణం బ్యాంకు ఖాతాను రద్దు చేయించుకోవాలి. ఆలస్యం చేయకుండా సిమ్‌కార్డు నంబరు డిసేబుల్ చేయించుకోవాలి. గూగుల్‌పే, ఫోన్‌పే వంటి డిజిటల్ పేమెంట్ యాప్‌లు, అప్లికేషన్లు రెండు ఫ్యాక్టర్ ఆథెంటికేషన్ లేదా బయోమెట్రిక్ సెక్యూరిటీ వినియోగించుకోవాలి. చరవాణి పోయిన తక్షణమే సామాజిక ఖాతాలతో పాటు, డిజిటల్ పేమెంట్ ఖాతాల పాస్‌వర్డులు మార్చాలి. ఎంఎంటీఎస్ లేదా సీఈఐ ఆర్ పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేయాలి. సీఈఐఆర్ పోర్టల్ గూగుల్‌లో సెర్చ్ చేసి ఫిర్యాదు చేయవచ్చు. 9392941541 వాట్సప్ నంబరు ద్వారా కూడా ఫిర్యాదు అందించొచ్చు.

## గడువు ముంచుకొస్తున్నా.. ఉలకరు.. పలకరు!

రేగిడి : విజయనగరం- పాలకొండ రహదారిలో రాజాం దాటిన తర్వాత చేపట్టాల్సిన అభివృద్ధి పనులు పూర్తికాక ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. గత ప్రభుత్వం హయాంలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో రాజాం దాటిన తర్వాత 45 నుంచి 47.. తిరిగి 51 నుంచి 64 కిలోమీటర్ల వరకు పనులు చేసేందుకు రూ.8.82 కోట్లు మంజూరు చేశారు. గుత్తేదారు 49 శాతం పూర్తిచేశారు. ర.భ. శాఖ అధికారులు రూ.4 కోట్ల వరకు బిల్లులు కూడా పెట్టారు. ప్రభుత్వం నుంచి పైసా రాకపోవడంతో పనులు నిలిచిపోయాయి.



**పెరుగుతున్న ప్రమాదాలు**

నిత్యం వేలాది వాహనాలు తిరిగే రోడ్డులో పనులు పూర్తికాకపోవడంతో తీవ్ర ఇక్కట్లు ఎదురవుతున్నాయి. ప్రధానంగా రేగిడి మండలంలోని ఉంగరాడమెట్ట, మజ్జి రాముడుపేట గ్రామాల వద్ద బస్సు కూడళ్లు కావడంతో రద్దీ ఎక్కువగా ఉంటుందని తారు బదులు సీసీ వేయాలని నిర్ణయించారు. ఆ పనులు కాలేదు. వర్షం పడితే వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. ఇంకోవైపు ఈనెల 31తో గడువు ముగుస్తోంది. అలాగే చేయకపోతే పనులు రద్దవుతాయి.

ఉన్నతాధికారులకు నివేదించాం..: గుత్తేదారుకు నోటీసులు జారీచేశాం. అయినా ఇంతవరకు ముందుకు రాలేదు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. మజ్జి రాముడుపేట వద్ద రహదారి గోతులు కొంతవరకు సరిచేశాం. పనులు ప్రారంభానికి చర్యలు తీసుకుంటాం.

– నాగభూషణరావు, ర.భ.శాఖ జేఈ, రాజాం

## నిధులు లేక.. ప్రగతి సాగక

గుంతకల్లు: గుంతకల్లు, గుత్తి, తాడిపత్రి ప్రాంతాల్లో పలు ప్రగతి పనులు నిధుల కొరతతో అర్థాంతరంగా నిలిచిపోయాయి. వీటిని పూర్తి చేయడానికి నిధులు కేటాయించాలని వివిధ శాఖల అధికారులు ప్రభుత్వానికి నివేదిస్తున్నా ప్రయోజనం లేకుండా పోతోంది. ఇది వరకు ప్రారంభించిన నిర్మాణాలను సకాలంలో పూర్తిచేయక పోవడంతో కట్టడాలు దెబ్బతింటున్నాయి. సకాలంలో పూర్తయి ఉంటే ప్రజాప్రయోజనం ఉండేదని పలువురు పేర్కొంటున్నారు.

మూడు మున్సిపాలిటీల్లో రూ.8.54 కోట్లు విలువ చేసే భవనాల పనులు మధ్యలో ఆగిపోయాయి. ఫలితంగా వాటి నిర్మాణ వ్యయం పెరుగుతూ పోతోంది. సకాలంలో పనులను పూర్తిచేసి ఉంటే ప్రభుత్వ నిధులు ఆదా అయ్యేవి.

**క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే..**

గుంతకల్లులో ఇండోర్ స్టేడియం లేని కారణంగా క్రీడాకారులు ఆటలు ఆడుకోవడానికి సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారు.

పాతగుంతకల్లులో గ్రంథాలయానికి భవనాన్ని నిర్మించడానికి గత మున్సిపల్ అధ్యక్షుడు హనుమేశ్‌రావ్ స్థలాన్ని విరాళంగా అందించారు. భవనాల నిర్మాణం పునాదులకే పరిమితమమైంది.

తాడిపత్రిలో ఇండోర్ స్టేడియం నిర్మాణాన్ని గత తెదేపా ప్రభుత్వం ప్రారంభించగా వైకాపా అధికారంలోకి వచ్చిన తరువాత పనులను ఆపేశారు. వైకాపా ప్రభుత్వం చేపట్టిన కస్తూర్బా గాంధీ జూనియర్ కళాశాల భవనాలు, పట్టణ ఆరోగ్యకేంద్రం భవనాల నిర్మాణాన్ని వైకాపా ప్రభుత్వం ప్రారంభించింది. అప్పట్లో కావాల్సినంత నిధుల కేటాయింపు లు లేక పనులు సాగలేదు.



గుత్తి ఆర్ఎస్‌లో స్త్రీశక్తి భవన్ నిర్మాణ పనులను గత తెదేపా ప్రభుత్వ హయాంలో ప్రారంభించారు. తరువాత వచ్చిన వైకాపా పూర్తిచేయడానికి నిధులు ఇవ్వలేదు. గుత్తిలో చిన్న పిల్లల పార్కు పనులను కూడా గతంలో ప్రారంభించి వదిలేశారు. ప్రభుత్వానికి నివేదించాం

– నయీం అహమ్మద్, మున్సిపల్ కమిషనర్

గుంతకల్లు మున్సిపాలిటీలో అర్థాంతరంగా ఆగిపోయిన నిర్మాణాలను పూర్తిచేస్తాం. రాష్ట్ర ప్రభుత్వం త్వరలో నిధులు విడుదల చేయనుంది. ఆయా పనుల వివరాలను ప్రభుత్వానికి నివేదించాం. అనుమతులు, నిధులు రాగానే ఆగిపోయిన ప్రగతిని పట్టాలెక్కిస్తాం.

# అన్నీ ఉన్నా.. సిబ్బందే శని!



కడప : డెంగీ, మలేరియా ఇతర వైరల్ జ్వరాలు పట్టణ వాసుల్ని వణికిస్తున్నాయి. దగ్గు, జలుబు, ఇతర సీజనల్ వ్యాధులతో జనం అల్లాడుతున్నారు. ఆర్ఎంపీ మొదలుకుని కార్పొరేట్ వరకు అన్ని వైద్యశాలలు రోగులతో కిటకిటలాడుతున్నాయి. అదే సమయంలో జిల్లా వైద్యఆరోగ్య శాఖ అజమాయిషీలో పనిచేస్తున్న పట్టణ ఆరోగ్య కేంద్రాల పనితీరు మాత్రం అధ్వానంగా మారింది. ఆసుపత్రుల్లో అన్ని వసతులున్నా.. ప్రభుత్వం 172 రకాల మందులను అందుబాటులో ఉంచినా.. సేవలందించాల్సిన సిబ్బంది పలుచోట్ల ముఖం చాటేస్తున్నారు. కడప నగరం, ప్రొద్దుటూరు పట్టణంలోని కొన్ని పట్టణ ఆరోగ్య కేంద్రాలనుబృందం పరిశీలించింది. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించకపోవడం, కొందరు అసలు విధులకే రాకపోవడం రోగుల పాలిట శాపంగా మారినట్లు గుర్తించింది.

**వస్తారు.. నిలకడగా ఉండరు**

మారుతీనగర్ వైద్యశాలను సకాలంలో తెరిచారు. వైద్యులు ఇతర సిబ్బంది సైతం సమయానికే వచ్చారు. కానీ కొంతసేపటికే అక్కడి నుంచి వెళ్లిపోయారు. రోగులకు కావాల్సిన పలు రకాల మందులు బయట కొనాలని చీటీలు రాసివ్వడం గమనార్హం.

**అక్కడ కింది స్థాయి సిబ్బందే దిక్కు**

పాత కడప వైద్యశాలలో ఓపీకి వచ్చే రోగుల సంఖ్య ఎక్కువ. వైద్యులు మాత్రం విధులకు రావడం లేదు. నర్సులు, ఇతర సిబ్బందే నిబంధనలకు విరుద్ధంగా సేవలందిస్తున్నారు. మందులు, సూదులు బయటే తెచ్చుకోవాలని రోగులకు సూచిస్తున్నారు.

**ప్రొద్దుటూరు.. వేళకు రారు**

ప్రొద్దుటూరులోని ఆరు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోనూ వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించలేదు. వైద్యులు ఉదయం 10 గంటలకు హాజరై మధ్యాహ్నం ఒంటి గంటకు వెళ్లిపోయారు. లైట్‌పాలెం పట్టణ ఆరోగ్య కేంద్రంలో పది గంటల సమయం దాటినా ఇద్దరే హాజరయ్యారు. తర్వాత వైద్యులు వచ్చినా మధ్యాహ్నం ఒంటి గంటకు ఓపీ నిలిపేశారు.

**స్పందించిన డీఎంహెచ్‌వో**

పరిశీలనలో వెలుగుచూసిన అంశాలను డీఎంహెచ్‌వో దృష్టికి తీసుకెళ్లింది. గైర్హాజరుపై తీవ్రస్థాయిలో స్పందించారు. విధుల నుంచి ఎందుకు తొలగించరాదో తెలపాలని పాత కడప వైద్యశాల వైద్యుడికి సంజాయిషీ నోటీసులు జారీ చేశారు. యూపీహెచ్‌సీ వైద్యులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి విధులకు గైర్హాజరైతే తీవ్ర చర్యలు తప్పవని హెచ్చరించారు.

**వచ్చారు... అయితే ఆలస్యం**

పాత రిమ్స్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వైద్యశాలను ఉదయం తొమ్మిది గంటలకు తెరిచారు. ఈ సమయానికి ఫార్మసిస్టు ఒక్కరే వచ్చారు. ఇద్దరు స్టాఫ్‌నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్, వైద్యురాలు అంతా వచ్చేటప్పటికి 9.45 అయింది. డేటా ఎంట్రీ ఆపరేటర్, అటెండరు హాజరు కాలేదు.

**నర్సులే వైద్యులయ్యారు**

నిరంజన్ నగర్‌లోని వైద్యశాలలో వైద్యులు, డేటా ఎంట్రీ ఆపరేటర్, అటెండరు విధులకు రాలేదు. నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్ రోగులను పరీక్షించారు. ఫార్మసిస్టు మందులు ఇచ్చారు. అధిక రక్తపోటుకు వాడే అటెన్ మాత్రలు ఇవ్వడం లేదని రోగులు చెప్పారు.

# ఇసుకంతా మాయం.. ఇసుమంతైనా లేదు భయం



జమ్మలమడుగు : రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఉచిత ఇసుక విధానం కొందరికి కాసులు కురిపిస్తోంది. సామాన్యులు తమ సొంత ఇంటి అవసరాలకు ట్రాక్టర్లలో తరలించుకోవచ్చున్న వెసులుబాటును అక్రమార్కులు తమకు అనుకూలంగా మలుచుకుంటున్నారు. యంత్రాలతో యథేచ్ఛగా తవ్వకాలు చేపడుతున్నారు. నదీ గర్భాలను గుల్ల చేస్తున్నారు. ఇతర ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. జమ్మలమడుగు నుంచి పొన్నతోట వెళ్లే దారిలో ఈ వ్యవహారం మరింత జోరుగా సాగుతోంది.


**డోజర్లు ఏర్పాటు చేసి వసూళ్లు**

పెన్నా నదిలో కొందరు డోజర్లను ఏర్పాటు చేశారు. ట్రాక్టర్లకు ఇసుక నింపుతూ సదరు యజమానుల నుంచి రూ. 800 వసూలు చేస్తున్నారు. ట్రాలీకి చెక్కలు అమర్చి పరిమితికి మించి ఇసుకను నింపుకొంటున్నారు. రెవెన్యూ, సచివాలయ ఉద్యోగుల నుంచి అనుమతి పత్రాలు తీసుకోకుండానే ఈ తంతు సాగిస్తున్నారు. ఆపై కర్నూలు, నంద్యాల జిల్లాలోని నొస్సం, మాయలూరు, శిరివెళ్ల, కోవెలకుంట్ల, బనగానపల్లె, ఆళ్లగడ్డ తదితర ప్రాంతాలకు తరలించి రూ. 6 వేల నుంచి రూ.7,500కు విక్రయిస్తున్నారు. ముద్దనూరు రోడ్డులోని పెన్నా వంతెన సమీపంలో ఇసుక తవ్వకాలతో 2021లో వంతెన కుంగిపోయి 14 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఆ తర్వాత అక్కడ నిషేధం విధించినా తవ్వకాలు సాగుతున్నాయి.

**శ్మశానాన్నీ వదలని అక్రమార్కులు**

జమ్మలమడుగు నుంచి వేపరాల వెళ్లే దారిలో ఇసుక దిబ్బలను ఏటిగడ్డగా స్థానికులు పిలుస్తుంటారు. అక్కడే హిందూ శ్మశానవాటిక ఉంది. గత నెల 11న ట్రాక్టర్లలో ఇసుక నింపుతుండగా స్థానికులు, రజకులు అడ్డుకున్నారు. శ్మశానవాటికలోని సమాధులను తవ్వేస్తున్నారని, నదిలో గుంతల కారణంగా ఉతికిన వస్త్రాలు ఆరవేయడానికి స్థలం లేకుండా చేస్తున్నారని నిలదీశారు. అయినా అక్రమార్కులు ఆపడం లేదు. పెన్నా వంతెన వద్ద ఇసుక తవ్వకాలకు అనుమతి లేదని జమ్మలమడుగు తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి అన్నారు. పొన్నతోట రహదారిలోనూ పరిశీలించి ఇసుక అక్రమంగా తరలిపోకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# కాలనీ ఇచ్చారు.. కర్తవ్యం మరిచారు!



భోగాపురం: సాయంత్రం సూర్యాస్తమయం అవుతోంది.. గ్రామశివారులోని పాతచెరువు పక్కన కూర్చున అప్పారావు కళ్లల్లో నీళు తిరుగుతున్నాయి. 'తాత తండ్రుల నుంచి సాగుచేస్తున్న పంట భూములు దూరమయ్యాయి.. చెమటోడ్చి పనులు చేసిన చేతులు ఖాళీగా వణుకుతున్నాయి.. మేమిచ్చిన భూముల్లో విమానాలు రయ్‌న ఎగరబోతున్నాయి.. ఇళ్లు ఇచ్చిన కాలనీలో మాత్రం కనీస సదుపాయాలు కల్పించలేదని, అత్యవసరానికి ఉపయోగపడడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.'

విమానాశ్రయం నిర్మాణంలో ఇళ్లు కోల్పోయిన భోగాపురం మండలంలోని ముడసర్లపేట, సరగడపేట గ్రామాలకు చెందిన 269 కుటుంబాలకు నష్టపరి హారంతో పాటు నిర్వాసిత కాలనీని ప్రభుత్వం మంజూరు చేసింది. దీంతో పాటు విద్యుత్తు, తాగునీరు, రహదారులు తదితర మౌలిక సదుపాయాల కల్పనకు హామీ ఇచ్చింది. పాత గ్రామాల్లో ఉన్న ఆలయాలు, పాఠశాలలు ఇక్కడ నిర్మిస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీ నెరవేరలేదు. దూరంగా ఏర్పాటైన పాఠశాలలకు వెళ్లేందుకు పిల్లలు ఇబ్బంది పడుతున్నారు. నిర్వాసితులకు ఇచ్చిన కాలనీ 22ఏ జాబితాలో ఉండడంతో అత్యవసర పరిస్థితుల్లో అమ్ముకునేందుకు, బ్యాంకులో తాకట్టుపెట్టేందుకు వీలులేకుండా పోయింది. స్థలాలు కేటాయించారు తప్ప పూర్తిస్థాయిలో హక్కులు కల్పించలేదు. విద్య, వైద్య అవసరాలకూ స్థలాలు అమ్మకోలేని పరిస్థితి. కాలనీ సర్వే నంబరును నిషేధ జాబితా నుంచి తొలగించి గ్రామ కంఠంగా మార్చి, పట్టాలివ్వాలని నిర్వాసితులు కోరుతున్నారు. అలాగే గ్రామాల నుంచి గతంలో వలస వెళ్లిన 76 కుటుంబాలకూ పరిహారం, పునరావాసం కల్పించాలన్నారు. ఇటీవల ఇదే కాలనీకి చెందిన ఓ వ్యక్తి తన కుమార్తె వివాహానికి ఇంటిపై అప్పు తీసుకునేందుకు బ్యాంకుకు వెళ్తే.. సరైన పత్రాలు లేవంటూ తిరస్కరించారు. చేసేదిలేక బయట అధిక వడ్డీకి రుణం తీసుకుని పెళ్లి చేశారు. భోగాపురం విమానాశ్రయం నిర్మాణంలో భాగంగా ఇళ్లు కోల్పోయిన ఎందరో నిర్వాసితుల ఆవేదనిది.

**జీవనోపాధి కోల్పోయాం** భూములు కోల్పోయిన తర్వాత రైతులు జీవనోపాధికి తంటాలు పడుతున్నారు. విమానాశ్రయం పూర్తికాగానే ఉద్యోగాలు వస్తాయని చెప్పిన నాటి నేతల మాటలు కాగితాలకే పరిమితమయ్యాయి. పొలాలు పోయి, రోజువారీ కూలీలుగా మారాం.

– తాతారావు, కాలనీవాసి

**ఉన్నతాధికారులకు చెప్పాం..** ఆర్‌అండ్‌ఆర్ కాలనీ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. పునరావాస కాలనీలో ఇళ్లు మంజూరు చేసిన నిర్వాసితుల వివరాలను ఉన్నతాధికారులకు అందజేశాం. 22ఏ జాబితా నుంచి వీటిని తొలగించేలా చర్యలు తీసుకుంటాం. కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పనకు కృషి చేస్తున్నాం. – తహసీల్దారు రమణమ్మ, ఇన్‌ఛార్జి ఎంపీడీవో గాయత్రి

## కాలనీనే తవ్వేసి.. ఎర్రమట్టి దోచేసి

అనంతపురం : నగరంలో సొంతిళ్లు లేని నిరుపేదలకు పక్కా ఇల్లు నిర్మించాలనే ఉద్దేశంతో పసలూరు నుంచి సిద్ధరాంపురం వెళ్లే దారిలో రైతుల నుంచి 50 ఎకరాల భూమిని కొనుగోలు చేసి లేఅవుట్ వేశారు. ప్లాట్లు వేసి రహదారులు, విద్యుత్తు సౌకర్యం కల్పించారు. ఐదేళ్లలో పునాదులు మాత్రమే నిర్మించిన వైకాపా సర్కారు.. ఇంటి నిర్మాణాలను పూర్తి చేయలేదు. ఇప్పుడా కాలనీలో ఎర్రమట్టి దోపిడీ సాగుతోంది.

**రహదారి ఛిద్రం**

టిప్పర్లు పసలూరు, కొత్తపల్లి, ఉప్పరపల్లి గ్రామాల మీదుగా అనంతపురం వైపు రాకపోకలు సాగించడంతో గ్రామానికి చెందిన దారంతా కంకరతేలి అధ్వానంగా మారింది. ఇంత జరుగుతున్నా రెవెన్యూ, గనులశాఖ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. రూ.కోట్లతో ఏర్పాటు చేసిన జగనన్న కాలనీ దారుణంగా తయారైంది.

**నగరానికి దూరం కావడంతో..**



కాలనీ అనంతపురానికి 9 కి.మీ. దూరంగా ఉండటంతో లబ్ధిదారులు వెళ్ల లేదు. ఇదే అదునుగా భావించి పసులూరుకు చెందిన కొందరు ఎర్రమట్టి వ్యాపారులతో కుమ్మక్కై జేసీబీలతో రాత్రి, పగలు తవ్వకాలు చేపట్టారు. పునాదులు, మట్టి రహదారులను ఐదారు అడుగుల లోతు తత్వారు. మట్టిని అనంతపురం నగర పరిధిలో ఏర్పాటు చేస్తున్న లేఅవుట్ల నిర్వాహకులకు విక్రయించి రూ.లక్షలు గడిస్తున్నారు.

గత వైకాపా ప్రభుత్వం బుక్కరాయసముద్రం మండలం పసలూరు గ్రామంలో ఏర్పాటు చేసిన జగనన్న కాలనీలో అక్రమార్కులు ఎర్రమట్టి కోసం బరితెగించారు. అక్కడి రహదారులు, పునాదులనూ వదల్లేదు. కొత్త ఇంటి కోసం నిర్మించిన కట్టడాల కింద ఉన్న మట్టిని తవ్వి సొమ్ము చేసుకున్నారు.

**పరిశీలించి చర్యలు తీసుకుంటాం**

– శ్రీధరమూర్తి, తహసీల్దార్, బుక్కరాయసముద్రం

కాలనీలో తవ్వకాలకు సంబంధించి సిబ్బంది చేత పరిశీలింపజేస్తాం. అక్రమార్కులను గుర్తించి చట్టపరంగా తగిన చర్యలు తీసుకుంటాం.

## అలసి.. సొలసి.. కన్నుమూసి

తిరుపతి : ఎక్కడ పుట్టారో.. ఎలా బతికారో.. ఎలాంటి కష్టం వచ్చిందో తెలియదు. జీవిత చరమాంకంలో అలిపిరి చేరుకుంటున్నారు. ఇల్లు, కుటుంబాన్ని వదిలిపెట్టి రహదారుల పక్కన దయనీయ జీవనం గడుపుతున్నారు. చివరి రోజుల్లో అండగా ఉండేవారు లేక పుణ్యం కోసం ఎవరో ఇచ్చే ఆహారం తిని అలిపిరి మార్గంలోని ఫుట్పాత్‌లపై గడుపుతున్నారు. నిత్యం రాష్ట్ర హద్దులు దాటి వచ్చి శ్రీనివాసుడి చెంతకు చేరే వారి సంరక్షణకు పాలకులూ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు.

**ఏం చేస్తున్నారు..?**

తల్లిదండ్రులను బిడ్డలే అలిపిరి వదిలి వెళ్లిన ఘటనలు కోకొల్లలు. అనారోగ్యం బారినపడితే రుయాలో చికిత్స చేయిస్తామని తీసుకొచ్చి



వదిలించుకున్న బిడ్డలూ ఉన్నారు. చికిత్స అనంతరం ఇంటికి వెళ్లే దారి తెలియక.. వెళ్లే ఇష్టం లేక రహదారుల పక్కన ఉంటున్నారు. చివరికి అనారోగ్యంతో కదల్లేని పరిస్థితుల్లో విగతజీవులుగా మారుతున్నారు. ఒక్కోసారి మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చినా స్పందించని వారూ ఉన్నారు.

అలిపిరి, తిరుపతి, తిరుచానూరు ప్రాంతాల్లో నెలకు సుమారు 30 మంది అనాథలు మృతి చెందుతున్నారు.

**కారణాలు** వృద్ధులైన తల్లిదండ్రులను భారంగా భావించడం.

అనారోగ్యంపాలైతే ఆలనాపాలనా చూసుకోలేక ఆసుపత్రిలో వదిలివెళ్లడం.

ఆస్తులు పంచాక.. పిల్లలు వృద్ధుల బాగోగులు చూడకపోవడం.

కుటుంబ సభ్యులతో గొడవలు.

భార్య చనిపోయాక ఒంటరైన భర్త ఇంట్లో ఇమడలేక.

జీవిత చరమాంకం ఆ వేంకటేశ్వరుడి సన్నిధిలో ముగించాలని.

**ఏం చేయాలి..?**

కొన్ని నగరాలు, పట్టణాల్లో నైట్ షెల్టర్లు ఉన్నాయి. వీటి నిర్వహణ బాధ్యతలు పురపాలికలు, నగరపాలికలే చూస్తుంటాయి. అనాథలు ఇలాంటిచోట్ల ఆశ్రయం పొందుతారు. ఇలాంటి షెల్టర్లు తిరుపతిలోనూ ఏర్పాటు చేస్తే వారికి నీడ కల్పించినట్లు అవుతుంది.

## జౌరా.. సౌర

తిరుపతి : ఆ విద్యాసంస్థలకు సాధారణంగా వచ్చే విద్యుత్తు బిల్లు సైతం తగ్గిపోయింది. ఎప్పటికీ తరగని సౌర విద్యుత్తును సద్వినియోగం చేసుకోవడమే దీనికి కారణం. తిరుపతి ఐఐటీ, ఐసర్ విద్యాసంస్థల్లో తరగతి గదులు, పరిశోధనా కేంద్రాలు, వసతిగృహాలతో పాటు అంతర్గత దారుల్లో వీధి దీపాలు ఇలా పూర్తిస్థాయిలో సౌరవిద్యుత్తు అందుబాటులోకి తీసుకురావడం విశేషం. విద్యాసంస్థలు ప్రారంభం నుంచే దీని వినియోగంపై దృష్టిసారించారు.

తొలిసారిగా ఇక్కడే..ఏర్పేడు సమీపంలో 548 ఎకరాల్లో తిరుపతి ఐఐటీ, శ్రీనివాసపురం సమీపంలోని సుమారు 280 ఎకరాల్లో ఉన్న ఐసర్ విస్తరించాయి. సౌర విద్యుత్తును ఉపయోగించుకోవాలన్న ఆలోచనతో భవనాలు, వాహనాల పార్కింగ్ షెడ్లపై పలకలు బిగించారు.

ఐఐటీలో తొలిసారిగా దక్షిణ ప్రాంగణంలో దీన్ని ప్రారంభించారు. ఇటీవల శాశ్వత భవనాలపై సౌర పలకలు బిగించడంతో, ప్రస్తుతం ప్రతి నెలా ఒక మెగావాట్ ఉత్పత్తి అవుతోంది.

ఐసర్‌లోనూ వివిధ భవనాలపై సౌర పలకలు ఏర్పాటుచేశారు. ఒక మెగావాట్ ఉత్పత్తి అవుతోంది.

**మరింత విస్తరణకు..**

ఇరు విద్యాసంస్థల్లో వినియోగించగా, మిగిలిన కరెంట్‌ను గ్రిడ్‌కు అందిస్తున్నారు. రూ.7.20 చొప్పున విద్యుత్తు శాఖ కొనుగోలు చేస్తోంది. ఈ మేర బిల్లులో తగ్గిస్తుండటం గమనార్హం. రానున్న రోజుల్లో దశలవారీగా 1.5 నుంచి 3 మెగావాట్లు సౌర విద్యుత్తు ఉత్పత్తి చేసే దిశగా చర్యలు చేపట్టామని, ప్రణాళికలు సిద్ధమని ఆయా విద్యాసంస్థల ఇంజినీరింగ్ విభాగం అధికారులు తెలిపారు. మరోవైపు సౌరవిద్యుత్తు వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు పలు కార్యక్రమాలు చేపట్టనున్నారు.

చురకలు



# అచ్చియమ్మ ఆయన అమ్మమ్మ పేరా?

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్, జాన్వీ కపూర్ జంటగా బుచ్చిబాబు సానా పెద్ది చిత్రాన్ని తెరకెక్కిస్తోన్న సంగతి తెలిసిందే. ఇందులో చరణ్ పెద్ది పాత్రలో కనిపించబోతున్నాడు. ఇప్పటికే రిలీజ్ అయిన పోస్టర్లతో చరణ్ పాత్ర ఎలా ఉంటుంది? అన్నది ఓ ఐడియా వచ్చింది. పూర్తి మాస్ కోణంలోసాగే రోల్ గా హైలైట్ అవుతుంది. అలాగే జాన్వీ కపూర్ అచ్చియమ్మ అనే అమ్మాయి పాత్రలో నటిస్తుంది. ఇందులో మోడ్రన్ అచ్చియమ్మగా కనిపిస్తుంది. %-%పెద్ది%-% ప్రేమికురాలి రోల్ అది. ఆ రెండు పాత్రల మధ్య రొమాన్స్ కూడా ఘాటుగానే ఉంటుందని ఇప్పటికే ప్రచారంలో ఉంది.

**అచ్చియమ్మ వెనుక కారణం:** అయితే జాన్వీకపూర్ పాత్రకు అచ్చియమ్మ అనే పేరు పెట్టడంతో విషయం ఆసక్తికరంగా మారింది. ప్రత్యేకంగా అచ్చియమ్మ అన్నది హైలైట్ గా మారింది. సాధారణంగా ఇలాంటి పేర్లు పాత సినిమాల్లో కనిపిస్తుంటాయి. ఆ తర్వాత కాలంలో కూడా



ఏ హీరోయిన్ కు ఇలాంటి పేరు పెట్టలేదు. ఎంత పాత సినిమాలు చేసినా పేర్ల వరకూ మోడ్రన్ గా ఉండేలా చూసుకునే వారు దర్శకులు. కానీ పెద్ది లో హీరోయిన్ పాత్ర పేరు మాత్రం ఇప్పుడు హైలైట్ గా మారింది. ప్రత్యేకంగా అచ్చియమ్మ అని పెట్టడానికి గల కారణాలు ఏంటి? అని ఆరాలు మొదలయ్యాయి.

**స్వచ్ఛమైన తెలుగు పేరు:** ఈ నేపత్యంలో హీరోయిన్ పాత్ర అలాంటి పేరు డిమాండ్ చేయడంతో పాటు..బుచ్చిబాబు అమ్మమ్మ గారి పేరు కూడా అచ్చియమ్మ అని ఫిలిం సర్కిల్స్ లో మాట్లాడుకుంటున్నారు. ఈనేపథ్యంలో జాన్వీ కపూర్ పాత్ర కు గుర్తుగా అచ్చియమ్మ అని పేరు పెట్టారని చర్చ జరుగుతుంది. మరి ఇందులో నిజమెంత? అన్నది తేలాలి. ఏది ఏమైనా ఈ పేరు పెట్టడం అన్నది పెద్ద సాహసమే. %-%రంగస్థలం%-%లో హీరోయిన్ సమంత పక్కా పల్లెటూరి అమ్మాయి పాత్రలో కని పిస్తుంది. ఆ పాత్రకు సుకుమార్ రామలక్ష్మి అని పేరు పెట్టారు. పల్లెటూరి అమ్మాయికి ఎంతో స్వచ్ఛమైన పేరు.

**సుకుమార్ కంటే మూలాల్లోకి:** అందులో తెలుగుదనం ఉట్టి పడుతుంది. ఇప్పుడు సుకుమార్ శిష్యుడు అంతకు మించి తెలుగు దనం హైలైట్ అయ్యేలా పాత్రల పేరు పరంగా ఇంకా మూలాల్లోకి వెళ్లినట్లు కనిపిస్తోంది. అచ్చియమ్మ అన్నది టైటిల్ కార్డులో పడుతుంది. సినిమాలో అదే పేరును అచ్చెమ్మ అని కూడా పిలిచే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం పెద్ది ఆన్ సెట్స్ లో ఉన్న సంగతి తెలిసిందే. 60 శాతం చిత్రీకరణ పూర్తయింది. అన్ని పనులు పూర్తి చేసి మార్చిలో లో రిలీజ్ చేయాలని ప్లాన్ చేస్తున్నారు.

# అందాలతో ఉక్కిరి బిక్కిరి చేస్తున్న నర్గీస్ ఫక్రీ!

సెలబ్రిటీలు అంటే ఎప్పుడు గ్లామర్ లుక్ లోనే కాకుండా.. అప్పుడప్పుడు సాంప్రదాయంగా కూడా కనిపిస్తూ అందరిని ఆశ్చర్యపరుస్తూ ఉంటారు. అందులో భాగంగానే కొంతమంది చీర కట్టుకుంటే.. మరికొంతమంది లెహంగా ధరించి తమ అందాలతో ఉక్కిరిబిక్కిరి చేస్తూ ఉంటారు. ఈ క్రమంలోనే తాజాగా తన అందాలతో మరొకసారి ప్రేక్షకులను అలరించే ప్రయత్నం చేసింది ప్రముఖ బ్యూటీ. ఈమె బాలీవుడ్ లో తన అందాలతో ప్రేక్షకులను ఆకట్టుకోవడమే కాకుండా నటనతో అంతకుమించి పెర్ఫార్మెన్స్ కనబరుస్తూ అభిమానుల హృదయాలను దోచుకుంటోంది. తాజాగా పీచ్ కలర్ లెహంగా ధరించి తన అందాలతో అభిమానులను ఆకట్టుకునే ప్రయత్నం చేసింది. హెవీ ఎంబ్రాయిడరీ తో డిజైన్ చేసిన ఈ లెహంగా అటు అబ్బాయిలనే కాదు అమ్మాయిలను, ఫ్యాషన్ ప్రియులను కూడా ఆకట్టుకుంటుంది అని చెప్పవచ్చు. ఇంతకీ ఆమె ఎవరనుకుంటున్నారా ప్రముఖ బాలీవుడ్ బ్యూటీ నర్గీస్ ఫక్రీ. చాలా హెవీ ఎంబ్రాయిడరీ తో డిజైన్ చేసిన ఈ



లెహంగా ఈమె అందాన్ని మరింత రెట్టింపు చేసింది అనడంలో సందేహం లేదు. ఏదేమైనా నర్గీస్ ఫక్రీ తాజాగా షేర్ చేసిన ఈ గ్లామర్ ఫోటోలు అభిమానులను విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. నర్గీస్ ఫక్రీ కెరియర్ విషయానికొస్తే.. 1979 అక్టోబర్ 20వ తేదీన జన్మించిన ఈమె అమెరికన్ కి చెందిన భారతీయ మోడల్గా తన కెరీర్ ను మొదలుపెట్టిన ఈమె.. నటిగా 2011లో రాక్ స్టార్ అనే సినిమాతో సినీ రంగంలోకి అడుగు పెట్టింది. మొదటి సినిమాతోనే ఉత్తమ నటన కనబరిచి ఉత్తమ మహిళా నటిగా ఫిలింఫేర్ అవార్డుకు ఎంపికయింది. బాలీవుడ్లో చాలా సినిమాలలో చేసి ప్రేక్షకులను ఆకట్టుకునే ఈమె ఈ ఏడాది పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా జ్యోతి కృష్ణ దర్శకత్వంలో వచ్చిన హరిహర వీరమల్లు సినిమాలో నటించి ఆకట్టుకుంది. ఇక ఈ చిత్రాన్ని డీవీవీ బ్యానర్ పై డీవీవీ దానయ్య భారీ బడ్జెట్లో నిర్మించారు. అటు పవన్ కళ్యాణ్ కూడా ఆంధ్రప్రదేశ్ కి డిప్యూటీ సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత రిలీజ్ చేసిన మొదటి చిత్రం ఇది.




# ఆఫ్రో టపాంగ్ సాంగ్.. ఆ వేషాలే సంథింగ్ స్పెషల్



శివరాజ్ కుమార్, ఉపేంద్ర, రాజ్ బి శెట్టి వంటి అగ్ర నటులతో అర్జున్ జన్య తెరకెక్కిస్తున్న చిత్రం 45 ది మూవీ. సూరజ్ ప్రొడక్షన్స్ పతాకంపై శ్రీమతి ఉమా రమేష్ రెడ్డి, ఎం రమేష్ రెడ్డి భారీ ఎత్తున నిర్మిస్తున్నారు. ఇప్పటి వరకు వచ్చిన పోస్టర్, గ్లింప్స్ భారీ హైప్‌ను సృష్టించాయి. ఈ చిత్రాన్ని డిసెంబర్ 25న విడుదల కానుంది. తాజాగా ఈ చిత్రం ఓ క్రేజీ సాంగ్‌ను విడుదల చేసారు. గెలుపు తలుపు దొరికే వరకు దిగులుపడుకురా.. అంటూ సాగే ఈ క్రేజీ సాంగ్‌కు రోల్ రైడా తెలుగులో సాహిత్యాన్ని అందించారు. రోల్ రైడా, వినాయక్ కలిసి ఆలపించిన ఈ పాటకు జానీ మాస్టర్ క్రేజీ స్టెప్పుల్ని కంపోజ్ చేశారు. ఈ వీడియో సాంగ్‌లోని వాతావరణం, చుట్టూ కనిపిస్తున్న ఆఫ్రికన్స్ తో జానీ మాస్టర్ వేయించిన స్టెప్పులు అదిరిపోయాయి. ఇక ఈ పాటలో శివ రాజ్ కుమార్, ఉపేంద్ర, రాజ్ బి శెట్టి విభిన్న అవతారాల్లో క్రేజీగా కనిపిస్తున్నారు. ఉపేంద్ర ఎప్పటిలాగే పిలకముడి, ఒళ్లంతా పచ్చ బొట్లు రంగు రంగుల డిజైనర్ డ్రెస్ లో వెరైటీగా కనిపించగా, రాజ్ బి శెట్టి కోయ దొర వేషంలో కనిపించాడు. కొంచెం హాస్యం, కొంచెం వెరైటీ, చాలా ఎనర్జీతో పాట ఆద్యంతం ఆకట్టుకుంది. కొంత మోడ్రన్ లుక్ లో శివన్న కనిపిస్తున్నాడు. ఈ పాటకు అర్జున్ జన్య ఇచ్చిన బాణీ కూడా చాలా డిఫరెంట్‌గా ఉంది. ప్రస్తుతం ఈ పాట యూత్‌ను విపరీతంగా ఆకర్షిస్తోంది. ఈ సినిమాకు డాక్టర్ కె రవి వర్మ, జాలీ బాస్టియన్, డిఫరెంట్ డానీ చేతన్ డిసౌజా స్టంట్స్ కొరియోగ్రాఫ్ చేయగా, అనిల్ కుమార్ మాటల్ని అందించారు. సత్య హెగ్డే కెమెరామెన్‌గా, కె.ఎం. ప్రకాష్ ఎడిటర్‌గా పని చేస్తున్నారు. త్వరలోనే అన్ని కార్యక్రమాల్ని పూర్తి చేసుకుని డిసెంబర్ 25న చిత్రాన్ని రిలీజ్ చేయనున్నారు.

# మత్తెక్కించే కళ్ళతో ఆకట్టుకుంటున్న ఐశ్వర్య మీనన్!





ఐశ్వర్య మీనన్..ఈ పేరు పెద్దగా తెలుగు వారికి తెలియకపోవచ్చు. ఎందుకంటే టాలీవుడ్ లో పేరున్న సినిమాలేవి ఈ హీరోయిన్ కి ఇంకా పడలేదు. టాలీవుడ్ లో గుర్తింపు కోసం పాకులాడుతూనే ఉంది. అయితే అలాంటి ఈ ముద్దుగుమ్మ తాజాగా సోషల్ మీడియా ఖాతాలో పెట్టిన హాట్ ఫోటోలు కుర్రకారుకు మత్తెక్కిస్తున్నాయి. తాజాగా ఐశ్వర్య మీనన్ అద్దం ముందు నిల్చొని ఫోటోలకు ఫోజులు ఇచ్చింది. ప్రస్తుతం ఐశ్వర్య మీనన్ తన ఇన్స్టాగ్రామ్ ఖాతాలో షేర్ చేసిన ఫోటోలు కుర్రకారుని మెస్మరైజ్ చేస్తున్నాయి. ఈ ఫోటోలలో అద్దం ముందు నిల్చున్న ఐశ్వర్య మీనన్ హాట్ ఫోజులు పెట్టి నడుము అందాలను హైలెట్ చేసింది.. పైన చిన్న టాప్ కింద జీన్స్ ప్యాంట్ తో ఫోటోలకు ఫోజులిచ్చిన ఐశ్వర్య మీనన్ అందాలకు చాలామంది నెటిజన్స్ ఫిదా అవుతున్నారు. ఈ హీరోయిన్ హాట్ ఫోజులకు హాట్ హాట్ కామెంట్స్ కూడా పెడుతున్నారు. అలా సింపుల్ డ్రెస్ లో హెయిర్ లీవ్ చేసి సాదాసీదా లుక్ తోనే ఐశ్వర్య మీనన్ తన చూపులతో మత్తెక్కిస్తుంది. కిల్లింగ్ లుక్స్ తో ఈ హీరోయిన్ ఉన్న ఫోటోలు ప్రస్తుతం ఇంటర్నెట్ ని షేక్ చేస్తున్నాయి. అలాగే మిర్రర్ ఒక గొప్ప మిత్రుడు అలాగే విమర్శకుడు అన్నట్లుగా ఓ క్యాప్షన్ కూడా రాసుకొచ్చింది. ప్రస్తుతం ఐశ్వర్య మీనన్ ఫోటోలు నెట్టింట్లో వైరల్ గా మారడంతో ఈ ఫోటోస్ చూసిన నెటిజన్లు ఫైర్ ఎమోజీలను షేర్ చేస్తూ చాలా అందంగా ఉన్నావు అంటూ కామెంట్లు పెడుతున్నారు. ఐశ్వర్య మీనన్ ఫొటోల గురించి పక్కన పెడితే..ఆమె తమిళ ఇండస్ట్రీ ద్వారా సినిమాల్లోకి ఎంట్రీ ఇచ్చింది. అలా కాదలిల్ సోదుప్పువదు ఎప్పడి అనే సినిమాతో తమిళ్ ఇండస్ట్రీ లోకి ఎంట్రీ ఇచ్చింది. ఆ తర్వాత తెలుగులో లవ్ ఫెయిల్యూర్ అనే సినిమా చేసినప్పటికీ ఈ మూవీ ఐశ్వర్య మీనన్ కి అంత గుర్తింపు తెచ్చిపెట్టలేదు. దాంతో తెలుగులో ఆఫర్స్ రాకపోవడంతో మళ్లీ తమిళ, కన్నడ,మలయాళ భాషల్లో వరుస సినిమాలు చేసింది. అలా చివరికి తెలుగులో మళ్లీ రవితేజ హీరోగా నటించిన ఖిలాడి మూవీ లో ఆఫర్ వచ్చింది. ఈ సినిమా తర్వాత నిఖిల్ హీరోగా చేసిన స్పై, ఆర్ఎక్స్ 100 ఫేమ్ కార్తికేయ హీరోగా చేసిన భజే వాయువేగం సినిమాలో నటించింది.

కానీ ఐశ్వర్య మీనన్ ఇన్ని సినిమాలు చేసినా ఇప్పటివరకు అయితే హీరోయిన్ గా అంత గుర్తింపు అయితే రాలేదు. మరి ముందు ముందు ఈ హీరోయిన్ ఎంచుకునే సినిమాలైనా ఈమెకు పేరు తెచ్చి పెడతాయో లేదో చూడాలి. ఐశ్వర్య మీనన్ కేవలం సినిమాలు మాత్రమే కాకుండా సీరియల్స్, పలు వెబ్ సిరీస్ లలో కూడా తన అదృష్టాన్ని పరీక్షించుకుంది. ఇక ఈ హీరోయిన్ అప్ కమింగ్ సినిమాల విషయానికి వస్తే.. మలయాళం లో భజూకా అనే సినిమా తప్ప ఈ హీరోయిన్ చేతిలో వేరే సినిమాలు లేవని తెలుస్తోంది.అలా సినిమాల్లో ఆఫర్స్ కోసం సోషల్ మీడియాలో తన హాట్ ఫోటోలతో పిచ్చెక్కిస్తోంది.

# శ్రీలీల.. ఎన్ని రోజులు ఇలా

ఒక హీరోయిన్ తొలి సినిమా ఫ్లాప్ అయితే.. మళ్లీ అవకాశాలు దొరకడం కష్టమే. కానీ శ్రీలీల విషయంలో మాత్రం దీనికి భిన్నంగా జరిగింది. తెలుగులో తన తొలి సినిమా 'పెళ్ళి సంద-డి' డిజాస్టర్ అయినా.. అందులో తన అందచందాలు, డ్యాన్సులు యూత్‌కు బాగా నచ్చేశాయి. దీంతో తెలుగులో శ్రీలీలకు మంచి ఛాన్సులే వచ్చాయి. అందులోనూ రెండో చిత్రం 'ధమాకా' పెద్ద హిట్టయి శ్రీలీల డ్యాన్సులకు ఇంకా మంచి పేరు రావడంతో ఆమె వెనుదిరిగి చూసుకోవాల్సిన అవసరం లేకపోయింది. కెరీర్ ఆరంభంలోనే ఏకంగా మహేష్ బాబుతో 'గుంటూరు కారం'లో జట్టు కట్టే ఛాన్స్ లభించింది. అది కాక స్కంద, భగవంత్ కేసరి లాంటి క్రేజీ ప్రాజెక్టుల్లో నటించే అవకాశం అందుకుంది శ్రీలీల. కానీ 'ధమాకా' తర్వాత కథానాయికగా ఆమెకు ఒక్కటంటే ఒక్క సక్సెస్ లేదు. పైగా ఆమె పాత్రలు రొటీన్ అయిపోతుండడం.. తన నటన తేలిపోతుండడంతో శ్రీలీల కెరీర్



డోలాయమానంలో పడేలా కనిపిస్తోంది. ఒక్క 'భగవంత్ కేసరి'లో తప్పితే శ్రీలీల పెర్ఫామెన్సుకి ఎందులోనూ ప్రశంసలు దక్కలేదు. ఆమెవి కూరలో కరివేపాకు తరహా పాత్రలుగానే ఉంటున్నాయి. హీరోతో రొమాన్స్, కామెడీ చేయడం.. పాటల్లో డ్యాన్సులేయడం.. ఇదీ వరస. మొదట్లో క్యూట్‌గా అనిపించిన తన పాత్రలు, నటన.. తర్వాత ప్రేక్ష కులకు మొనాటనస్‌గా తోస్తున్నాయి. స్కంద, ఆదికేశవ, ఎక్స్‌ట్రార్డినరీ మ్యాన్, రాబిన్‌హుడ్, జూనియర్.. ఈ సినిమాలు వేటిలోనూ తన పాత్రకు ప్రాధాన్యం లేదు. నటన గురించి చెప్పుకోవడానికేమీ లేదు. ఆ జాబితాలోకి కొత్తగా 'మాస్ జాతర' కూడా వచ్చి చేరింది. ఇందులో శ్రీలీల పాత్ర, నటన తేలిపోయాయి. అసలే రవితేజ మార్కు రొటీన్ మాస్ మసాలా సినిమా.. అందులో వీక్ క్యారెక్టర్ పడడంతో శ్రీలీల మినిమం ఇంపాక్ట్ కూడా వేయలేకపోయింది. కేవలం డ్యాన్సుల్లో మాత్రం ఆమె మెరిసింది. కానీ సరైన పాత్ర, పెర్ఫామెన్స్ లేకుండా ఎన్నాళ్లిలా పాటల్లో మెరుపులతో సరిపెడుతుందనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. సుధ కొంగర దర్శకత్వంలో రానున్న 'పరాశక్తి'లో మాత్రం ఆమె కొత్తగా అనిపించే, పెర్ఫామెన్స్‌కు స్కోప్ ఉన్న పాత్ర చేస్తున్నట్లు కనిపిస్తోంది. అదైనా ఆమె కెరీర్‌ను మారుస్తుందేమో చూడాలి.

# జాక్ పాట్ కొట్టిన రష్మిక.. ఏకంగా డబుల్!

నేషనల్ క్రష్ రష్మిక మందన్న, కన్నడ హీరో దీక్షిత్ శెట్టి కాంబినేషన్లో రాహుల్ రవీంద్రన్ దర్శకత్వం వహించిన చిత్రం ది గర్ల్ ఫ్రెండ్. నవంబర్ 7వ తేదీన తెలుగు , హిందీ భాషలలో ప్రేక్షకుల ముందుకు రాబోతుండగా.. నవంబర్ 14న తమిళ్, మలయాళం, కన్నడ భాషలలో విడుదల కాబోతున్న నేపథ్యంలో.. సినిమా ప్రమోషన్స్ లో జోరుగా పాల్గొంటున్నారు చిత్ర బృందం. అయితే ఈసారి ఏకంగా కనీ వినీ ఎరుగని రీతిలో ఈ చిత్ర నిర్మాతలు సినిమా గురించి, సిని మాలో హైలెట్ గా నిలిచిన అంశాల గురించి చెప్పి అందరిని ఆశ్చర్యప రిచారు. మరి వారి మాటల్లోనే ఈ సినిమా హైలెట్స్ ఏంటో ఇప్పుడు చూద్దాం.

**ది గర్ల్ ఫ్రెండ్ నిర్మాత ధీరజ్ మొగిలినేని మాట్లాడుతూ..** కోవిడ్ 19 సమయంలో థియేటర్లు క్లోజ్ అయ్యాయి. అయితే ఆ తరువాత థియేటర్స్ అన్ని అందుబాటులోకి వచ్చాయి. అప్పుడే స్క్రిప్ట్ డెవలప్ చేసే పనిలో పడ్డాం. ఈ ప్రాజెక్టు తీసుకున్నప్పటి నుంచి థియేటర్ గానే వెళ్లేందుకు ప్లాన్ చేసాము. ప్రొడ్యూసర్ గా.. కమర్షియల్ గా



మూవీ ఉండాలని కోరుకుంటాం కదా.. మేము రిస్క్ చేసినా పర్వాలేదు. స్టోరీ బాగుండాలి అనే నమ్మాను. మేము అనుకున్న దానికంటే స్టోరీ మమ్మల్ని మెప్పించింది. విద్యాతో కూడా నాకు మంచి స్నేహబంధం ఏర్పడింది. నిర్మాణ వ్యయంలో పూర్తి నిర్ణయం తీసుకోవడంలో ఎటువంటి ఇబ్బందులు ఏర్పడలేదు. లవ్ స్టోరీస్ ను ఎవరో ఒకరి పాయింట్ ఆఫ్ వ్యూలో చెప్పాలి. అయితే ఈ కథ హీరోయిన్ కోణంలోనే ఉంటుంది. అందుకే స్టార్స్ ని ఇందులో హీరోగా తీసుకోలేదు. పర్ఫామెన్స్ ని మెయిన్ గా తీసుకొని దీక్షిత్ తీసుకున్నాము. దీక్షిత్ చాలా మంచి పెర్ఫార్మర్ ఈ ఏజ్ గ్రూప్ వాళ్ళను కూడా నటించేలా ఆకట్టుకున్నాడు. థియేట్రికల్ గా ఈ సినిమా చాలా బాగా వర్క్ అవుట్ అవుతుందని నమ్ముతున్నాము. అటు దీక్షిత్ ను తీసుకోవడం వల్ల కన్నడ మార్కెట్ కు కూడా ఉపయోగపడుతుందని మేము అనుకోలేదు. ఆయన పాత్రకు ఆయన కరెక్ట్ గా సెట్ అవుతాడనే తీసుకున్నాము. అయితే రష్మిక , దీక్షిత్ కలిసి ఇందులో నటించడం వల్లే మాకు కన్నడలో కూడా అడ్వాంటేజ్ ఏర్పడింది. ఈ సినిమా రిలీజ్ తర్వాత మరో కొత్త ప్రాజెక్టు కూడా అనౌన్స్ చేస్తామని తెలిపారు.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536